సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సంపుటి 20 ఫిబ్రవరి 1982 సంచిక 1

ఇదీ వరస...

ఈ నెల నవలానుబంధం


'నిన్నటి పూవు'

రచన

ఆకెళ్ళ రామచంద్రరావు

ముఖచిత్రం : విజయశాంతి

జ్యోతి, పి. బి. నెం. 1824, హైదరాబాదు-20


లైఫ్‌బాయ్
ఎక్కడో
ఆరోగ్యం అక్కడ
లైఫ్‌బాయ్‌తో స్నానం చేస్తే పరిశుభ్రంగా ఉంటారు మీరు. ఆరోగ్యమైన తాజాదనపు అనుభూతి పొందుతారు. లైఫ్‌బాయ్‌తో, జీవితం ఆరోగ్యప్రదం. గుర్తుంచుకోండి...
లైఫ్‌బాయ్
మురికిలో గల క్రిములను
కడిగి వేస్తుంది
LIFEBUOY
for health
హిందుస్తాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

20 ఏళ్ళ జ్యోతి సాహితీ చరిత్ర

జ్యోతి 20వ జన్మదిన సందర్భంగా

40 కి పైగా కూర్చిన కథా పారిజాతాల పూలరథం

ఫిబ్రవరిలో వస్తోంది.

ఈ కథా సంపుటి వెల మాత్రం 15 రూ.లే

కాగితం ధర, ముద్రణకి సంబంధించిన ఇతర సరంజామా ధరలు

పెరిగిపోతున్నందువల్ల ఇలా ధర పెంచవలసి వచ్చింది.

మీ ఆర్డర్లకు వెంటనే రాయండి.

నిదురించిన దివ్యనేత్రి సావిత్రి...

తొలిమాట

ఒక గగన కుసుమం........వెండి తెరమీద పున్నమి జాబిల్లి....దివ్యగానంలో ఒక సుస్వరం....మన సావిత్రి.... బాధకి సుదూరంగా...."దిగిరాను దిగిరాను దివినుండి భువి" కన్నట్టే....అక్కడికి వెళ్ళింది....నటనా లోకంనుంచి మహాభి నిష్క్రమణం!...........

పువ్వు విచ్చుకున్నట్టే ఆ చిరునవ్వు....కెమెరాపోజు కాదు....అనర్గళంగా, అతిసునాయాసంగా ఆ డైలాగ్.... వత్తులు లేని ముద్ద మాటలుకాదు - ఆనంద డోలిక తన కదలిక....బిగుసుకు పోవడంకాదు తెరమీద - కంటి చివర బాధని ఒక చిన్ని బొట్టుగా రాలుస్తుంది....తెర తడిసేలా కాదు - నటనంటే అదీ - సావిత్రి ముద్ర....పాత్రముగిసింది.

బాధార్ణవంలో చీకటి అలల తాకిడికి తెల్లకలువ ఎలా మనగలదుమరి....సావిత్రి వెళ్ళిపోయింది---

సావిత్రి ఒక కావ్యం—

ముగిసినా మరువగలమా?!

వి. వెంకటరఘురాము.

ఉత్తరాలు

జనవరి జ్యోతిలో "గాలిలో దీపం," "నాన్నా నీ విలువెంత" కథలు రెండూ బాగున్నాయి. "మనసుకే కళ్ళుంటే" కృష్ణ కుమారిగారి కథలో చక్కని చిత్రీకరణ వుంది. "సౌభాగ్యలత" సీరియల్ అత్యంత ఉత్సుకతతో మేమూహించని రీతిలో కథ మలుపు తిరుగుతోంది. రచయిత్రికి మా అభినందనలు తెలుపగలరు. ఈ నెల కథలన్నీ హాస్యరస భరితంగా వున్నాయి. ముఖ్యంగా 'పదండి ముందుకు' 'భారతదేశంలో భర్త' కథలు హాస్యాన్ని మరియు చక్కని సందేశాన్ని అందించాయి. 'టి.వి.యస్మూర్తి' 'క్రాఫుల వైనం' కడుపుబ్బ నవ్వించాయి. వారికి మా అభినందనలు తెలుపగలరు. ప్రచురించిన కవితలు భావగర్భితంగా వున్నాయి. నూతన సంవత్సరములో మీ (మా) జ్యోతి నూతనత్వం, వైవిధ్యంగల శీర్షికలతో మా పాఠకుల్ని అలరింప చేస్తుందని కోరతూ జ్యోతి దేదీప్యమానంగా వెలుగొందాలని నా శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

వై. హేమసుందర్‌రావు,
డోర్నకల్.

ఈసారి "శ్రీదేవి" ముఖచిత్రం స్మార్టుగా వుంది. "మల్లాది" గారి "పెళ్ళి చూపులు" మినీకథ అయినా ఫైన్‌గా వుంది. ఈసారి కథలలో "భారత దేశంలో భర్త" "సర్దుబాటు" కథలు బావున్నాయి. టి.వి.యస్. మూర్తి గారి "క్రాఫుల వైనం" జోర్‌గానూ అసహజంగానూ వుంది. "యండమూరి" గారి "డబ్బు" ఇంట్రస్టింగానూ, థ్రిల్లింగానూ వుంది, వచ్చే సంచిక కోసం ఎదురు చూసేవిధంగా వుంది.

విజేంద్రనాథ్ ప్రసాద్
ఆదోని.

"జ్యోతి" లోని కథలన్నీ బాగున్నప్పటికి ముఖ్యంగా నన్ను ఆకర్షించిన కథలు "గాలిలో దీపం" "మనసుకే కళ్ళుంటే" తురగా జయశ్యామల గారి "పొరపాటు," కార్టూన్‌లు కడుపుబ్బ నవ్వించాయి.

యస్. శివానంద్
బెల్లంపల్లి.

జనవరి 1982 సంచికలోని "శ్రీవారి అగచాట్లు" నవల చాలా బాగుంది. రచయిత్రికి ధన్యవాదాలు ఇకపోతే కథలలో రెండు మూడు తప్ప మిగిలినవి చాలా బాగున్నాయి. "నీ విలువెంత" మినీకథ చాలా బాగుంది. కానీ కార్టూన్స్ చాలా చప్పగానూ. కాపీవి కన్పిస్తున్నాయ్

కవితలలో తనికెళ్ళ భరిణి గారిది చాలా బాగుంది.

ఆర్. కమల్
సూర్యాపేట

సింహపురి సాహితీ సమాఖ్య

"సింహపురి సాహితీ సమాఖ్య" వారు త్వరలో ద్వితీయ కవితా సంకలనం నిర్వహిస్తున్నారు. సామాజిక స్పృహ కలిగి, పదహైదు లైనులు మించని కవితలు ఫిబ్రవరి నెలాఖరులోపు పంపవలయును.

చిరునామా — కార్యదర్శి,
సింహపురి సాహితీ సమాఖ్య
10-170 సంతపేట
నెల్లూరు-524 001,



స్మామాట్ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్‌వారు శ్రీ కె. వి. భాస్కరరావుకు "సభా స్మామాట్" అనే బిరుదు నిచ్చి సత్కరించారు.
నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శ్రీ భాస్కరరావుకు బిరుదు అందజేస్తున్న దృశ్యం-శ్రీమతి ఝాన్సీ భాస్కరరావు, సంస్థ కోశాధికారి శ్రీ శ్యామ్‌ను కూడా చూడవచ్చు.



14వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ నటుకుల వెంకట సుబ్బారావు ప్రముఖ సినీకవి 'ఆరుద్ర'ను సన్మానిస్తున్న దృశ్యం.



విశాఖలో ఇటీవల జరిగిన తెలుగు రచయితల సభలో....
వాసిరెడ్డి సీతాదేవి, శ్యామలారాణి మొదలయినవారు

యండమూరి వీరేంద్రనాథ్

సీరియల్

డబ్బు
డబ్బు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అధికారి సంపత్‌కుమార్. అతగాడి దగ్గరనుంచి రాబట్టుకోవలసింది పెద్దమొత్తం గ్రాంటు-అందుకే గాంధీ తన సహచరులు 20 మంది ఇంజనీర్లతో కలిసి చెయ్యబోయే భారీ ప్లాన్‌ను సంపత్‌కుమార్‌చే వప్పించగలగాలి. సరిగ్గా ఆ పనిమీదే తన సెక్రటరీ లక్ష్మిని వినియోగించాడు. లక్ష్మి సంపత్ వివరాలు ప్రతిదీ సంపాదించింది. సంపత్‌ని కలిసాడు గాంధీ. "ఇనీషియల్ కాపిటల్ కండిషన్" లేకుండా అప్పు ఇవ్వమన్నాడు సంపత్....లక్ష్మి సంపత్‌ని వప్పించే బాధ్యత తీసుకుంది. నెలరోజుల్లో గాంధీకి అప్పు లభించింది సంస్థనుంచి. ఇండస్ట్రియల్ ఏరియా పథకం కింద స్థలం సంపాదించడం, భారీ ఎత్తున ప్రారంభోత్సవమూ జరిగాయి.

ఈ వివరాలన్నీ వివరంగా సెక్రటరీ రాజారామ్మోహనరావుకి తెలియబరచాడు. అతడు తన నిర్ణయాన్ని తీసుకున్నాడు....

—ఇక చదవండి—

రాత్రి ఎనిమిదిన్నరయింది.

ఫంక్షన్ నుంచి వచ్చిన గాంధీ, హారిక హోటల్లో కూర్చొని వున్నారు. ఆ రోజే హారికతో నాగభూషణరావు విషయం మాట్లాడాలనుకున్నాడు. అతడికి హారికని తరచు కలుసుకోవటం కష్టం అవుతుంది. ఫోన్ చెయ్యొచ్చు కానీ అతడికి రామ్మోహన్‌రావు ఇంటికి ఫోన్ చేయటం ఇష్టం లేదు. అందుకే ఈ అవకాశాన్ని అతడు వదులుకోదల్చుకోలేదు.

కొద్దిసేపు మామూలు సంభాషణ అయిన తరువాత అతడు మంత్రి ప్రసక్తి తీసుకొచ్చాడు. ...."నాగభూషణరావు మీకు బాగా తెలుసు కదా"

"తెలుసు ఆయన కూతురు మా కాలేజీయే. నా బెస్ట్ ఫ్రెండ్. నేను వాళ్ళింటికి అప్పుడప్పుడు వెళ్తుంటాను." అంది హారిక

"నాకు ఆయన దగ్గర ఒక ఇంట్రడక్షన్ లెటర్ (పరిచయ పత్రం) కావాలి"


"నేనొచ్చి పరిచయం చెయ్యనా?"

అతడు కంగారుపడి "వొద్దొద్దు" అన్నాడు. "....నేనే వెళ్తాను" అతడి కంగారు చూసి ఆమె నవ్వి "సర్లెండి అయితే. ఇప్పుడే వ్రాసిస్తాను" అంటూ అతడి వద్దనున్న ఫైలు తీసుకొని; అందులో కాగితం మీద ఉత్తరం వ్రాసిచ్చింది. వ్రాస్తూ "—చాలా పెద్దపని అయితే బహుశా ఈ వుత్తరం పని చేయక పోవచ్చు" అన్నది.

"పెద్దపని కాదు చిన్నదే" కాగితం అందుకుంటూ అన్నాడు.

"ఎంతవరకు వచ్చింది మీ డబ్బు సంపాదన" అని అడిగింది.

"సంవత్సరం దాట వస్తూంది....కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వుంది."



“ఎంత సంపాదించారు.”

“సంపాదించటమా” అని నవ్వేడు. “....సరిగ్గా చెప్పాలంటే దాదాపు లక్ష రూపాయలు మైనస్ బ్యాలెన్స్‌లో అంటే అప్పుల్లో వున్నాను.”

"అంటే ఇంకా నాలుగు సంవత్సరాల్లో యాభై ఒక్క లక్ష సంపాదించాలన్న మాట."

“ప్లస్ ఇన్‌కంటాక్స్, వెల్త్‌టాక్స్” అనుకున్నాడు మనసులో.

అతడికెందుకో దిగులేసింది తనమీద తనకే.

అతడి మొహంలో మారే భావాల్ని గమనిస్తూ, “పోనీ ఈ సంవత్సరంలో బిజినెస్ ట్రిక్ ఏదైనా నేర్చుకున్నారా?” అంది మాట మార్చి.

“ఆ.. నేర్చుకున్నాను.”

“ఏమిటది?”

“బిజినెస్‌లో ఎవరికీ తొందరపడి మాటివ్వకూడదు - చివరికి కట్టుకున్న దాన్నయినా సరే నమ్మకూడదు. వగైరా వగైరా”

ఆమె పకాలున నవ్వి, “పర్లేదు. యాభై లక్షలకన్నా విలువైన సత్యాల్నే కనుక్కున్నావులే” అంది. అతడి మొహం ఎర్రబారింది, మాట్లాడలేదు.

స్పీకర్‌లోంచి పియానో సన్నగా వినిపిస్తూంది. షాండ్లియర్‌లోంచి బహిర్గతమవుతున్న వెలుగు కిరణాలు గదిలో చీకటిని మసక చీకటిగా మారుస్తున్నాయి. వెయిటర్ కాఫీ పాట్, బిల్ తీసుకొచ్చి పెట్టాడు. ఆమె బిల్ మీద సంతకం చేసి, డబ్బు లివ్వకుండా వాలెట్‌లోంచి కార్డుతీసి ప్లేట్లో పడేసింది. వెయిటర్ ఆ కార్డు తీసు

కెళ్ళి నిముషంలో తిరిగి తీసుకొచ్చి ఇచ్చేసేడు, నెలాఖరుకి ఆమె బ్యాంక్ అకౌంట్‌లో ఆ ఖర్చు వ్రాయబడ్తుంది. ఆ బిల్లు తాలూకు డబ్బు హోటల్‌కి నెల చివర్న బ్యాంకే 'పే' జేస్తుంది.

బీదవాళ్ళకీ, అట్టడుగు వర్గాల వారికీ సాయం చేయటానికి నెలకొల్పబడ్డ బ్యాంకులు, బాగా డబ్బున్న వాళ్ళ కోసం కానీ ఖర్చులేకుండా చేసే సేవల్లో ఇదొకటి. గాంధీ తనలో తనే నవ్వుకున్నాడు.

"ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు?"

"ఏంలేదు"

ఆమె కాఫీ రెండు కప్పుల్లో పోస్తూ, "మీకు నేనొకటి చెప్తాను. చేస్తారా" అంది. అతడు ఆశ్చర్యపడి, "ఏమిటి" అని అడిగాడు.

"చేస్తానంటే చెప్తా"

అతడు సిన్సియర్‌గా, "తప్పకుండా" అన్నాడు. ఆమె అదే ఫైల్లోంచి ఒక తెల్ల కాగితం తీసి అతడి ముందుకుతోస్తూ "దీనిమీద సంతకంపెట్టి ఇవ్వండి" అన్నది. అతడు అప్రతిభుడై "ఎందుకు" అని అడగబోయి, ఆగి, ఆమె మీద తనకున్న అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించటంకోసం వడివడిగా సంతకంపెట్టి ఆమె ముందుకు తోసాడు.

"సత్యాల్ని తెలుసు కోవడమేతప్పు వాటిని మీరు ఆచరించరన్న మాట" అంటూ ఆ కాగితాన్ని చేతుల్లోకి తీసుకొంది. అతడు తెల్లబోయి "అంటే" అన్నాడు.

"తొందరపడి ఎవరికీ మాట ఇవ్వకూడదు-అన్నారు. నేనొకటి చెబ్తాను చేస్తారా అని అడగ్గానే 'సరే' అన్నారు. అలాగే, బిజినెస్‌లో ఎవర్నీ, చివరికి కట్టుకున్న దాన్నైనాసరే నమ్మకూడదు అన్నారు. కానీ నన్ను నమ్మి తెల్లకాగితం మీద సంతకంపెట్టి ఇచ్చారు."


అతడు దెబ్బతిన్నట్టు చూసేడు. ఎంత నాజుగ్గా ఈమె తనని బుట్టలో పడేసింది! ఈ ఆడవాళ్ళు, ముఖ్యంగా ఈ కాలం అమ్మాయిలు పైకి ఎంతో అమాయకంగా కనబడ్తూ లోలోపల అపురూపమైన తెలివి తేటల్తో ప్రభవిస్తూ వుంటారు!

అతడు దాన్నుంచి తేరుకోవటానికి కొంచంసేపు పట్టింది. తనని తను సమర్థించుకుంటూ, "మీరు వేరు." అన్నాడు.

"ఎందుకు వేరు? మీరు-"కట్టుకున్నదానికన్నా" అన్నారు" అంటూ ఎదురు ప్రశ్నవేసింది,

"మీరంతకన్నా ఎక్కువే హారికా" అన్నాడు. అనేసి చప్పున నాలుక్కొర్చుకున్నాడు. నిజానికి అతడి వుద్దేశ్యం మీకు ఏకాగితాల మీద సంతకం పెట్టి ఇచ్చినా పర్లేదూ-అని. కానీ అతడి మాటలు అతడికే మరోలా ధ్వనించినయ్. అతడు తలెత్తి ఆమె వైపుచూసేడు.

టేబిల్ మీద పడిన నీటి చుక్కని చూపుడు వేలితో గీస్తూ ఆమె తల వంచు



'పై ముగ్గు నా స్వాతంత్ర్యం · దేనికీ
అనుకరణ కాదు

కొని కూర్చుని వుంది. పచ్చటి లైటు వెల్తురు ఎర్రటి ఆపిల్ పండు ఛాయలోవున్న ఆమె బుగమీద అందంగా మెరుస్తూంది. స్పీకర్‌లో పియానో కన్సర్ట్ పూర్తయి ఆగిపోగానే గదంతా నిశ్శబ్దం వ్యాపించింది. తరువాత శాస్త్రీయమైన మెస్యూజ్ ప్రారంభమైంది. ఆమె "వెళ్దామా" అంటూ కుర్చీలోంచి లేచింది.

ం ం ం ం

అతడు ఇంటికొచ్చే సరికి రాత్రి పదకొండు కావొస్తూంది.

గదిమధ్యలో హరికెన్ లాంతరు వెల్తుర్లో నేలమీద కూర్చొని లక్ష్మి ఏదో వ్రాస్తూంది. ఆమెని అలా చూసి అతడు ఆశ్చర్యంగా. "ఇంత రాత్రి వరకూ పడుకోకుండా ఏం చేస్తున్నావ్ లక్ష్మీ" అని అడిగాడు.

ఆమె తలెత్తకుండానే. "ఈ రోజు ఖర్చులు లెక్క వేస్తున్నాను. ఒక రూపాయి తేడా వస్తూంది. ఎంతకీ తేలటంలేదు." అంది. అతడు ఆమె పక్కనే కూర్చొంటూ "ఒక్క రూపాయి కోసం ఇంత కష్టమెందుకు?" అన్నాడు. ఆమె మాట్లాడకుండా రసీదులు మళ్ళీ తిరిగేసి, లెక్క ఇంకోసారి కూడుతూ "ఓహ్ ఇక్కడ వచ్చింది తప్పు" అంటూ సరిదిద్ది "ఇదిగో మొత్తం ఖర్చుతాలూకు లిస్టూ మిగతా డబ్బు" అంటూ అందించింది.

—ఎంత రాత్రయినా ఆరోజు తాలూకు జమా ఖర్చులు చూసుకొని పడుకోవటం అతడికి అలవాటు. అందువల్లే ఆమె దాన్ని రాత్రికి పూర్తి చేసిందని గ్రహించాడు. అతడు బట్టలు మార్చుకొని, లాంతరు పక్కనే కూర్చొని, ఒక్కొక్క అయిటమూ చూడసాగేడు. నిజానికి అతడు అనుకున్న దానికన్న తక్కువ ఖర్చులో ఆ ఫంక్షను తేలిపోయింది. దీనికి నిజంగా లక్ష్మే కారణం.

లిస్టులో ఒక్కొక్కటే చూస్తూ వస్తున్న గాంధీ దాన్ని పూర్తిచేసి "ఇందులో వాన్‌కి ఇచ్చిన డబ్బు రాయలేదేం" అని అడిగాడు. అప్పటికే లక్ష్మి పడుకొంది. అతడి ప్రశ్నకి కళ్లు తెరిచింది." చిల్లర లేకపోయింది. వాడికేమో టైమ్ అయిపోయిందని కంగారు. రేపొచ్చి తీసుకుంటానని అట్నుంచి అటే వెళ్ళి పోయాడు."

గాంధీ విస్మయంతో, "వాడు అప్పుడే వెళ్ళిపోతే మరి........మరి నువ్వు? నువ్వెలా వచ్చావ్??" అని అడిగాడు. ఆమె కళ్లు విప్పకుండా "నడిచి"....అంది అట్నుంచే.

అతడు దిగ్భ్రాంతుడై, "ఏమిటి? అంత దూరం నుంచి??" అని అడిగాడు. ఆమె మాట్లాడ లేదు. అతడే మళ్ళీ నమ్మశక్యం కానట్టు "....ఇంత రాత్రివేళ, ఊరి బైటనుంచి....ఒక్కదానివీ నడుస్తూ వచ్చావా?" అన్నాడు.

ఈసారి ఆమె కళ్లు తెరిచి ఇటు తిరిగింది. "అఘోరీలన్న మాట ఎప్పుడన్నా విన్నావా? స్మశానంలో శవాల్ని పీక్కుతినే వాళ్లు. అందరూ నన్నుచూసి అలా అను కొని భయపడి వుంటార్లే" అని తిరిగి పడుకుంది.

అతడి మొహం తెల్లగా పాలిపోయింది. ఊరి బైట, నిర్మానుష్యమైన ప్రదే శంలో, ఫంక్షన్ అయిపోయాక ఒక్కర్తె వెళ్ళిపోవటం నీకట్లో ఎవరూ గమనిం చక పోవటం అంతా ఊహించుకొన్నాడు. లక్ష్మి సంగతి అతనికి బాగా తెలుసు. లిఫ్ట్ కూడా అడగదు.


ఆమె తనని తిట్టినా బావుండేది. కనీసం కళ్ళనీళ్ళు పెట్టుకొని రోషంగా అన్నా బావుండేది. కానీ చాలా నిర్లిప్తంగా ఇలా మాట్లాడటం అతడినిబాధిస్తూంది.

అతడు చాలాసేపు అలానే కూర్చొన్నాడు. ఆమె నిద్ర పోతూంది. దాదాపు గంటసేపయి వుంటుంది. ఆమెకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పుకోవాలనుకున్నాడు. నాగభూషణరావు గురించీ, తన ప్లాను గురించీ చెప్పాలనుకున్నాడు. హారికతో అంత హఠాత్తుగా ఎందుకు వెళ్ళవలసి వచ్చిందో వివరించాలనుకున్నాడు.

ఆమె దగ్గరగా వెళ్ళి చెయ్యివేసి "లక్ష్మి" అన్నాడు. ఆమె గాఢనిద్రలోంచి ఒక్కసారి మేల్కొని దిగ్గున లేచి కూర్చుంది. అతడికి ఎలా ప్రారంభించాలో అర్థం కాక "నేను....నేనూ" అనబోయాడు.

తన చేతి మీద వున్న అతడి చేతిని చూసి నెమ్మదిగా "గాంధీ" అన్నది.

చాలాకాలం తర్వాత ఆమె తనని పేరుపెట్టి పిలవటంతో అప్రతిభుడయ్యాడు. ఆమె తాపీగా కానీ స్ఫుటంగా "ఇంకో ఇల్లు తీసుకో గాంధీ. రెండుగదులున్నది" అంది. అనేసి తిరిగి వత్తిగిలి పడుకుంది. గాఢమైన నిశ్శబ్దంలో పెద్ద విస్ఫోటనం జరిగినట్టూ తరువాత తిరిగి నిశ్శబ్దం పేరుకున్నట్టు....అతడికి ఆ మాటలు అర్థం అయ్యేసరికి నిమిషం పట్టింది. చాల సున్నితమైన చోట వాడి బాణం గుచ్చుకొ న్నట్టు విలవిలలాడి పోయాడు. తలంతా దిమ్మెక్కినట్టయింది. అతి కష్టం మీద



గుమ్మం వరకు వెళ్ళగలిగేడు. తరువాత నిస్సత్తువ ఆవరించటంతో అక్కడే కూలబడ్డాడు. బైట వెన్నెల పిండార బోసినట్టు వుంది. కానీ అతడి మొహం మీద తడిక తాలూకు నీడ పడుతూంది.

ఆమెకి తెలుస్తూనే వుంది. అతడు లేచి వెళ్ళటం కన్ను కొద్దిగా తెరిచి ఓరగా చూచింది, తలుపుకు ఆనుకొని బైటకి దిగులుగా చూస్తూ కూర్చున్న అతడిని చూసి జాలేసింది. లేచి వెళ్ళి "సారీ" చెబ్దామా అనుకుంది. మళ్ళీ కసిగా "ఏం? తను నన్ను బాధ పెడ్తే పడ్డేదా ఏమిటి? ఆ ఆమాత్రం శాస్తి కావల్సిందే" అనుకొంది చిన్నపిల్లలా.

—అయితే ఆ మరుసటి రోజు నిజంగా అతడు ఇంకో ఇల్లు చూసి వచ్చేసరికి ఆమె విస్తుబోయింది. అతడు సర్ది చెబుతున్నట్టు "నువ్వన్నావని కాదు. నాకే అనిపించింది. మనం ఇంకొంచెం పెద్ద ఇంటికి మారే టైమ్ వచ్చిందని."

"ఎలా? మనకేం డబ్బు రాలేదుగా" అడిగిందామె ఆశ్చర్యంగా.

అతడు సమాధానం చెప్పలేదు. నవ్వివూరుకొన్నాడు.

ం ం ం ం

మంత్రి—నాగభూషణరావుతో ఇంటర్వ్యూ సులభంగానే దొరికింది గాంధీకి హారిక ఇచ్చిన పుత్తరాన్ని చదివి పక్కనపెడ్తూ "కూర్చో. నీకు ఈ అమ్మాయి ఎలాతెలుసు?" అని అడిగాడు.

"నా చెల్లెలు స్నేహితురాలు" అబద్ధమాడేడు గాంధీ. నాగభూషణరావు ఆ

తరువాత హారిక అలా వుత్తరం ఇచ్చిందన్న సంగతి ఆమె తండ్రితో చెప్తే ప్రమాదం. ఇలా చెప్పటంవల్ల ఇతడు ఆ వుత్తరానికి అంత ప్రాముఖ్యత ఇవ్వడు. పరిచయం అయిపోయిందికాబట్టి అతడు ఆ వుత్తరం గురించి ఎంత తొందరగా మర్చిపోతే అంత మంచిది.

"చెప్పు ఏం కావాలి నా దగ్గిర్నుంచి? నేనేం చెయ్యగలను"

గాంధీ చెప్పటం మొదలు పెట్టాడు.

—మొదట అతడి మాట వినగానే మంత్రి "నో....నో" అన్నాడు. గాంధీ నచ్చ చెబుతున్నట్టు కొనసాగించాడు. మంత్రి సంశయంగా ఎలా అన్నాడు-గాంధీ చేతిలో ప్లాన్ విప్పి వివరించాడు. మంత్రి సాలోచనగా—అవునది నిజమే సుమా అన్నట్లు తలూపాడు.

గోడల మీద ఫ్రేము కట్టిన ఫోటోల్లోంచి గాంధీ, నెహ్రూ, లాల్‌బహదుర్ శాస్త్రి పాలిపోయిన మొహాల్తో తమ తరువాత తరం నాయకుడిని చూస్తున్నారు.

గాంధీ ప్లాన్ చూపిస్తూ మిగతా విషయాలు వివరించసాగేడు. దాదాపు అర గంట గడిచింది. బైట వేచివున్న విజిటర్లని ఇంకొంచంసేపు ఉండమని మంత్రిగారు తాఖీదు ఇచ్చారు. ఆయనకి ఇంటరెస్టు కలిగింది. నిజానికి గాంధీ అడుగు తున్నది చట్ట విరుద్ధమయినదేమీ కాదు. కానీ, అది చాలా కష్టమైన పని అని గాంధీ అనుకోవాలని, ఆయన సంశయిస్తున్నట్టు నటిస్తున్నాడంతే....మరో పది నిముషాల తరువాత గాంధీ లేచాడు. జిప్‌బ్యాగ్‌లోంచి పాతిక వేలుతీసి, ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇచ్చాడు.


"రసీదు కావాలా" అడిగాడు మంత్రి.

"వద్దు"

రసీదు ఇస్తే అది సహాయనిధి క్రింద బలహీన వర్గాల కోసమో, వరద బాధితుల సహాయం కోసమో వెళ్తుంది. రసీదు ఇవ్వకపోతే పార్టీ ఫండ్‌లో జమచేయ బడ్తుంది. పార్టీఫండ్ ఎవరెక్కువ వసూలుచేస్తే వారికి 'హైకమాండ్' దగ్గిర ఎక్కువ పలుకుబడి వుంటుంది, హైకమాండ్ దగ్గిర ఎవరికెక్కువ పలుకుబడి వుంటే వారికి ఎక్కువ పవరుంటుంది. ఎవరికెక్కువ పవరుంటే వారికి అంత ఎక్కువ డబ్బు సంపాదించే అవకాశం వుంటుంది. డబ్బు ఎంత ఎక్కువవుంటే అంత ఎక్కువ ఓట్లు కొనుక్కొనే వీలుంటుంది. ఓట్లొస్తే అధికారం వస్తుంది. అధికారం వస్తే పవరొస్తుంది. పవరొస్తే డబ్బొస్తుంది. డబ్బొస్తే ఓట్లొస్తాయి, ఓట్లొస్తే అధికారం....

ఇది సర్కిల్. ఓటు నోటుకమ్ముడు బోయే చోటులో ఎన్నికల మీద నమ్మకం ప్రజలకున్నంత కాలం ఇది తప్పదు - గాంధీ, నెహ్రూలు చూస్తూనే వున్నారు.

గాంధీ మరో అయిదు నిముషాలు మాట్లాడి లేచాడు. మంత్రికి షేక్ హాండ్ ఇచ్చి బైటకొచ్చాడు.ఇంటి కొచ్చాక లక్ష్మికి జరిగిందంతా చెప్పాడు.



"ఏమిటసలు నీప్లాను? నా కర్థం కావటం లేదు." అంది లక్ష్మి. మళ్ళీ అతడి మొహంలో అదే చిరునవ్వు, మాట్లాడ లేదు.

"అయినా నువ్వు పందెం ఓడిపోయేవని నా వుద్దేశ్యం" అంది లక్ష్మి.

"ఎలా?"

"లంచం ఇవ్వటం చట్టరీత్యా నేరం. నువ్వు లంచం ఇచ్చావు."

"అది లంచం కాదు. మంత్రి ట్రస్టుకి డొనేషన్ ఇచ్చాను. అది ఎంత చట్టబద్ధమైనదంటే-నాకు ఇన్‌కంటాక్స్‌లో కూడా ఆవిషయంలో రాయితీ (కన్సెషన్) దొరుకు తుంది."

"నీపని కావల్సివచ్చి ఒకరికి నువ్వు డబ్బిస్తే దానికి అది లంచమా? అదే ఆ వ్యక్తి ఏర్పరిచిన ట్రస్టుకి నువ్వు డొనేషన్ ఇస్తే దానికి టాక్స్ ఎగ్జంప్షనా?? ఇదెక్కడి న్యాయం" విస్తుబోయింది లక్ష్మి.

"అది ఆలోచించ వలసింది మనం కాదు. మన ప్రభుత్వం" అన్నాడు గాంధి.

"అలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది మనమే."

"ఇంకోదారి లేదు. ఈ ప్రభుత్వం పోయి ఇంకొకటి వచ్చినా అదీ ఇలాగే చేస్తుంది. ఈ సిస్టమ్-మొత్తం ఈ వ్యవస్థ మారాలి. అలా మారటాన్ని నేను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తాను. కానీ అది మారనంత కాలం దీని లొసుగుల్ని ఆధారంగా చేసుకొని డబ్బు సంపాదిస్తాను. నేనెవరికీ హాని చేయటం లేదు. చట్టబద్ధంగానే సంపాదిస్తాను."

"ఎవరికీ హాని చేయకుండా డబ్బు సంపాదించా ననుకొని సంతృప్తి పడటం

కూడా ఆత్మ వంచనే అవుతుంది"

"ఎలా"

"ఒక కాగితం తొందరగా కదలాలి. అది కదలటం కోసం ఒకరు ఒక గుమస్తాకి యాభై రూపాయలిస్తాడు. అనుకున్న దాని కన్నా ముందే పని అయి పోయింది. ఇచ్చిన వాడూ, తీసుకున్న వాడూ-అందరూ సంతోషిస్తారు. మరి ఇది తప్పేగా"

గాంధీ మాట్లాడలేదు.

"కాబట్టి తప్పుకి తేడా మనం ఇచ్చుకొనే అర్థాల బట్టి వుంటుంది."

గాంధీ నవ్వి "ఈ కాంప్లికేషన్స్ వస్తాయనే నేను 'చట్ట రీత్యా' అని పందెం కట్టాను. ఏది న్యాయమో-ఏది అన్యాయమో చెబ్తూ ప్రభుత్వమే రూల్స్ పెట్టింది" అని సంభాషణ ముగించాడు.

ఇది జరిగిన నెల రోజులకి, కొండని తొలిచి రోడ్డు వేసే కార్యక్రమం మొదలైంది."

అంటూ ఆయాసం తీర్చు కోవటానికి ఆగాడు గురువు.

"చెప్పండి స్వామి, తరువాత ఏమయింది?" అని అడిగాడు శిష్యుడు. "తొందరగా చెప్పండి. ఈ ఉత్సుకత భరించలేక పోతున్నాను...గాంధీ యాభై లక్షలూ సంపాదించాడా? హారికని పెళ్ళి చేసుకున్నాడా? లేక వెళ్ళి వెళ్ళి రామ్మోహన రావు వలలో పడి సర్వ నాశనమై పోయాడా!"


ఆయాసం, తీర్చు కోవటం కోసం చెరువు పక్క చెట్టు నీడలో విశ్రమిస్తూ గురువు అన్నాడు. "అంత తొందర కూడదు నాయనా, అయినా యిప్పుడే ఏమయింది' ఇంకా డబ్బు సంపాదనలో మొదటి అధ్యాయమే పూర్తి కాలేదు"

"కానీ అప్పుడే సంవత్సర అయి పోయిందిగా స్వామీ"

"గాంధీ ఈ పందెంలో గెలుస్తాడని నేనెక్కడా అన్లేదుగా నాయినా.అయినా ఇపుడతడి ఆశయం, యాభై లక్షలు సంపాదించటం తో పాటూ రామ్మోహనరావు మీద పగతీర్చు కోవటం కూడా"

"మరి ఆగారేం?...చెప్పండి తరువాత ఏమయింది?"

"ఆగటానికి కారణం వుంది నాయనా. ఇంతసేపు నేను నీకు భారత దేశపు చట్టపరిధిలో డబ్బు సపాదించటం గురించే చెప్పాను ఇప్పుడిక విశాలమైన ప్రపంచంలోకి అడుగు పెడ్దాం, ఇక నుంచీ



నేను చెప్పబోయే కథ ఈ రాజ్యాంగ పరిధిలో వుండదు. అది మర్చిపోయి, ఇదేమిటి? భారత దేశపు వ్యవస్థలో ఇలా ఎలా జరుగుతుంది? అని విమర్శించకు అది చెప్పటానికే ఆగేను."

"నాకు ఈ డబ్బు ఎలా సంపాదించటం అన్నదానికన్నా గాంధీ ఏమయ్యాడూ అన్నది తెలుసుకోవటమే ఆతృతగా వుంది స్వామి, ఏదో ఒక వ్యవస్థ వూహించుకొని ముందు కథ చెప్పండి" అన్నాడు శిష్యుడు.

గురువు తిరిగి చెప్పటం ప్రారంభించాడు.

15

స్టాక్ ఎక్స్ఛేంజ్!

ఒక ఇరుకు వీధిలో, పడి పోవటానికి సిద్ధంగా వున్న ఒక రెండస్తుల భవంతిలో కోట్ల కోట్ల వ్యాపారం నిముషాల మీద జరుగుతుందనీ, క్షణాల్లో లక్షాధికారులు భిక్షాధికారులయి పోతారని ఎవరు వూహించరు. అదే స్టాక్ ఎక్స్ఛేంజి.

స్టాక్ అంటే షేర్లు.

ఎక్స్ఛేంజి అంటే కొనుగోలు-అమ్మకం జరిగే స్థలం.

లక్ష్మి అతడు ఈ మధ్య కాలంలో దానిమీద ఉత్సాహం చూపించటం

గమనించి అడిగింది "ఏమిటి ఈ స్టాక్ ఎక్స్చేంజి అంటే?" అని.

అతడు వివరించాడు.

"ఒక కంపెనీ లక్ష రూపాయల పెట్టుబడితో ఒక వ్యాపారం మొదలు పెట్టిందనుకో. లక్షమంది భాగస్తులు కలిసి దాన్ని పెట్టారనుకో-ఒక్కొక్కరూ ఎంత పెట్టుబడి పెట్టినట్టు?"

"రూపాయి."

"ఒకవేళ ఆ భాగస్తుడు (షేర్ హోల్డరు) తన షేరు నీకు అమ్మదల్చుకుంటే నువ్వు ఎంతకి కొంటావు?"

"రూపాయికి."

"ఆ లక్ష రూపాయలూ పెట్టి ఆ కంపెనీ పెట్రోలు కొని దాచిందనుకో. ఇంకో నెలలో పెట్రోలు ధర నాలుగింతలు అవుతుందని నీకు నమ్మకంగా తెల్సిందనుకో. అప్పుడా షేరుని ఎంతకి కొంటావు?"

"నాలుగు రూపాయలకి——"

"అదే స్టాక్ ఎక్స్చేంజిలో జరిగేది" అన్నాడు గాంధీ. "రకరకాల వస్తువుల షేర్లు అక్కడుంటాయి. కొనేవాళ్ళు కొంటూ వుంటారు. అమ్మేవాళ్ళు అమ్ముతూ వుంటారు. కొన్నిధరలు విపరీతంగా పెరిగిపోతూ వుంటాయి. కొన్నిధరలు అకస్మాత్తుగా పడిపోతూ వుంటాయి. ఇదంతా నీకు అర్ధమవుతుందా? బోరుగా వుందా?"

"లేదు లేదు. ఇంటరెస్టింగ్‌గా వుంది. చెప్పు" ఉత్సాహంగా అంది లక్ష్మి. కొత్త విషయాలు తెలుసుకోవటం ఆమెకి ఎప్పుడూ సరదాయే.

"నువ్వు కట్టుకున్న చీరె ఏమిటి?"

"బోంబెడైయింగ్" అందామె చీరవైపు చూసుకొని.

అతడి మెదడు వేగంగా పనిచేసి, అతడికి కావల్సిన అంకెల్ని సరఫరా చేసింది.


"బోంబేడైయింగ్ ప్రారంభించినపుడు దాని షేరు విలువ పాతిక రూపాయలు. ఇప్పుడు దాని విలువ ఎంతో తెలుసా?"

"ఎంత?"

"తొంభై ఎనిమిది రూపాయలు."

ఆమె వూపిరి బిగపట్టి "మైగాడ్. అంతెలా పెరిగింది?" అని అడిగింది. అతడు నవ్వి "నీలాటి వాళ్ళందరూ బోంబేడైయింగ్ చీరెలమీద ఆసక్తి చూపించటం వల్ల" అన్నాడు. ఆమె సిగ్గుపడి "అసలు విషయం చెప్పూ" అంది.

"చాలా చిన్న విషయం ఇది. బోంబే డయింగ్ వాళ్ళ ఆస్థులూ, లాభాలూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. అందువల్లే ప్రతీవాళ్ళూ తమ దగ్గిరున్న డబ్బుని అలాంటి కంపెనీల్లో దాచుకోవటానికి ఇష్టపడుతున్నారు. దాంతో వాటిధర పెరిగిపోయింది." అన్నాడు. "ఒక్క ఆ కంపెనీయేకాదు-నీ దగ్గిర ఏమాత్రం డబ్బున్నా



వోల్టాస్‌విగానీ ఫిలిప్స్‌విగానీ, విమల్స్‌విగానీ షేర్లుకొను. సంవత్సరం తిరిగే సరికల్లా నీ పెట్టుబడిలో సగం తిరిగి లాభాల రూపంలో వచ్చేస్తుంది. క్రితం సంవత్సరం బోంబేడైయింగ్ షేరు విలువ 69 రూపాయలుండేది. సంవత్సరంలో అది 98 అయింది.


"స్టాక్ ఎక్స్చేంజిలద్వారా డబ్బుసంపాదించడం అంత సులభమైన పక్షంలో అందరూ అలాగే సంపాదించ వచ్చుగా. ఇంత కష్టపడటం దేనికి?" అడిగింది లక్ష్మి.

"చాలా మంచి ప్రశ్న" అన్నాడు గాంధీ. షేర్ల ద్వారా డబ్బు సంపాదించడం అంత సులభం కాదు. దానికి ఎంతో ముందు చూపు—ఆర్థిక పరిజ్ఞానం—రాజకీయాల్తో పరిచయం వుండాలి. ఏ చిన్న సంఘటన జరిగినా దాని ప్రభావం ఆ కంపెనీమీద ఎలా వుంటుందో అందరికన్నా ముందు పసిగట్టగలిగి వుండాలి. అలాంటివాడే అక్కడ రాణించగలడు. నీకెప్పుడైనా వీలైతే బొంబాయిలో దలాల్ స్ట్రీట్‌కి వెళ్ళి చూడు. హైద్రాబాద్‌లో కూడా వుందిగానీ అది అంత పెద్ద ఎక్స్చేంజి కాదు. అక్కడ మనుషులు హడావుడిగా తిరగేస్తూంటారు. బుర్ర బద్దలు కొట్టుకొని ఆలోచిస్తూవుంటారు. సైగలు చేసుకుంటూ వుంటారు అరుస్తూ వుంటారు. రాత్రిని లేదు, పగలని లేదు. ఇరవైనాలుగు గంటలూ-వారికి అదే ధ్యాస. కొద్ది కొద్దిగా దాచుకున్న డబ్బు అక్కడికి తీసుకొచ్చి కొంతమంది లక్షాధికారులవుతారు. కొందరు సర్వనాశన మవుతారు. అసలు అలాంటి ప్రపంచం ఒకటుందా అని నువ్వే ఆశ్చర్య పోతావు."

లక్ష్మి నిజంగానే అలాటి ప్రపంచం ఒకటుందా అన్న విస్మయంతో అతని

మాటలు వినసాగింది. నిజమే మనకి తెలియని ప్రపంచం మనచుట్టూ ఎంతవుందో....
—రూపాయి విలువ పడిపోగానే దిగుమతులు చేసుకొనే కంపెనీ యజ
మానులు ఎంతమందికి హార్ట్ అటాక్‌లు వచ్చినయ్యో చాలా మందికి తెలీదు. స్టాక్
ఎక్స్ఛేంజిలో ప్రవేశించే ప్రతీవాడు రాత్రికి రాత్రి బిర్లాయో, టాటానో అయిపోవాలను
కొనేవాడే. దలాల్ స్ట్రీట్ ద్వారా లక్షాధికారులయిన వాళ్ళు దాదాపు వంద మంది
వుంటే, నాశనమయిన వాళ్లు క్రితం ఏడాది ఎంత లేదన్నా పదివేల మంది వుంటారు.
స్టాక్ ఎక్స్ఛేంజి గోదాలోకి దిగదల్చుకున్న వాడు ముఖ్యంగా ఆలోచించ వల
న పాయింట్లు కొన్ని వున్నాయి తన వయసు....తన మీద ఆధారపడ్డ కుటుంబం
ఎంత....తను మట్టి గొట్టుకుపోతే, తన వారి కోసం ఎంత పక్కకి తీసి పెట్టాలి....
మిగతా మార్గాల ద్వారా తనకి వచ్చే ఆదాయం ఎంత....వగైరా.
స్టాక్ ఎక్స్ఛేంజిలో ఈ షేర్లు కొని, అమ్మే బ్రోకర్లు గ్రద్దల్లాటి వాళ్లు. ఎవరు
లోపలికి ప్రవేశిస్తారా అని చూస్తూవుంటారు. మనిషి వూహించలేని మోసాలు
ఇక్కడ జరుగుతుంటాయి. ప్రభుత్వం బ్యాంకుల్ని నేషనలైజ్ చేయబోతున్నది అని
పుకారు పుట్టిస్తారు. అయిదు వందల రూపాయిల షేరు ధర మూడొందలకి పడిపో
తుంది. ఆ షేర్లున్న అమాయకుడు వాటిని అమ్మెయ్యటానికి (బ్యాంక్ నేషనలైజ్
అయినప్పుడు ప్రభుత్వం చాలా తక్కువ నష్ట పరిహారం ఇస్తుంది కాబట్టి) ప్రయత్ని
స్తాడు. అతడు వాటిని అమ్మెయ్యగానే, అది వట్టి పుకారని తెలుస్తుంది. మళ్ళీ ధర
ఆరొందలకి పెరుగుతుంది. తను చేసిన తప్పుకి నాలుక్కర్చుకొని ఆ అమాయకుడు
తిరిగి ఆ షేర్లు కొంటాడు. తరువాత ఓ నాలుగైదు నెలలకి గవర్నమెంటు నిజంగానే
బ్యాంకుల్ని నేషనలైజ్ చేస్తుంది.
పంజాబ్ సింధ్ బ్యాంక్; విజయా బ్యాంక్; ఆంధ్రా బ్యాంక్ నేషనలైజ్
అయినప్పుడు ఇలాటి రేటు మార్పుల్లో ఎంత మంది బాగుపడ్డారో అంతకు వందరెట్ల
మంది నష్టపోయారు. "బస్ ఇంతేనా ఇది" అనిపిస్తుంది చూసే వాళ్ళకి. కానీ అక్కడ
వున్న వాళ్లు ఎంత తెలివైన వాళ్ళంటే, ఈ సంవత్సరం గడ్డి సరిగ్గా మొలవలేదు
కాబట్టి-పేపరు తయారుచేసే ఇండస్ట్రీ తాలుకు షేర్ల విలువ పడపోతుందని జోస్యం
చెప్పగలిగేవాళ్లు. వీళ్ళకి ప్రపంచంలోని అన్ని దేశాలతోనూ కాంటాక్టులుంటాయి.
ప్రతి అయిదు నిముషాలకీ ఒక ఫోన్‌కాల్ వస్తూనే వుంటుంది.
ఇటువంటి ప్రపంచంలోకి అడుగు పెట్టటానికి గాంధీ ఆయుత్త మవసా
గాడు. అయితే అతడు వెంటనే ప్రవేశించలేదు. ఇండస్ట్రీని జాగ్రత్తగా గమనించ
సాగేడు. దాదాపు ఆరు నెలలపాటూ రక రకాల పుస్తకాలు చదివేడు. బ్రోకర్లనీ,
షేరు ధరల్ని పరీక్షించ సాగాడు. ధర పెంచటం కోసం బాలెన్స్ షీటు ఎలా
"అలంకరింప బడుతున్నదీ" గమనించాడు. లాభాలు రాకపోయినా వాటిని ఎలా చూపి
స్తారో తెలుసుకొన్నాడు.
అదొక యజ్ఞంలాటిది.

జ్యోతి



చాలా నిష్ఠతో దాన్ని నిర్వహించసాగాడు.

రాత్రి ఒంటి గంట-రెండయ్యేది. అతడు పఠనంలో మునిగి పోయేవాడు. లక్ష్మి తిట్టేది. వెళ్ళి పడుకునేవాడు. నిద్ర పట్టేదికాదు. ఏదో జ్ఞాపకం వచ్చేది. లక్ష్మినిలేపి-ఇంకో నెలలో కాల్గేట్ టూత్ పేస్ట్ కంపెనీ షేరు ధర పెరుగుతుందనే వాడు. అలాగే అయ్యేది ఒక్కోసారి ఇద్దరూ పందెం వేసుకునేవారు. చాలాసార్లు అతడే గెలిచాడు. చాలాసార్లేమిటి-దాదాపు అన్నిసార్లూ అతడే గెలిచేవాడు. అతడిని సి. బి. అని పేరు పెట్టింది లక్ష్మి. సి.బీ అంటే కంప్యూటర్ బ్రెయిన్ అట.

హిందూ పేపరు కామర్స్ పేజీ చూస్తుంటే అతడి దృష్టి వార్నర్ హిందుస్తాన్ షేరు మీద పడింది. దాని విలువ దారుణంగా పడిపోతూంది రోజురోజుకీ. 42 రూపాయల షేరు 24 అయింది. అతడికెందుకో దాని విలువ పెరుగుతుందని అని పించింది. ప్రభుత్వ పాలసీ మారబోతుందని అతడికి తెలుసు. తన దగ్గిరున్న పది వేలు పెట్టి షేరు ఒక్కటికి ఇరవై రూపాయలు చొప్పున కొన్నాడు. ఆ మరుసటి నెల వార్నర్ హిందుస్తాన్ డివిడెండ్ లాభాలు ఇవ్వబోతూ వుందని రూమర్ వచ్చింది. షేరు ధర పాతిక రూపాయలయింది.

ఒక్క నెలలో రెండు వేలు లాభం వచ్చింది. గాంధీకి తనమీద తనకి నమ్మకం కలిగింది.

—ఇక్కడ గాంధీ ఇలా స్టాక్ మార్కెట్లో మునిగి తేల్తూ వుంటే అక్కడ గాంధీకి అప్పు యిచ్చిన ప్రభుత్వ సంస్థ యాజమాన్యం కంగారు పడసాగింది. అప్పు తీసుకొని, మంత్రుల చేత శంకుస్థాపన చేయించి, ఆ మరుసటి రోజు నుంచీ అడ్రసు లేకుండా పోయిన గాంధీకి ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాయసాగింది. వాటిని గాంధీ కనీసం విప్పటం కూడా మానేసేడు. ఆర్నెల్లు-తొమ్మిది నెలలయింది. సంవత్సరం అయింది.

ఒకరోజు గాంధీకి రిజిష్టర్డ్ నోటీసు వచ్చింది. ఆస్థులు వేలం వేస్తున్నట్టూ లాయరు నోటీసుంది.

—అది చూసి అతడు కంగారు పడ్డాడు. ఏదో ఒక రోజు అది వస్తుందని తెలుసు కానీ, మరీ అంత తొందరగా వస్తుందని వూహించలేదు. ప్రభుత్వ సంస్థ అంత వేగంగా చర్య తీసుకుంటుందని భావించలేదు.

అతడి కంగారు చూసి లక్ష్మి నవ్వింది. "రోట్లో తల పెట్టాక భయపడటం దేనికీ? పోయేదేముంది - అమ్ముకోనీ" అంది.

"అలాక్కాదు. ఎలాగైనా ఈ చర్యని ఆపు చెయ్యాలి. కనీసం ఆర్నెల్లన్నా ఇది జరక్కుండా చూడాలి."

"ఆర్నెల్ల తరువాత మాత్రం ఏం జరుగుతుంది? ఆ సంస్థని ఎలాగు మోసం చెయ్యనని అన్నావ్‌గా."

"చెయ్యను."

"మరి? పరిశ్రమలు పెట్టిస్తావా ??"


"అసిస్టెంట్లు-బాస్‌లని అవన్నీ అడక్కూడదు. చెప్పినపని చెయ్యాలి - ప్లీజ్....సంపత్ కుమార్ నీకు తెలుసుగా. ఎలాగైనా మరో ఆర్నెల్లపాటు ఆగేటట్టు చూడు....ప్లీజ్."

"బాస్‌లు అసిస్టెంట్లని ఇలాంటి పనులకి వినియోగించ కూడదు."

ఆమె మొహంలో కనబడే సీరియస్ నెస్సు కేవలం తెచ్చి పెట్టుకున్నదే అని గ్రహించి– "కానీ బాస్‌లు చిక్కుల్లో పడ్డప్పుడు వారిని బైటపడేసే బాధ్యత అసిస్టెంట్లదే....అందులోనూ నీలాంటి తెలివైన అమ్మాయి...."

"నన్నేం ఉబ్బెయ్యక్కర్లేదు. వెళ్తాలే" అందిలక్ష్మి అతడి మాటల్ని మధ్యలో ఆపుచేస్తూ.

—రెండ్రోజుల తరువాత ఆమె సంపత్ కుమార్‌ని కలుసుకొంది. అతడు కోపంతో మండి పడ్తున్నాడు. "అప్పు తీసుకొని మాట్లాడకుండా వూరుకోవడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? గవర్నమెంటు ఆర్గనైజేషన్ కదా, నాలుగైదు నోటీసులు పంపి విసుగెత్తి వూరుకుంటారు అనుకొన్నారా? లేకపోతే తీరిగ్గా అయిదారు సంవత్సరాలు పోయిన తరువాత ఇండస్ట్రీ పెడ్దామనుకున్నారా? ఇవన్నీ కాకపోతే మీ అప్పు తీసుకున్నా విషయం పాత రికార్డుల్లో పడి మరుగై పోతుందనుకున్నారా"


అమృతాంజన్
తలనొప్పులకు, జలుబులకు, నొప్పులకు ఇంటింటా ఉండవలసిన దివ్య ఔషధము
తలనొప్పులకు, జలుబులకు, నొప్పులకు ఉపశమనం కలిగించే అమృతాంజన్‌ను బాధగా ఉన్న చోట కొద్దిగా రాసి రుద్దండి. దానిలో చేరి ఉన్న పది శ్రేష్ఠమైన ఔషధాలు నిమిషాల మీద గుణం కలిగిస్తాయని మీరు తెలుసుకొంటారు. ఆదాచేసే పెద్ద సీసాలలోను, చిన్న సీసాలలోను తక్కువ వెలకు ఇమిడికగా చిన్న డబ్బాలలోను లభిస్తుంది. అమృతాంజన్. 80 సంవత్సరాలకు పైబడిన నమ్మకమైన దివ్య ఔషధము.
అమృతాంజన్ లిమిటెడ్
AMRUTANJAN
Pain Balm
Amrutanjan Ltd.

కోపంతో అతనెంత గట్టిగా అరిచాడో, అంతకన్నా గొంతు ఎక్కువచేసి ఇంగ్లీషులో లక్ష్మి కూడా అన్నది. "—మీ బాధ మీ అప్పు గురించే కానీ మా బాధల గురించి ఆలోచించరేం?........ఇండస్ట్రీస్ డిపార్ట్ మెంట్‌కెళ్తే సిమెంట్ లేదంటారు. ఎలక్ట్రిక్ సిటీ డిపార్ట్‌మెంట్‌కి వెళ్తే కరెంట్ ఇప్పుడివ్వలేమంటారు. ఎలా మొదలు పెట్టమంటారు. పరిశ్రమని? దీనికి తోడు మీ యీనోటీసు లొకటి. ఇవ్వన్నీ చూస్తోంటే-మాకేమని పిలుస్తుందో తెలుసా? ఇంజనీర్లందరం కలసి కూడా గట్టుకొని అసెంబ్లీకి వెళ్ళి అక్కడ మూక వుమ్మడిగా ఆత్మహత్య చేసు కుందామని విస్తోంది. ఈ బాధకన్నా అదేసుఖం...."

సంపత్ కుమార్ గతుక్కుమన్నాడు. అప్పటి వరకూ అతడు తిడ్తే ఎదురు మాట్లాడిన వాళ్లు లేరు. కొంత మంది బ్రతిమాలే వారు. కొంత మంది ప్రాధేయ పడే వారు. కానీ ఇలా ఎదురు తిరిగిన వాళ్ళులేరు. అందులోనూ లక్ష్మి స్వచ్ఛమైన ఇంగ్లీషు అతడిని కదిలించింది. ఇంజనీర్ల ఆత్మాహుతి దృశ్యం అతడి కళ్ళముందు కదలాడింది. నిజంగా వాళ్లు అలా చేసుకోంటారని కాదు. కానీ, ఆ అడ్వర్టయిజ్ మెంట్ చాలు—తమ పరువు పోగొట్టటానికి.


"—కానీ ఎంత కాలం మేం వూరుకోగలం ఇలా? మాసహనానికి ఒక హద్దుంది" అన్నాడు. నువ్వు కోపంగా మాట్లాడితే తగ్గి పోతా ననుకోకు అన్న హెచ్చరిక వుంది ఆమాటల్లో. అయితే ముందున్నంత పవరు లేదు. అకస్మాత్తుగా లక్ష్మి గొంతు మారిపోయింది. "ఏం చెయ్యమంటారో మీరె చెప్పండి సార్" అంది జాల గొలిపే కంఠంతో "మీ కోట్ల వ్యాపారంలో మా అప్పు చిన్న నీటి బిందువు లాంటిది. కానీ మా పెట్టుబడి మాకు....? అదే మాకున్నది సార్. అప్పుడు పైస అప్పుడు పైస కూడ బెట్టినదంతా అందులో పెట్టేసేము. మీకన్నా మాకు ఎక్కువ బాధగావుంది. ఈ బాధతో సరియైన నిద్రకి కూడా నోచుకో లేదు మేము........" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టు కొంది.

సంపత్ కుమార్ కంగారు పడ్డాడు. రూమ్‌లోంచి అమ్మాయి ఏడుస్తూ బైట కెళ్ళటం ఎవరైనా గమనిస్తే, వ్యాపించబోయే రూమర్ల గురించి ఆలోచిస్తేనే వళ్లు జలదరిస్తోంది.

"ఆగండాగండి మరీ ఎగ్జయిట్ అవకండి. ఈ సమస్యకి పరిష్కారం ఆలోచిద్దాం...."

"ఏం ఆలోచిస్తాం? ఉద్యోగాలు చేసుకోవల్సిన ఇంజనీర్లని-రండి-పరిశ్రమలు పెట్టండి-అని మీరే ఆహ్వానిస్తారు. తరువాత నోటీసులు ఇచ్చి కోర్టుకి పిలుస్తారు." మళ్ళీ ఏడవటం మొదలు పెట్టింది.

సంపత్ కుమార్ నిస్సహాయంగా కుర్చీ వెనక్కివాలి, "ఏం చేద్దామో చెప్పండి" అన్నాడు. ఇంత అందమైన ఆడపిల్ల ఇలా ఏడవటం అతడికి దుర్భరంగా వుంది.



"—ఇంకో ఆర్నెల్లు టైమివ్వండి. ఆస్తులన్నీ ఎలాగూ మీ పేర్నేవున్నాయి. ఈ ఆర్నెల్లల్లో మా శాయ శక్తులా కృషి చేస్తాం."

సంపత్కుమార్ ఒప్పుకొన్నాడు. లక్ష్మి బైటకొచ్చి మొహం తుడుచుకోవోయింది. కర్చీఫ్‌కి చివర్న అమృతాంజనం రాసివుందని జ్ఞాపకం వచ్చి మానేసింది.

ఇంటికిరాగానే, "పండా? కాయా??" అని అడిగాడు గాంధీ.

"మిగల బారిన పండు" అంది లక్ష్మి.

"ఎలా సాధించ గలిగేవ్-చెప్పవూ."

"ఉహూ-అవన్నీ నువ్వు అడక్కూడదు-నేను చెప్పకూడదు." అంది అతడి మొహంలో మారే భావాల్ని చూసినవ్వుకుంటూ. ఆమెకి అతడు ఆ విషయాన్ని యిలా గుచ్చిగుచ్చి అడగటం ఎందుకో, సంతోషాన్ని ఇస్తూంది. పురుషుడు తనపట్ల చూపించే పొసెసివ్‌నెస్ కన్నా ఆనందకరమైనది స్త్రీకి మరొకటి వుండదేమో.

○ ○ ○ ○ ○

మరొక నాలుగు నెలలు గడిచినయ్.

అయిదు నెలలు.

ఆరు-ఏడు నెలలు.

గాంధీ చాలా క్యాజువల్‌గా మళ్ళీ ఆ పరిశ్రమల విషయం మర్చిపోటం, పోస్ట్‌లో వచ్చిన తాఖీదులు పక్కన పడెయ్యటం ఆమెకి ఆశ్చర్యాన్ని కల్గించింది-

కానీ అతడెందుకో కొద్దిగా దిగులుగా వుండటాన్ని కూడా గమనించింది. ఆమె అడగ లేదు. అడిగినా అతడు చెప్పడని తెలుసు. పెద్ద పెద్ద బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కుండ వలసిన లక్షణం అది. తమ బిజినెస్ గొడవల్ని ఇంట్లో చెప్పక పోవటం. ఇప్పట్నుంచే అతడికి అలవడింది.

ఆరోజు పొద్దున్న అతడు పేపరు చూస్తూ-"లక్ష్మీ....లక్ష్మీ" అని కేక వేసాడు. ఈ మధ్య కాలంలో అతడు అంత సంతోషంగా వుండడం ఆరోజే.

"ఏమిటి" అంటూ లోపల్నుంచి వచ్చింది

"ఇదిగో. ఈ రోజే టన్నెల్ ప్రారంభోత్సవం...."అంటూ పేపరు చూపించాడు. ఆమె దాన్ని చూస్తూ "ఇంత కాలం దీనికోసమే ఆగేమా" అంది. అవు నన్నట్టూ తలూపేడు." అమెకి అర్థంకాలేదు.

"కొండ చుట్టూ తిరిగి అక్కడికి వెళ్ళటానికి సిమెంట్ కీ, ఇనుముకీ లారీకి వంద రూపాయలయ్యేది-ఈ టన్నెల్ (గుహ) రావటం వల్ల ఇరవై అవుతుంది అంతేగా. దీనికోసం రెండు సంవత్సరాలు ఆగాల్సి వచ్చిందా?" అంది.

"నీ ప్రశ్నలోనే నీ జవాబుంది."

"ఏమిటి-?"

అతడు చెప్పకుండా నవ్వి, పేపర్ ఆమెకిచ్చి లోపలికి వెళ్ళిపోయాడు. యాదాలాపంగ పేపరు తిరగేస్తున్న లక్ష్మికి చివరి పేజీలో ఒక మూల పడిన ప్రకటన చూసి కెవ్వున కేక వేసింది. లోపల్నుంచి పరుగెత్తుకు వచ్చిన గాంధీకి దాన్ని చూపించింది

ఇంజనీర్స్ ఇండస్ట్రియల్ ఏరియా (E.I.A.) వేలం వేస్తున్నట్టు నోటీసు అది.

○ ○ ○

మధ్యాహ్నం పదకొండు గావొస్తుంది.

సంస్థ ఆఫీసులో సంపత్ కుమార్ రూమ్‌లో-ఒక మూల కుర్చీలో గాంధీ కూర్చొని వున్నాడు.

ఎదురు కుర్చీలో సేట్ హీరన్‌లాల్ సికారియా, మహేంద్రజైన్, సదాశివరెడ్డి, మల్హోత్రాలు కూర్చొనివున్నారు. అంతకు నాల్రోజుల క్రితం వాళ్ళు ఆ స్థలానికి వెళ్ళారు. టేపులు పెట్టి కొల్చుకున్నారు. వాస్తు పరిశీలించారు కొందరు మనసులోనే లెక్కలు వేసి గుణించుకొన్నారు.

ఆ తరువాత సంస్థకి సీల్డ్ కొటేషన్‌లు ఇచ్చారు. వాటిని అందరి సమక్షంలో విప్పటం అనే కార్యక్రమం జరుగుతుంది అక్కడ.

సంపత్ కుమార్ ఒక్కొక్క కవరే విప్పాడు.

ఇద్దరు గజం పదిహేను "కోట్" చేసారు. ఒకరు పదిహేడు-మల్హోత్రా ఇరవై రూపాయలూ ఆఫర్ చేసారు— ఆ ఆఫర్స్ చూసి, సంపత్‌కుమార్ మతి

పోయింది.... రెండు సంవత్సరాల క్రితం ఎకరం ఒక్కటికీ ముప్ఫయి వేలకన్నా ఎక్కువ అమ్ముడు బోనిది-ఇప్పుడు దాదాపు లక్ష పలుకుతూంది. (4840 గజాలు గజం ఒకటికీ ఇరవైచొప్పున) ఆ ధర చూసిన గాంధీకి మాత్రం ఆశ్చర్యం కలగ లేదు. ఒకప్పుడు ఆ స్థలానికి వెళ్ళాలంటే లారీకి వంద అయ్యేది. ఇప్పుడు ఇరవై అవుతుంది. అంటే ఆ స్థలం ఊరికి అయిదింతలు దగ్గరకొచ్చిందన్నమాట అందుకని ధర మూడింతలు పెరగటంలో ఆశ్చర్యం ఏముంది?

-ఇది జరిగిన వారం రోజులకి రాతకోతలు పూర్తయ్యాయి. తొమ్మిదిలక్షలా అరవై ఎనిమిది వేలు ఇచ్చి మల్హోత్రా స్థలం కొనుక్కున్నాడు సంస్థ తన అప్పు వడ్డీ మినహాయించుకొని మిగతా డబ్బు గాంధీకి ఇచ్చేసింది. గాంధీ రాంతీర్థ దగ్గిర తీసుకున్న తాలూకు అప్పు వడ్డీతో సహా ఇచ్చేసేడు.

నికర లాభం అయిదులక్షలు మిగిలింది

o o o

"బోయ్ బోయ్" మన్న శబ్దంవిని లోపల్నుంచి వచ్చింది లక్ష్మి. కార్లో కూర్చొని హారన్ కొడ్తున్నాడు గాంధీ.

"గాడ్....కారు!" అంది లక్ష్మి సంభ్రమాశ్చర్యాల్తో.

"అవును....కొన్నాను. నలభై వేలకి"

ఆమె మందలిస్తున్నట్టూ "అంత డబ్బు వేస్ట్‌చేసావా?" అంది అతడు నవ్వి "వేస్ట్ కాదు. కారు పెట్టుబడిలాటిది. స్టేటస్ సింబల్." అన్నాడు

"నీకింకో న్యూస్ చెప్పనా?" అంది లక్ష్మి.

"ఏమిటి?"

"మల్హోత్రా, మనం అమ్మేసిన ఊరి బయట స్థలాన్ని ప్లాటుచేసి అమ్ముతున్నాడట. గజం వందచొప్పున"

"అదిక ఏ మాత్రమూ 'ఊరి బైట' స్థలం కాదు. కొండ తొలిచి ఎప్పుడైతే దారి వేసారో, అప్పుడే అది భూర్లోకలిసిపోయింది. ఆ సంస్థ వేలంనోటీసు ఇవ్వటం ఇంకో ఆర్నెల్లు ఆలస్యం చేసివుంటే ఆ యాభై లక్షలూ ఈ ఒక్క అమ్మకంతో వచ్చేసి నేను పందెంనెగ్గి వుండేవాణ్ణి. ఇంకొంత కాలానికి మంత్రి నాగభూషణరావు చేసే పని అదే"

ఆమె ఆశ్చర్యంతో "నాగభూషణరావు ఏమిటి?" అంది.

"రోడ్డుకి ఇటువైపు పది ఎకరాలూ మనవైతే, అటువైపు పది ఎకరాలూ అతడివి, నేనే కొనిపించాను అతడిచేత....రెండు సంవత్సరాల క్రితం"

లక్ష్మి తన మాటలకి నిశ్చేష్టురాలవటం చూసి, అతడు నవ్వుతూ, "లేకపోతే వూరికే అంత ఖర్చుపెట్టి ప్రభుత్వం టన్నెల్ ఎందుకు వేస్తుంది అని అడిగాడు.

ఆమె ఈ సత్యాన్ని అంత తొందరగా జీర్ణించుకోలేక పోయింది. ఆమె మూడ్ మార్చటానికి "ఏయ్‌మొద్దూ-ఈ రోజు విశేషం ఏమిటో తెలుసా?" అని

అడిగాడు.

"ఏమిటి"

"సరిగ్గా దారి మధ్య సగంలో వున్నాం మనం-అయిదు సంవత్సరాల్లో సగం-అంటే-ఈ రోజుకి రెండున్నర సంవత్సరాలు పూర్తయింది."

ఆమె నిరాసక్తంగా "అలాగా" అంది.

"అందుకోసం నీకోసం ఒక ప్రజెంటేషన్ తెచ్చాను." అంటూ కారు దగ్గిరకి నడిచాడు. అందులోంచి ఒక చిన్న పెట్టె పట్టుకొని అతడు వచ్చేలోపులో ఆమె ఒక కాగితం మీద నాలుగులైన్లు వేసి, కవర్లో పెట్టి అతికించింది. అతడు తను తెచ్చిన వాచీ ఆమెకిస్తూ" ఇందులో తేది వుంది, నెలవుంది, సంవత్సరం కూడా వుంది లక్ష్మీ....ఇప్పట్నించి టైమ్ చాలా విలువైంది. ప్రతీ క్షణమునకు దాన్ని గుర్తు చెయ్యటం కోసం ఇది నీకు—" అన్నాడు.

"ఇది నీకు" అంది లక్ష్మి కవరు అందిస్తూ. "ఏమిటిది" అంటూ విప్ప బోయాడు. "వద్దు ఇప్పుడు కాదు" వారిస్తూ అంది లక్ష్మి.

"మనం సగంలో వున్నాం. నువ్వు యాభై లక్షలు గెల్చేఛాన్స్ కూడా సగానికి సగమే. సరిగ్గా అయిదో సంవత్సరం పూర్తయిన రోజు-నువ్వు పందెం గెల్చావో వోడిపోయావో తెల్సినరోజు-ఆరోజు దీన్ని విప్పు........"

అతడేదో అనబోయి మళ్ళీ వూరుకొని ఆ కవరు అందుకొన్నాడు. ఇంతలో గుమ్మం దగ్గిర అలికిడి వినిపించింది. ఇద్దరూ తల తెప్పిచూశాడు. అక్కడో వ్యక్తి నిలబడి వున్నాడు. కొద్దిగా పెరిగిన గడ్డం, మాసిన బట్టలు........

అతడిని చూడగానే లక్ష్మి మొహం పాలిపోయింది. "మా అన్నయ్య" అంది గొణుగు తున్నట్టు. గాంధీ "రండి" అని ఆహ్వానించాడు

"వద్దు...." అని గొంతు పగిలేలా అరవాలని పించింది లక్ష్మికి. కానీ ఎవరో నొక్కేసినట్టు మాట రాలేదు. అలాగే నిశ్చేష్టురాలై నిలబడి పోయింది. ఈ లోపులో అతడు దగ్గిరికొచ్చాడు "నమస్తే నాపేరు హనుమంతరావు. అమ్మో అమ్మో-ఈ స్థితిలో నా చెల్లెల్ని చూడటం ఎంత సంతోషంగా వుందో........" ఇల్లంతా చూస్తూ అన్నాడు.

గాంధీ మాట్లాడ లేదు.

"మీ గురించి నాకు కొద్దిగా తెలుసు. ఇద్దరం కల్సి వుంటున్నార్టగా-అమ్మో అమ్మో అప్పటికి నీలో ఎంత తేడానో-" అన్నాడు లక్ష్మిని చూస్తూ. గాంధీకి 'కల్సి వుండటం' అన్న మాట అసహ్యంగా వినిపించింది. అంతలోనే అతనన్నాడు...." మేం బాగా చితికి పోయాం. చంటాడు పోయాడు-రోజు గడవటమే కష్టంగా వుంది."

'చంటాడు పోయాడు' అనే సరికి లక్ష్మి అయ్యోఅంది. ఎంత తెంచు కున్నా బంధం అంత తొందరగా తెగదు. "వాడికి కడుపు నిండాతిండి పెట్టలేక పోయాను చెల్లాయ్. వాడు అలిగి మమ్మల్నొదిలేసి వెళ్ళి పోయాడు-ఇప్పుడు మాపరిస్థితి మరీ

అధ్వానంగా వుంది. పోన్లే లక్ష్మి నువ్వన్నా సుఖంగా వున్నావ్ అదే చాలు"

గాంధీ ముందుకదిగేసి, "మీరు మాతోనే వుండండి—" అన్నాడు - లక్ష్మి చప్పున "వద్దు" అనబోయింది. ఈ లోపులోనే అతడు దాదాపు సాష్టాంగ పడ్డట్టుపడి-"అమ్మో అమ్మో -అంత కన్నసా,మీరు నిజంగా దేవుడు-బాబూ" అన్నాడు ప్రతీవాక్యంలోనూ అమ్మో అమ్మో అనటం అతనికి అలవాటు. లక్ష్మిలో ఎవరిమీదో తెలియని కసీ రోషం చోటు చేసుకున్నాయి. తను దౌర్భాగ్యపు స్థితిలో వున్నప్పుడు నిర్దాక్షిణ్యంగా చూసిన వీళ్లు-ఎంత సులభంగా ప్లేటు తిప్పేసేరు....

ఆమె మౌనంగా లోపలికి వెళ్ళి పోయింది.

ఆ సాయంత్రమే అతడూ; అతని భార్య ప్రియంవదా వచ్చి చేరారు.

ఆ రాత్రి బాగాపొద్దు పోయాక అతడు బైటకొచ్చి పబ్లిక్ బూత్‌నుంచి ఫోన్ చేసాడు.

"హల్లో-నేను హనుమంతరావుని సార్"

"చెప్పు"

"మీరు ఆదేశించినట్టే కోటలో ప్రవేశించాను సార్. కోట చాలాబావుంది నాలుగైదు లక్షలు ఖరీదు చేస్తుంది. మిగత విషయాలు నెమ్మది మీద తెలియ బరుస్తాను సార్"

"అలాగే"

"మీదయ....ఉంటాను సార్"అని ఫోన్ పెట్టేశాడు. అట్నుంచి మాట్లాడింది రాజారామ్మోహనరావు.

(ఇంకావుంది)

లేటస్ట్ మీ ల(లి)వ్

వి.వి.బి. రామారావు

మేఘంవిరిగి నేలమీద పడుతుందా అన్నట్టు పగలే చీకట్లు కమ్మి సుమారు అరు గంటలైంది. వాన ఇంకా తుంపరగా పడుతోంది. గదిలో ట్యూబ్ వెలుగులో నిదానంగా ఏట్స్ కవితా సంకలనం చదువుకుంటున్నాడు డాక్టర్ శ్యామ్ బెనర్జీ.

"ఆరయినట్టుంది. నువ్ క్లినిక్‌కు వెళ్ళవూ?" శ్యామ్ కుర్తా గుండీ చేతితో నలుపుతూ అడిగాడు.

సావిత్రికి అలా ఆతను సాలోచనగా ఉండడం చూస్తే ఏదో మైమరపు వచ్చేస్తుంది.

"మీరు....మీరు....పెళ్ళెందుకు చేసుకోలేదు?" ఎంతో సందేహిస్తూ, భయం భయంగా అడిగింది.

సావిత్రిలోని ఆ సెన్సిబిలిటీయే ఆమెను మానవాతీత వ్యక్తిగా కనిపింప చేస్తుంది శ్యామ్‌కి. ఎంత చనువిచ్చినా, ఎంత చనువుగా ఉన్నా....రెండోరాతి అడిగి ఉండాల్సిన ప్రశ్న....రెండేళ్ళ తరవాత ధైర్యం చిక్క బట్టుకుని అడిగింది సావిత్రి. అందుకే చిన్నవాడూ, చితకవాడూ కాని నలభై ఏళ్ళ శ్యామ్‌కి ఆమె అంటే అంత ఎడోలిసెంట్ ఎడ్మిరేషన్. అంటే పదహారేళ్ళ అబ్బాయికి అమ్మాయిమీద ఉండే ఆరాధ్య భావం.

ఎంత దగ్గరగా వచ్చినా అంత ఎడంగా ఉండగలగడం సావిత్రిలోని ప్రత్యేకత.

ఆమె కళ్ళలోకి చూసే ధైర్యంలేక చొక్కా బొత్తాలవంక చూసుకుంటూ ఆమె ప్రశ్నకు జవాబుగా ఒక వాక్యశకలాన్ని గొణిగాడు శ్యామ్.

—"నీలాంటి భార్య దొరక్క...."

కాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇద్దరి తలల్లోనూ ఏవేవో ఆలోచనలు.

హఠాత్తుగా శ్యామ్ మళ్ళీ అడిగాడు: "నువ్ క్లినిక్ బయలుదేరలేదేం?"

"ప్చ్! బాబు నిద్రపోతున్నాడు. ఈ వెదర్‌లో నాకూ రగ్గు కప్పుకుని చూస్తూ పడుకోవాలని ఉంది."

"మరి నీ పేషెంట్లో?"

"రేపు చూడొచ్చు."

"నిన్ను చెడ గొట్టేస్తున్నాను...లైక్ సమ్‌టీ?"

"నే చేస్తా!" సావిత్రి లేవబోయింది.

"స్ట్రిక్ట్లీ నాట్! టీ చెయ్యడం, కప్పులు కడగడం లాంటి క్షుద్రమైన పనులు చెయ్యడంలో నీ అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేయించడానికి నాకు హక్కు లేదు...."

"మరో నాలుగు పద్యాలు చదవగలిగిన ఆ కాలంతో స్టుపిడ్ టీ కోసం...."

"నువ్వుండు ...." బొత్తం నులుపుకుంటూ శ్యామ్ వంటగదిలోకి వెళ్ళాడు. రెండు క్షణాల తరవాత సావిత్రే వెళ్ళింది వంట గదిలోకి.

○ ○ ○

వైద్యురాలు సావిత్రీ బెనర్జీతో శ్యామ్ మొదటి పరిచయం అనుకోకుండా జరిగింది

వంట్లో బాగులేక ఆ రోజు శ్యామ్ కాలేజీ నుంచి మధ్యాహ్నమే వచ్చేశాడు. ఇంటి కొచ్చాక కడుపులో నొప్పి ఎక్కువై పోయింది. శ్యామ్ క్లాసుకి రాకపోయేసరికి కాలేజీలో విషయం తెలుసుకుని సునీత శ్యామ్ ఇంటి కొచ్చింది. అప్పటికి నాలుగు న్నరై పోయింది. శ్యామ్ నొప్పితో చుట్టుకు పోతున్నాడు.

"సరే! నే వెళ్ళి డాక్టరును తీసుకొస్తా!"

"వద్దులే! అదే సర్దుకుంటుంది...."

"ఇంతకు ముందెప్పుడన్నా....?"

"లేదు....ఇదిగో ఇక్కడొస్తోంది.... మెక్ బర్నీస్ పాయింట్ దగ్గర వస్తే ఎపెండి సైటిస్ అంటారు....ఎనీవే....చాలా నొప్పి"

సునీత గబా గబా మెట్లుదిగి క్రింద వాటాలో ఉన్న ఓనర్స్‌కి చెప్పడం మంచిదని బెల్ కొట్టింది.

"సార్ కి చాలా కడుపునొప్పి వచ్చేసింది. ఈ దగ్గరలో డాక్టర్...."

బెల్ విని బయటకు వచ్చిన అమ్మాయి వీధి గేటు వరకూ సునీతను తీసుకెళ్ళి "ఆ నాలుగో ఇంట్లో లేడీ డాక్టరుంది........ డాక్టర్ సావిత్రీ బెనర్జీ....వెళ్ళి పిలవండి... చాలా మంచావిడ."

సునీత ఊహించిన కంటే ఎక్కువ మాటలే మాటాడింది ఆ హావడా అమ్మాయి. ఒక్క క్షణం ఆలోచించింది సునీత.

"ఉండండి! నేనూ వస్తా!" లోపలకెళ్ళి వెంటనే వచ్చేసింది.

"శ్యామ్‌గారు పనిచేస్తున్న కాలేజీలో మీరు...." నసిగింది ఆ అమ్మాయి.

"ఆయన మా సార్....చాలా బాధపడి పోతున్నారు...."

"అరెరె! మీరు ఏం చదువుతున్నారు?"

"ఎం. ఏ. ఫైనల్...ఇంగ్లీష్ లిటరేచర్... ఈ ఇల్లే నా?....అరె ఇక్కడ బోర్డుందే, నేనెప్పుడూ చూడనే లేదు..."

"తరచు మీరు ఇక్కడికి వస్తుంటారా? నాకు చదువుకోవాలని ఆశ. మా గ్రేండ్ మదర్......

"లోపల కెళదాం...."

సేరుగా డాక్టరమ్మ గదిలోకి జొరబడి పోయింది సునీత. సుబ్బలక్ష్మి బయటే నుంచుండి పోయింది. చాలా మంది తమ వంతుకోసం కాచి న్నారు.

"క్షమించాలి మేడమ్! డాక్టర్ శ్యామ్ బెనర్జీ చాలా బాధ పడిపోతున్నారు.... ఎపెండి సైటిస్ .... చూడటానికే కష్టంగా ఉంది...."

గడగడా ఇంగ్లీషులో చెప్పింది సునీత. బయటనుంచి వింటున్న సుబ్బలక్ష్మి డాక్టరమ్మ ఏమంటుందోనని భయపడుతూ తనూ ద్వారం దగ్గరకు వెళ్ళింది.

"ఏం సుబ్బలక్ష్మి నువ్వొచ్చావ్?" సావిత్రి పలకరించింది.

"మా ఇంట్లో అద్దెకుంటున్నాయన"

"ఆయనే డాక్టర్ శ్యామ్ బెనర్జీ...."

"బయట నేమ్ ప్లేట్ ఏమీ లేదే, ఎన్నాళ్ళయి ప్రాక్టీస్ చేస్తున్నారు?"

"ఆయన డాక్టర్ అఫ్ ఫిలాసఫీ.... పి. హెచ్.డి. ఇన్ ఇంగ్లీష్ లిటరేచర్... ప్లీజ్! తొందరగా రారూ?"

"ఏం సుబ్బలక్ష్మి అంత బాధపడుతున్నారా?"

"నేను చూడలేదు....ఈ అమ్మాయి...."

"సరే పదండి...."

— మేడమెట్లెక్కి ఆయాసపడుతూనే నాలుగు పక్కలా కలియ చూసింది సావిత్రి....ముందు గదిలో సోఫా సెట్టూ, మధ్య టీపాయ్ మీద ఏవో పేపర్లు పుస్తకాలు....మధ్య గదిలో చిందర వందరగా బట్టలూ, జోళ్ళూ....లోపల గదిలో మంచం మీద మూలుగుతున్న పేషెంటూ....


—"సారీ మేడమ్! మా సార్ ఏదీ పట్టించుకోరు...ఎరియల్ ఇంటలెక్చువల్!"

"దట్సాల్ రైట్!"

"ఎవరది?" శ్యామ్ మెల్లగా కళ్ళు విప్పాడు.

"సార్ డాక్టర్ని తీసుకొచ్చా!"

"హలో డాక్టర్! నొప్పి ఎపెండిసైటిస్



అనుకుంటా!"

"మీకు నొప్పి తగ్గినట్టుందే!"

"కాబట్టే మాటాడుతున్నాను....మళ్ళీ వస్తుందేమో....మనిషి జీవితంలో సుఖం లాంటిదీ నొప్పి—ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు....సారీ, కూచోండి!"

"సర్!" డాక్టర్ సావిత్రి వంక చూసి సునీత కలుగచేసుకోబోయింది.

"నెవర్ మైండ్ మీ! ఐ ఎపాలగైజ్.... అబ్బ! మళ్ళీ నొప్పి....స్.... ఇక్కడ....ఈ పాయింట్ .... దీన్ని .... సారీ, మరిచి పోయాను...."

"డోన్ట్‌వర్రీ....నన్ను చూడనివ్వండి.... తల అటుతిప్పండి...."

డాక్టర్ సావిత్రి తన పరీక్ష ప్రారంభించింది. రెండునిముషాల తరువాత సునీతతో చెప్పింది.: "మీసర్ అనుకున్నదేం కాదు. సివియర్ గాస్ట్రిక్ అప్ సెట్.... ఈ మందులు వాడండి...ఏదీ అమ్మాయి ఆ కాగితం...."

—టేబిల్ మీద శ్యామ్ లెటర్ ప్యాడ్ తీసి ఇచ్చింది సునీత.

సావిత్రి ఆ ప్యాడ్ వంక చూస్తూ ఓ క్షణం అలా ఉండిపోయింది.

"మేడమ్!"

"....ముందు ఈ ఇంజక్షన్ తీసుకురా.... నా క్లినిక్ లో ఉంటుంది, క్విక్...."

—సావిత్రి ముఖంలోని ఎరుపు చూసి 'నేనెళతా!' అంది సుబ్బలక్ష్మి.

"ఏదీ, నోరు తెరవండి....మింగండి..."

కిట్ బ్యాగ్ లో నుంచి ఓ మాత్రతీసి వేసి కుర్చీలో కూచుంది సావిత్రి.

"ఈయన ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది?" సునీత నడిగింది సావిత్రి.

"హైదరాబాదు వొచ్చి రెండేళ్ళయింది ఈ ఇంటిలోకివచ్చి కొన్ని నెలలే అయింది.. ఉస్మానియాలో రీడర్...."

"ఈయన కెవరూ లేరా?"

"లేరనే చెబుతూంటారు. నేను మొదటి సారి అడిగిన తరువాత ఎందుకు అడిగానా అని నొచ్చుకున్నాను....మంచికి మారుపేరు మా శ్యామ్ సర్.... నేనేకాదు మా క్లాసంతా అంతే...అందరం ఆయన్ని లైక్ చేస్తాం. ఆయనను రోజుకోసారి చూడాలి....ఎట్ లీస్ట్ నేను ఆయన్ను చూడకుండా ఉండ లేను."

"సరే, నేను ఇంజక్షన్ ఇచ్చి వెళతా! మళ్ళీ రాత్రిఇంటికి వెళుతూ వచ్చిచూస్తా."

"మీరు వచ్చేవరకూ నేనుఉంటా...మీరు వచ్చి చూశాక టాక్సీలో మా ఇంటికి తీసుకుని వెళతా!"

"అది మీ ఇష్టం, కాని ఆందోళన పడవలసిన కేసేమీ కాదు."

—ఇలా ప్రారంభమైంది సావిత్రికి శ్యామ్ తో పరిచయం. మరో రెండురోజుల తరవాత సావిత్రి క్లినిక్ లో ఉండగా శ్యామ్ కార్డు లోపలకు తెచ్చింది ఆయా.

కార్డువంక చూస్తూ అలా ఉండిపోయింది సావిత్రి. పావుగంట తరువాత తేరుకుని "డాక్టర్ బెనర్జీగారిని లోపలకుపంపు" అంది.

"క్షమించాలి....ఆ రోజు నామాటలతో ప్రమేయం లేకుండా సునీత కార్లో ఇంటికి తీసుకు వెళ్ళిపోయింది,"

మీరు తెలుగు చాలా స్వచ్ఛంగా మాటాడ తారే!"

"మావాళ్ళు నాకు ముద్దుకి బెనర్జీ పేరు పెట్టారు....నగటు ఆంధ్రుడి లక్షణాలన్ని టినీ పోగొట్టుకున్నా నా ఉచ్చారణ ఒక్కటే మిగుల్చుకో గలిగాను."

"అంటే మీరు తెలుగు వాళ్ళే నన్న మాట!"

"అవును. మీరూ తెలుగు వాళ్ళ అడబిడ్డే నన్న విషయం నాకు తెలుసు."

"ఎలా?"


"ప్రశ్నించడం నాకూ తెలుసు.... సునీత చెప్పింది. సునీతకి సుబ్బలక్ష్మి చెప్పిందట....మీ ఫీజు....?"

ప్యాడ్ మీద ఏదో రాసి ఇచ్చింది సావిత్రి. కాగితం చూసి అలా ఉండి పోయాడు. ఒక్కక్షణం ఆగి సావిత్రి ముఖంలోకి చూశాడు. తెలుగు వాళ్ళ ఆడబిడ్డ... ముఖాన్న బొట్టులేదు. లెటర్ ప్యాడ్ మీద బిల్లు మొత్తం నలభై ఐదు పైసలు...మీద గోల్డ్ స్పాట్ రంగు అక్షరాలు—డాక్టర్ సావిత్రి బెనర్జీ. ఎం.డి.

"బిల్లు నలభై ఐదు పైసలా?"

"రెండు మాత్రలు ముప్పై పైసలు. డిస్టిల్డ్ వాటర్....పదిహేను పైసలు... ఎమర్జన్సీలో యాక్చువల్స్ కి మాత్రమే ఛార్జిచేస్తా సునీత ఎమర్జన్సీ అనే చెప్పింది. మీరూ అదే అనుకున్నారు. కదూ!" నవ్వుతూ అంది సావిత్రి.

ఆ నవ్వులో ఆనందం లేదు—నిర్లిప్తత



లేదు. ఉత్సాహంలేదు. సామాన్యంగా నవ్వులో స్ఫురించే భావమేమీ లేదు.

"సునీత ఈజ్ ఎ సిల్లీ గర్ల్!....ఇన్ ఫ్యాక్ట్ నో యామ్ ఐ... ఐయామ్ సారీ."

—"మమ్మీ, ఎవరీయన?"

శ్యామ్ చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు...అయిదేళ్ల అబ్బాయి. బొద్దుగా, ఎర్రగా, ముద్దుగా ఉన్నాడు...

"బాబీ, అప్పుడే వచ్చేశావా?"

"ఎవరు మమ్మీ ఈయన....?"

"శ్యామ్ బెనర్జీ!"

"డాడీ?!..."

"అవును!"

—సావిత్రి కుర్చీలో గోడవంక తిరిగి పోయింది.

"ఇన్నాళ్ళు నన్ను చూడకుండా ఎందుకున్నారు...స్కూల్లో.... అందరి డేడీలూ రోజూ వచ్చి పిల్లల్ని డ్రాప్ చేస్తారు.... మీరు ఎక్కడికెళ్ళి పోయారు..."

బాబీ శ్యామ్ దగ్గర కొచ్చేశాడు.

సావిత్రి వంక చూడలేదు శ్యామ్.

"సారీ! బాబీ...."

"ఇంటికెళ్ళిపోదాం...."చెయ్యి పట్టుకు లాగాడు...."

శ్యామ్ వెనక్కి తిరిగి చూడకుండా బాబీతో వెళ్ళిపోయాడు.

o o o

మనం కావాలనుకున్న దాన్ని పొందలేం...దేన్ని విడనాడమని శపథంచేస్తామో, దేన్ని ప్రాణ పదిలంగా దాచుకోవాలనుకుంటామో దానిని దాచుకోలేం కూడా! మన నిశ్చయం మనది కాదు...." సావిత్రి నిట్టూర్చింది.

"చాలా వేదాంతిలా మాటాడుతున్నావ్!" లావణ్య శ్యామ్‌వంక చూస్తూ చిరునవ్వుతో అంది.

"ఇలా మాటాడినంత మాత్రాన వేదాంతిగా అంగీకరిస్తే మీరు చాలామందిని వేదాంతులనవలసి వస్తుంది." శ్యామ్ లావణ్యవంకే చూస్తూ అన్నాడు.

"కాని...దేవుడున్నాడు. మన మంచి చెడ్డలకీ మనకివచ్చే సుఖదుఃఖాలకీ కోరిలేషన్ వుంది....ఉదాహరణకి...."

"ఉదాహరణలు నేను వినను. దేవుడు

లేడనీ నేనను....దేవుడు బఫూన్అని శ్యామ్ అంటూ ఉంటారు....బఫూన్ తను గంతు వేసి నవ్విస్తాడు. కాని దేవుడు మనల్ని పల్టీ కొట్టించి తను నవ్వుకుంటాడు....కాబట్టి అరటి తొక్కమీద కాలుజారి పడినా నవ్వడం నేర్చుకోవాలంటారు శ్యామ్!"

"రైట్ నువ్వేమంటావో తెలుసుకుందామనే అలా అన్నాను....దేవుడు లేడు.... నువ్ చేసే దానికి నీకు వచ్చే కష్ట సుఖాలకి కోరిలేషన్ లేదు..." —లావణ్య వాదించడానికి ముందుకొచ్చింది...." దేవుడి లీలలంటే చీకటిలో చిందులాటలన్నమాట! మనకి అర్థం కానివన్నీ దేవుడే చేశాడనుకోడం వెర్రితనం. దేవుడు లేడు....లేడు.... లేడు....నువ్ ఎంత పందెం వెయ్యమంటే అంతా వేస్తాను...నిన్ను దేవుడిని చూపించమని అడుగుతానని భయపడకు.... లేని వాడిని నువ్వెలా చూపించగలవ్?"

"దేవుడు ఉన్నాడని నే పందెం వెయ్యలేదనేగా నీపందెం! లావణ్యా చూపించడం అసాధ్యమైనా చూడడం సాధ్యమే! మనసును తగు విధంగా కేంద్రీకరిస్తే.... మీరేమంటారు శ్యామ్?" సావిత్రి అడిగింది.

"ఓ తత్త్వవేత మాటలు గుర్తుకొస్తున్నాయి... మహామంచి దేమిటంటే అసలు పందెం వెయ్యకపోవటమే!"

"అదే పలాయనతత్వం!" లావణ్య ముఖం ఎర్రగా అయింది.

"నేను పలాయన వాదినికాను. దేవుడి గురించి తెలుసుకోలేమని మాత్రం చెప్పగలను.... సావిత్రిగారన్న కేంద్రీకరణని సాధ్యపరచేది దేవుడేమోనని నాఉద్దేశ్యం."

"మీకు దేవుడంటే భయమా?"

"దేవుడికి భయపడాల్సిన పాపం చెయ్యలేను నేనెప్పుడూ!"

"మీ మాటల్లో దేవుడిమీద నమ్మకం కంటే భయమే కనపడుతోంది...దేవుడు లేడన్న నమ్మకం....దేవుడు లేడనడానికి నిదర్శనం....మన కళ్ళముందున్న సావిత్రి కంటే ఇంకెవరు కావాలి చెప్పండి........ శ్యామ్ ఎనర్జీని మనసారా ప్రేమించింది పెద్దవాళ్లు వద్దంటున్నా పెళ్ళిచేసుకుం· జస్ట్ కన్ను మూసి తెరిచేలోగా విమానంలో పాటు బొగ్గయి పోయాడన్న ఒక్కటే వార్త...ఈ శిక్ష అనుభవించడానికి సావిత్రి చేసిన పాపం ఏమిటి? దేవుడు బఫూన్ కాదు విలన్—ఎవరైనా సంతోషంగా ఉంటే కంటిలో నలక పడ్డట్టు ఫీలయ్యే వ్యక్తి.... సాడిస్ట్...."

"పోన్లేవే! నా అదృష్టం అంతే! రాక రాక వచ్చావ్....సంతోషంగా...."

"నేను మనిషినే సావిత్రి! భగవంతుడికీ నువ్వేం అన్యాయంచేశావని, నీకీ శిక్ష?" లావణ్య ఉద్రేక పడింది.

"యాదృచ్ఛికానికీ, ప్రారబ్ధానికీ ముడిపెట్టాలనుకుని దేవుడిని దుయ్యబట్టడంలో ఏం ప్రయోజనం ఉంది?....ఇప్పుడు నా గుండె చూడండి ఎంత నిబ్బరంగా ఉందో! సావిత్రీ ఆవిడ గుండె చూడు ఎంత ఉద్రేకంతో స్పందిస్తుందో! ఇద్దరూ డాక్టర్లు కదా! ఛాలెంజ్! నా గుండె చూసి నేను ఉద్రేక పడుతున్నానని చెప్పండి!"

"ఓయస్!" స్టెత్ పట్టుకుని లావణ్య ముందు కొచ్చింది.

"ఎంత సేపు చూస్తారు?" నవ్వుతూ అడిగాడు శ్యామ్.

"వన్ మినిట్ ఆర్ లెస్!అ....చొక్కా విప్పండి...."

"వన్ మినిట్ అప్!"....సావిత్రి గడియారం చూస్తూ అంది.

"ష్!"

"ఏమిటే అలా?...."

"సావిత్రీ మీరు ఇప్పుడు మీ స్నేహితురాలిని పరీక్షించండి!....ఇక మీరూ మీరూ చూసుకోండి .... సగం రాసిన పద్యం ఒకటుంది. దాన్ని పూర్తి చెయ్యడానికిదే అవకాశం...." శ్యామ్ వెళ్ళిపోయాడు.

..."ఏమిటే అలా ఉన్నావ్?" సావిత్రి అడిగింది లావణ్యని.

"తీరికగా మాటాడుకుందాం!"లావణ్య

సెట్ డయాఫ్రమ్ మీద చూపుడు వేలుతో కొడుతూ ఏదో ఆలోచనలో పడింది.

"ఏమిటి నిన్ను చూస్తే నాకు భయం వేస్తోంది..."

"నాకూ భయమే వేస్తోంది....శ్యామ్‌ని నువ్ ప్రేమిస్తున్నావా? అఫ్‌కోర్స్ ఎ స్టుపిడ్ క్వెశ్చెన్! బట్ స్టిల్...."

"ఆయనతో పరిచయమైన దగ్గరనుంచీ బాబీ తనకు తండ్రి అతనే అనుకుంటున్నాడు...."

"నువ్వు అతనే నీ భర్త అనుకుంటున్నావ్....ఐ కుడ్ సీదట్!" నిట్టూర్చింది డాక్టర్ లావణ్య.

o o o o

"శ్యామ్!..కేవలం ఆట కోసం....మీకు ఎలా చెప్పాలో తెలియడంలేదు...."సావిత్రి నసుగుతూ అంది.

"ప్రొఫెషనల్ ఛాలెంజన్నమాట...."

"పెర్సనల్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఉన్నప్పుడు...."

"ఐ కెన్ టేక్ ఇట్. చెప్పు-నువ్ చెప్పబోయేదినాకు తెలియకపోతే కదా—షాక్ అయిపోను...."

"యువర్ హార్ట్!..నా ఫ్రెండ్ లావణ్య పేరు మోసిన కార్డియాలజిస్ట్....ఆలస్యం చెయ్యకుండా ఆపరేషన్ చేస్తానంది. తనతో పాటే న్యూయార్క్ వచ్చెయ్యమంటోంది మన అందరినీ! మీకేం భయంలేదు... మీ ప్రాణానికి తన ప్రాణం హామీ ఇస్తుందట...."

"సారీ! నువ్ ఒక్క బిగిన మాటాడేస్తున్నావ్! కంగారుపడిపోకు....నా గుండెలోని లోసుగు నాకు తెలియంది కాదు.... కాని నేను అది ఏ నాడో మరచిపోయాన. అందుకే ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానేమో!. డాక్టర్లు వ్యాధి పేరు తెలిసీ తెలియగానే కంగారు పడిపోతారు....వాళ్ల చాకచక్యాల మీద వాళ్లకి నమ్మకం ఉండదేమో!"

"దస్సిపోయిన నా జీవితంలోకి వెలుగు తీసుకొచ్చారు....బాబీకి మీరంటే ప్రాణం. మమ్మల్ని అన్యాయం చెయ్యకండి...మీరు కాదనకండి... అందరం లావణ్యతోపాటే వెళదాం..." సావిత్రి ఆతృతగా శ్యామ్ కళ్ళలోకి చూసింది.


"సావిత్రీ! డాక్టరుకు కావాల్సిన ధైర్యం నీలో...."

"శ్యామ్! నేను డాక్టర్నని ఎందుకు ఆట పట్టిస్తావ్....నేను మామూలు మనిషిని. సర్వస్వం పోగొట్టుకుని మళ్ళీ పోగొట్టుకుని, మళ్ళీ పోగొట్టుకుంటానని భీతిల్లిపోతున్న ఓ సాధారణమైన ఆడదాన్ని."

"సావీ! నీ ఆ రాటం తెలియనిది కాదు కాని నా ఆరాటం....నాజీవితంలో ఎప్పుడో మోడై పోయిందనుకున్నా.... ఏ జీవితంలోనూ అంతా వసంతమే ఉండదు....అనుకోని, ఎదురుచూడని వసంతం ఆ జోకర్ నాకిచ్చి నా తత్త్వాన్నే మార్చేశాడు.... కాని అతను జోకర్....అతన్ని నమ్మడానికి వీల్లేదు....ఈ ఆనందాన్ని నమ్మడం తెలివి తక్కువతనం....హి ఈజ్ ఫన్నీ... డిసీట్‌ఫుల్...నిన్ను నాకు ఇచ్చాడు....నన్ను నీ దగ్గరనుండి తీసుకుపోతాడేమో!.... సారీ! నేను అసలు ఈ జోక్ వెయ్యకుండా ఉండాల్సింది.... భగవంతుడు జోకరని తీసి పారేయడంలో ఏ మాత్రం తొణకడం లేదని నా గుండె చూచుకోమన్నాను.... ఆమె అంత పెద్ద డాక్టరని నాకు తెలియక అన్నాను.... నాలోగల విషయం నేనూ ఏనాడో మరచిపోయాను..."

"శ్యామ్! మీ మనో ధైర్యానికి జోహార్లు...."

"ఉండు సావిత్రీ....ఏ నిర్ణయాన్ని ఫోర్స్ చేస్తే ఆ తరువాత వచ్చే చీకటి.... మరొక మాట. నేను చాలా మెల్లగా చదువుతాను..ఐయామ్ స్లో ..ఆల్వేస్ స్లో.. నేనూ సునీతా డాంటే చదువుతున్నాం... సునీత పారడైజ్‌లో ఉంది....... నేనింకా పర్గేటోరియోలోనే ఉన్నాను. థాంక్‌గాడ్ ఇద్దరం ఇన్‌ఫెర్నో దాటాం!"



కులాసాగా నవ్వాడు శ్యామ్.

"అవన్నీ నాకు తెలియవ్! ఇక హాస్యం చాలు. వైద్యానికి మీరు సిద్ధపడాల్సిందే!"

"ఆ తరువాత వచ్చే పరిణామాలకు...."

"మీకు హాస్యం కంటె వేరేమీ అర్థం కావా? మరేదీ జీవితంలో మీకు కనపడదా?"

"దాన్నే చూడగలుగుతున్నాను కాబట్టి, నెగ్గుకొస్తున్నాను....సారీ, ఒక్క మాట అడుగుతాను చెప్పు. ఇది హాస్యం కాదు... ఐయామ్ డెడ్ సీరియస్! నువ్ నన్ను ఎందుకింత ప్రేమిస్తున్నావ్! నాలో ఏ ముందనీ నేను నీ ప్రేమకు అర్హుడినేనా?"

"చెబుతానండి. నాకోసం నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. నా భర్త చనిపోయాక ఇంకొకరిని ప్రేమించలేనని అనుకున్నాను...కాని మీరన్నదే నిజం....అతవో జోకర్....ఆ జోకర్ నాలోని మార్పుకి కారకుడు.... నా మీద ప్రేమతో, అనురాగంతో నాలోని మార్పుని కలిగించింది మీ జోకరే?"

"సరే చావుకి నే భయపడను. ఇంత వరకూ జీవించడానికి భయపడిన మాట వాస్తవమే! ఒక్క షరతుమీద విమానం ఎక్కేస్తాను...."

"ఏ షరతైనా నేను సిద్ధమేనని మీకూ తెలుసు .."

"అంత మొండి ధైర్యం నాకు లేదు. నేను పిరికి వాడిని...."

"పిచ్చి శ్యామ్! మీ షరతేమిటి?"

"ఆపరేషన్ అయిన నెలకే నన్ను పెళ్ళి చేసుకుంటావా?"


"ఇప్పుడెందుకు చేసుకోకూడదు?"

"నాకు ఆ జోకర్ మీద నమ్మకం లేదు. ఒకసారి నిన్ను మోసం చేశాడు. ఇంకోసారి చెయ్యడన్న ధైర్యం నాకు లేదు"

"దేవుడి సంగతి నాకు తెలియదు కాని, లావణ్యా జోకర్ కాదు.... అట్లాంటివాళ్ళ అద్భుత కృత్యాలు విన్నంత మాత్రాన ఎంత నమ్మకం లేని వాళ్ళకైనా డాక్టర్లంటే నమ్మకం కలిగి తీరుతుంది."

"నాకు మనిషిలో ఉన్న విశ్వాసం భగవంతుడిమీద లేదు....కాని ఒక సంగతిమరిచిపోను...నేను ఆపరేషన్ టేబిల్ మీదకు వెళ్ళే వరకూ నీకు శాంతి ఉండదు....వెళితే నిన్ను పోగొట్టు కుంటానేమో నన్న

చిన్న బిడ్డలకు విశాల హృదయంగల చెల్లింపు విధానం!



భయంకరంటే, నీకేం అన్యాయం జరిగిపోతుందోనన్న భయమే ఎక్కువ........ చావంటే నాకు భయంలేదు.... నిన్ను పోగొట్టుకోవడమంటేనే..."

"ఏమిటిశ్యామ్ ఆ మాటలు....ఇల్లాంటి ఆపరేషన్లు లావణ్య రోజుకి రెండు చేస్తుంది...."

"సరే....నాకు ఊపిరినిచ్చిందీ దేశం.... పోన్లే ఏక్కడయితేనేం? అక్కడయితే నాకు ఈ మాత్రం తెలిసిన వాళ్ళుండరు. అక్కడి వాళ్లు పోన్లే ఒకడైనా తగ్గాడు అనుకుంటారు, తృప్తిగా.... నీ కన్నీళ్ళు తుడిచేశక్తి నాకుంటే బాగుండును.... నీ శాంతిని నీకు దూరం చేసే హక్కు నాకు లేదు....ఇక్కడ ప్రజల సూటి పోటీ మాటలైనా తప్పుతాయి కొన్నాళ్ళు...."

"అవన్నీ పట్టించు కుంటున్నారా?.... మన వయసునైనా దృష్టిలో పెట్టుకోరు మూర్ఖులు...."

"డాక్టర్లకీ, టీచర్లకీ సత్ప్రవర్తన కావాలనుకునే ప్రజలు....మనం రాజకీయ నాయకులమో, వ్యాపారస్థులమో అయితే...."

"నేను తల్లిని కూడా!"

"మనలో నిజాయితీ ఉంది....మనం ఆత్మ సాక్షిగా బ్రతుకుతున్నాం. అది సామాన్యమైన విషయ మేమికాదు." చొక్కా బొత్తం నులుపుకుంటూ శ్యామ్ అన్నాడు ఆమె కళ్లలోకి చూస్తూ.

"రచయితలా మాటాడుతున్నారు!"

"నాలో ఆలోచనలకి పదునుపెడుతున్నావ్! నువ్ నాతో ఉంటే నా ఆలోచనలన్నీ అక్షర రూపం తెచ్చుకంటాయి... ఆ రోజు నేను బాధతో వెలితిరిగి పోతున్నప్పటి నా బాధ నువ్ ఊహించగలవా?"

"అదేం పెద్ద జబ్బు కాదుకాని ఆ బాధను మాత్రం ఊహించగలను...."

"సరే అదే నాకు కావలసింది. ఆ బాధ కంటె నిన్ను పోగొట్టుకుంటానేమోనన్న భయం ఇంకా చాలా బాధకలిగిస్తోంది.."

ఆమె చేతిని చేతితోకి తీసుకున్నాడతను.

"నువ్వు నన్ను పోగొట్టుకుంటానేమో నన్న భయానికి లోనవడంలేదూ?"

"లేదు....నా ప్రాక్టీసు మానేస్తాను.... ఉన్న ఆదాయంతో...."

"వద్దు వద్దు—నాకు బీదరికం అంటే అసహ్యం, ఘోరమైన భయం. బీదవాళ్లను చూస్తే నాకు కంపరం పుట్టుకొస్తుంది...."

—"వాళ్ళకి సేవ చెయ్యడంలో నాకు ఆనందమే కలిగింది..."

—నువ్వు బీదరికాన్ని ఎరగవు... బీదరికాన్ని చూడడం, జాలి పడడంవేరు, దాన్ని అనుభవించడంవేరు...నా గతం నీకు తెలీదు సావిత్రీ....నేను అనుభవించిన బీదరికం భయంకరమైనది .... అప్పుడు నాకు పధ్నాలుగేళ్ళుంటాయేమో! ఒకావిడ నన్ను రక్షించింది. ఆవిడ నన్ను చూసిన క్షణం నుంచీ డబ్బుకి ఏ లోటూ లేక పోయింది. నా అవసరాలూ ఎక్కువ ఖరీదైనవి కావని నీకూ తెలును...."

"ఎవరావిడ?"

"ఆవిడ నాలో ఏం చూసిందో, ఎందుకు జాలిపడిందో ఎందుకంత ఆత్మీయత చూపించిందో నాకు తెలియదు.... ఆవిడనాకంటే ఓ నాలుగేళ్ళ వయసులో పెద్దది...."

"మరేం అడగను...."

"ఆవిడ మరి లేదు...."

"ఐయామ్ సారి!"

"జీవితంలో చేదు భరించడం తప్పదని అందరూ వాపోతుంటారు... చేదునీ ఆర్ద్రతతో స్వీకరించడం అలవాటు చేసుకున్నాను....కాని...."

"చేదుని పెంచడానికి భయపడుతున్నారు... మీరు కలకాలం నా వాళ్లుగా ఉండాలని నా ఆశ....మీరు నాకు అన్యాయం చెయ్యరు—దేవుడూ నాకు న్యాయమే చేస్తాడు.... మీరు లేకపోతే నేను బ్రతకలేను...."

"అందుకే...."

"మీకు డాక్టర్ల మీద నమ్మకంలేదు."

"డాక్టర్స్ని ఫూల్స్ చేస్తూనే నేనిలా బ్రతుక్కుంటూ వస్తున్నాను సావిత్రీ...."

"అలా అనుకుంటున్నారు...."

"కాదు....ఐయామ్ బిట్టర్ విత్ దెమ్ నాకు గుండె జబ్బుందన్నారు...ఆమె చచ్చిపోయింది... వాట్ ఎ బిట్టర్ జోక్! ఐ వాన్ట్ టు బి లెఫ్ట్ ఎలోన్! నువ్ నాకోసం ఏమైనా చేస్తావని తెలుసు... దయచేసి నీ నీ స్నేహితురాలితో చెప్పు-మానాన్న నన్ను వదిలెయ్యమని."

"అది అంత సులువు కాదు శ్యామ్.... నన్ను చంపేస్తుంది. చేజేతులా చేతి కందిన అమృత కలశాన్ని విరగ్గొట్టుకుంటున్నా నంటోంది...."

"నువ్వు ఆడదానివి....డాక్టర్ల మీదంటే నాకు నమ్మకం పోయింది. ఆడదానివల్లే ప్రపంచమంతా వెలుతురురావాలి. ఆడదాని వల్లే జీవితంలో సుఖం, శాంతి, ఆనందం... నువ్వు స్త్రీవి. అమృత మూర్తివి-గాయపరచకుండా ఆమెను ఇక్కడనుంచి పంపెయ్...."

"ఆమె మాటను కాదని ఆమెని నొప్పించకుండా ఉండలేను...."

"సరే....నేను ఆపరేషన్కి సిద్ధమేనని చెప్పు....ఆవిడదే ఆలస్యం. రేపు బయలుదేరమన్నా నేను సిద్ధమే!"

"చాలు శ్యామ్! నా మీద నీకు అంతటి అనురాగం ఉందని నాకు తెలుసు....స్వీట్ శ్యామ్.. ఐ లవ్యూ! గ్రేట్ శ్యామ్ ఐ ఎడోర్ యూ!"

—"సారీ వే!" డాక్టర్ లావణ్య వచ్చింది గదిలోకి. సావిత్రీ, శ్యామ్ విడిపోయారు

"మిమ్మల్ని చూస్తే నాకు భలే జలసీగా ఉంది....పదహారేళ్ళ వయసులో ఉన్నారు మీరింకా.... దట్ ఈజ్ గ్రేట్!"

"లవ్ ఈజ్ వండర్ ఫుల్!" శ్యామ్ ఓ ప్రవచనంచేసే ధోరణిలో అన్నాడు.

డాక్టరు లావణ్య ముఖంలోని సంతోషం, ఆమె మాటల్లోని హుషారు ఆమె నవ్వులోని ఆనందం అన్నీ బోళగా, వెలిగా కనబడుతున్నాయి శ్యామ్కి.... స్నేహితురాళ్ళిద్దరూ ప్రపంచంలో వారిద్దరే ఆనందంగా ఉన్నట్లు గర్వపడిపోతున్నారు....

ఎయిర్ పోర్ట్లో విమానం ఎక్కేముందు చివరి ఘట్టంలోకి వెళ్ళబోతోంది డాక్టర్ లావణ్య.

గుడ్ బై శ్యామ్....ఇది మార్చి....జూన్కి అన్నీ సిద్ధంచేసి ఉంచుతా...నాలుగు నెలలుండేటట్టు రావాలి... పాపాయిని నే చూచుకుంటా..."

"యూ ఆర్ వండర్ ఫుల్...ఆమె చెయ్యి నొక్కుతూచెప్పాడు శ్యామ్.

"బాబీ!" అంటూ పిలిచేసరికి బాబీ లావణ్యను కావలించేసుకున్నాడు.

—బ్యాక్ సీటులో మోకాళ్ళ మీద నుంచుని వెనక అద్దాలలోంచి ప్రపంచాన్నీ చూస్తున్నాడు బాబీ...సావిత్రి కారు డ్రైవ్ చేస్తోంది...

"పాపాయి సంగతి నాతో చెప్పనేలేదే?" శ్యామ్ అడిగాడు. ఎదురుగా పూర్ణ కలశంలో ఊరేగింపు వస్తోంది...కారు స్లోచేసి లెఫ్ట్కి తీసి ఆపింది సావిత్రి...

"పాపాయి సంగతి...?"

"అందమైన అబద్ధం..." ఊరేగింపు వంక తదేకంగా చూస్తూ అంది సావిత్రి.

ఆమె గొంతులో నుంచి శ్యామ్ భయపడిన నిట్టూర్పు వినపడలేదు... ఆమె మాటలో అంతా ఆనందమే....అంతా తియ్యదనమే తొణికిసలాడింది.

—శ్యామ్ దృష్టి పూర్ణ కలశం మీదనే ఉంది.

"కథ కాదు"

యు. వెంకట రత్నం

వరిచేలో వంటరి తాడిచెట్టులా నిల బడ్డాడు నర్శిగాడు, సెంటర్లో. అక్కడో రిక్షా, అక్కడో రిక్షా కునికిపాట్లు పడుతు న్నాయి.

"ఏరా నర్శిగా! ఇయాల పొద్దుటేలే బండేశావ్?" మరో రిక్షా పరమార్శ.

"అమ్మకు ఒంట్లో బాగుంటలా! అయ్య వార్రోజుల క్రితం డూటీకెళ్ళారు యింత వరకు రాలా! యింటో అన్ని నిండుకు న్నయ్. నేనేం చేయను. రిచ్చా తప్పితే మరో ఆదాయం లేకపాయె."

ప్రపంచం దృష్టిలో నర్శిగాడు పిల్ల వాడే. ఓటు అమ్ము కోవటానికి యింకా పొక్కురాని ఓసామాన్య మానవుడు.

"ఏయ్ రిక్షా వస్తావా!"

"అయ్"

"సంత పేట"

"రూపాయి యిప్పించడయ్యా!"

"అర్ధరూపాయికి వస్తేరా లేకుంటే లేదు."

"గిట్టదు బాబయ్యా. శానా ఎక్కుడు లాగాలి"

"వస్తావా లేదా"!

నర్శిగాడికి అమ్మ మందులకు కావల్సిన డబ్బులు జ్ఞాపకం వచ్చాయి

"సరే! రండయ్యా."

"ఏమోయ్! ముందరే కరెక్టుగా అడిగితే ఎంత బాగుండేది."

"లేదండి—అవసరం కదా!"

o o o o

శ్రీదేవి ఎ. సికి వస్తావా!

"వస్తానండి"

"ఏవోయ్. నీకెన్నేళ్ళు"

"పదిహేనండి"

"మరప్పుడే రిక్షా వేశావేం, అమ్మా, నాన్నా లేరా?"

"ఉన్నారండి. గడవక."

రోడ్ రోలర్ని వొంటి చేత్తో లాగు తున్నట్టుగా వుంది రిక్షా లాగుతుంటే.

శ్రీదేవి. ఎ. సి దగ్గర కొచ్చింది.

"సర్లే! ఎక్కుడు లా వుంది. దిగుతా నుండు."

"లాగుతాను బాబు—దిగకండి."

"పడిశావ్ లేవోయ్. యిందు డబ్బులు తీసుకో."

"సార్. అక్కడ దాకా తొక్కుతా నండి."

"వద్దులే వెళ్లు,"

"సినిమా హాలుదగ్గరికి వచ్చేశాం బాబు."

○ ○ ○ ○

నర్శిగాడికి తన శారీరక శక్తి మీద ఆశ నశించింది. నిముషాలు, గంటలు, రోజులు—రాత్రి....పగలు, ఉదయం లేని రాత్రులు. కాలం, వయస్సు మనిషిని మృత్యువు దగ్గరికి తీసుకువెళ్తే మనిషిలో నిరాశ నిస్పృహ, మనిషి మనస్సుని మృత్యువుకు గురిచేస్తుంది. ఆపరిస్థితిలోనే వున్నాడు నర్శి.

మరలా అదే రిక్షా...అదే బాడుగ...అదే మనుష్యులు.

○ ○ ○

ఆ పూట నర్శిగాడి కళ్ళు ఆనందంగా మెరిశాయ్. అవును. మొన్న బండెక్కింది అయినే...మళ్ళీ వచ్చాడు.

"ఆ—నీపేరేంటి నర్శి కదూ! నీ మీద కథ రాశావోయ్ బహుమతి వచ్చింది యిందయీ డబ్బంచు."

నర్శి తన కళ్ళని నమ్మలేదు.

"అయ్యా! మా మీద కథ రాస్తే పత్రికలోళ్ళు, పుస్తకాలోళ్ళు బహుమతులు, డబ్బులిత్తారు గాని, మాలాంటోళ్ళకి బండి కొండానికి డబ్బెవరిత్తారు బాబు. సంతోసం బాబు—కతలు రాసే కొందరు రిచ్చా ఎక్కి ఐదు పైసల కాడ గంటన్నర బేరం ఆడతారు-సర్దాగా వుపన్యాసం ఇత్తారు, మళ్లీ కతల్రాత్తారు. తవరు దీంతో మరోకత రాయండి సారూ"

నర్శిగాడి కళ్ళు నీరు తిరిగాయి.

తన బోటివాళ్ళ జీవితం కథ "కాలం" ఖర్చు అయ్యేందుకు కొంత మందికి ఉపయోగించింది అన్న తృప్తి మిగుల్చుకున్నాడు నర్శి ✱

సానుభూతి

ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు— "ఒక ఐదు రూపాయలుంటే బదులివ్వండి ఇంట్లో బియ్యం లేవు. గోలగా వుంది" అడగలేక తడబడుతూ అడిగాడు.

"నా దగ్గర దమ్మిడీ లేదు. డబ్బెక్కడ్నుంచి వస్తుంది? నా దొడ్లో పండుతుందా? అదీగాక నేనిన్నిసార్లు ఇవ్వలేను" అన్నాడు ధనవంతుడు.


"నాకెప్పుడిచ్చారు"

"నువ్వు మరణించిన తర్వాత శిలా విగ్రహానికి ఇవ్వొద్దూ? ఇప్పుడూ ఇచ్చి అప్పుడూ ఇచ్చి నాకిదే పనా?" అన్నాడు ధనవంతుడు.

కవికి ఆరోజు రాత్రి కలలో కనిపించిన తన భార్య తిండిలేక ఒక ప్రక్కన ఏడుస్తూవుంటే ఒక ప్రక్కన శిలావిగ్రహం తయారవుతూ వుంటుంది. ఆ శిలా విగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్ని, రసహృదయాన్ని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతూ వుంటారు.

గోపీచంద్

పాపాయికి పుట్టుకతోనే మీరిచ్చిన కానుక- 3 నెలలకు సరిపడే ఐరన్



3 నెలలు నిండాక, కేవలం పాలే అతడికి కావలసిన ఐరన్‌ను సమకూర్చలేవు

అతడికి ఇవ్వండి **ఫారెక్స్** పుష్కలంగా ఐరన్ గలది

"తల్లినుంచి పెద్ద ఐరన్ నిల్వతో సహా పుడతాడు పాపాయి. అయితే పుట్టిన తర్వాత ఈ నిల్వ క్రమేపీ తరిగిపోతుంది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఆహారాలు కావాలి."
డాక్టర్ సుభాష్ సి. ఆర్య: "ఇన్‌ఫేంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్"

డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?

ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది—అది మీ పాపాయి రక్తానికీ, అతడి శరీర ఆరోగ్యానికీ, అతడి పెరుగుదలకూ, వికాసానికీ అతి ముఖ్యం.





డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్
సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

CASGLF-30-163 Tel

బంజారాహిల్స్‌లో బంగళా!

తాళ్లూరి
నాగేశ్వర రావు

బంజారా హిల్స్‌లో రోడ్డు నెం 12లో ఓ బంగళా ముందు ప్రీమియర్ పద్మిని డీలక్స్ స్పెషల్ కారాగింది. డీప్ వాటర్ బ్లూ కలర్ గల ఆ కారుపై అయిదున్నర గంటల సాయంత్రపు మెత్తని సూర్య కాంతి పడుతూ నీగ్రో కన్య బుగ్గలా మెరుస్తోంది.

ఆ కారులోంచి ఓ ముప్ఫై అయిదేళ్ళ స్త్రీ దిగింది. ఆమె వెంటే ఓ పద్నాలుగేళ్ళ కుర్రాడు దిగాడు. ఆమె కారు లాక్ చేసింది.

"మరి హిట్లరో!" అన్నాడా కుర్రాడు శాండ్ కలర్ సఫారీ సూట్‌లో ఆ కుర్రాడు కొబ్బరి పువ్వులా ముద్దుగా, ముచ్చటగా వున్నాడు.

"దాన్ని లోపలే వుంచుదాం" అందామె, సవన్నా గ్రీన్ కలర్ బ్యాక్‌గ్రౌండ్ మీద ఆరంజి ఫ్లవర్స్ బోర్డర్ గల అమెరికన్ టెట్రాన్స్ చీర ధరించిన ఆమె సంధ్యాకాశానికి ఎరుపెక్కిన మబ్బులా మనోజ్ఞంగా వుంది.

కారు వెనక సీట్లో ఖైదీలో వున్న గోల్డెన్ రిట్రేవర్ కుక్క "హిట్లర్" "మరి నేనో!" అన్నట్టు మెల్లగా మూలిగింది.

రోడ్డు మీద ఓ రెండు నిముషాల పాటు నిలబడి ఎదురుగా వున్న బంగళా కేసి తాపీగా తేరిపార జూసిందామె.

మెడలో వున్న పోలరాయిడ్ ఆటో ఫోకస్ కెమెరాతో ఆ బంగళాను ఫోటో తీశాడు ఆకుర్రాడు.

పదకొండు వందల గజాల స్థలంలో మధ్యగా వుందా బంగళా. ముందు గేటూ, కాంపౌండ్ వాల్ మొగల్ ఆర్కిటెక్చర్‌తో మనోహరంగా వుంది. బిల్డింగ్ పక్కనే అయినా, కొలంబో కోస్టల్ తీరంలో వుండే బంగళాలను జ్ఞాపకం తెచ్చేట్టుగా ఉంది. ఫ్రంట్ ఎలివేషన్ ప్లాంట్‌గా వుండి, బంగాళా పెంకులతో అమర్చబడి, విలక్షణమైన అందంతో, హుందాతో, చూపులకు ఇట్టే ఆకట్టు కొనేట్టుగా వుంది. మెయిన్ గేటు లోంచి పోర్టికోకు అరవై అడుగుల సిమెంట్ రస్తావుంది. దాని కిరు పక్కలా దివి నుండి దిగివచ్చిన దేవకన్యలు చిరునవ్వుతో ఆహ్వానిస్తూన్నట్టు రక రకాల గులాబి చెట్లు అర విరిసిన పువ్వులతో శోభాయ మానంగా వున్నాయి. కుడిచేతి పక్కన చిన్న ఫౌంటెన్—అయితే అది పని చేయడంలేదు. దాని పక్కన వెల్వెట్ గ్రాస్ లాన్ వుంది. పోషణ అంత ఇదిగాలేదు. అక్కడక్కడా పెద్ద పెద్ద క్రోటన్లూ పూల చెట్లూ వున్నాయి. బంగళా వెనుక భాగంలో పెద్ద పెద్ద చెట్లున్నాయి, కాంపౌండుకు మూడు పక్కలా రక్షక భటుల్లా సర్వే చెట్లున్నాయి. అయితే వాటిని ప్రూనింగ్ చేసి ఎంత కాలమైందో! క్రమశిక్షణ లేకుండా పెరిగాయి, దూరానికి బంగళా కంటకింపుగా వుంది. బయట గోడ... ...నుకాయ రంగు వేసి వుంది. ...డ్వర్ణకు కలం వుంది.

గేటు ఇరువైపులా మార్బుల్ ప్లాంక్‌లు అమర్చి వున్నాయి. ఒకదాని మీద బంగళా పేరు-గ్రీన్ టాప్, మరోదాని మీద యజమానురాలు పేరు—ఆర్. సుశీలా దేవి.

గేటు తెర్చుకొని మెల్లగా ఆమె, ఆమె కొడుకూ లోపల ప్రవేశించారు. పోర్టికో లోకి పోయేవరకూ గార్డెన్‌ను పరిశీలిస్తూనే వుందామె.

పోర్టికోలో మినీ క్రోటన్స్, రాక్ ఫ్లవర్సు సిమెంట్ తొట్లలో పెట్టి వున్నాయి.

బెల్ కొట్టగా, లోపల్నుంచి ఓ నలభై యేళ్ళ స్త్రీ వచ్చి తలుపు తీసింది. స్లీవ్ లెస్ మీద నల్లంచుల తెల్లని ఆరెంజ్ చీర ధరించింది. మెడలో లాకెట్ గల సన్నటి బంగారు గొలుసు, చేతికి క్వార్ట్జ్ వాచీ, చెవులు బోసిగా వున్నాయి. నుదుటి మీద నల్లటి బొట్టు, వయస్సును దాస్తున్న అందంతో, పొంకంతో బిగువుగా వుంది. ఎత్తుకు తగ్గలావు; లావుకు తగ్గ లావణ్యం.

"సుశీలా దేవిగారు...." అందామె.

"అవును నేనే"

నమస్కారం చేసిందామె.

ప్రతి నమస్కారం చేసింది సుశీలాదేవి.

"నా పేరు లావణ్య—వీడు మా అబ్బాయి రాజేష్. ఈ బంగళా అమ్మకానికి వుందని విన్నాను. కనుక్కుందామని వచ్చాను. బ్రోకర్లతో ఇష్టం లేక, స్వయంగానే వచ్చాను. అమ్మే ఆలోచన మీకేమైనా వుందా?" అంది లావణ్య.

"రండి, లోపలికి" ఆహ్వానించింది సుశీలా దేవి.

తల్లీ, కుర్రాడు లోపలికి వెళ్ళారు.

డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

ఆ బంగళాకు తగ్గ హోదాతోనే వుంది డ్రాయింగ్ రూమ్. పెద్ద సోఫాసెట్, దాని ముందు టేకలం టేబుల్; టేబుల్ మీద ఫ్లవర్ వేజ్; ఒక పక్క టీ. వి, మరో పక్క రోజ్‌వుడ్ స్టూలు మీద అమ్మవారి బ్రాంజి విగ్రహం, గోడలకు ప్రకృతి దృశ్యాల పెద్ద ఆయిల్ పెయింటింగ్స్, ఫ్లోర్ మీద కార్పెట్ స్ట్రిప్స్ గల విండో కర్టెను. ఆ డ్రాయింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్నాడు రాజేష్. ఆ డ్రాయింగ్ రూమ్ డైమన్షన్లను ఊహించుకుంటోంది లావణ్య. పదహారు అడుగుల పొడవూ, పధ్నాలుగు అడుగుల వెడల్పూ ఉండొచ్చు అనుకుంది.

ఆ డ్రాయింగ్ రూమ్ పక్కనే డైనింగ్ హాల్. డైనింగ్ హాలునుంచి పైకి మెట్లున్నాయి.


"ఇల్లు చూస్తారా?" అంది సుశీలా దేవి.

అవునన్నట్టు తల ఆడించింది లావణ్య.

సుశీలాదేవి సోఫాలోంచి లేచింది. ఆమె వెంటే లావణ్య లేచింది. తనకంత ఇంట రెస్టు లేదన్నట్టుగా కూర్చునే వున్నాడు రాజేష్.

డ్రాయింగ్ రూమ్‌కూ, డైనింగ్ హాలుకూ మధ్య పార్టిషన్ వుంది. ఓరియంటల్ డిజైనుగల రోజ్ వుడ్ ద్వారానికి సిల్కు కర్టెన్ వుంది. డైనింగ్ హాలు నుంచి రెండు బెడ్ రూమ్‌లకూ, కిచెన్‌కూ మార్గాలున్నాయి. డైనింగ్ హాల్ పెద్దదే. రెండు షో కేసులున్నాయి. వాటిలో మేడ్ ఇన్ చైనా డిన్నర్ సెట్లూ, ఫ్రాన్స్ నుంచి తెప్పించిన గ్లాసులూ, జపాన్ టీ సెట్, అమెరికన్ అన్ బ్రేకబుల్ డిన్నరు సెట్టు, 'సోనీ' గ్రైండరూ, హాలెండ్ రైసు కుక్కరూ మొదలైన సామాన్లువున్నాయి.

బెడ్‌రూమ్‌లు అంత పెద్దవి కాకపోయినా ఫర్వాలేదన్నంత విశాలంగా ఉన్నాయి. మాస్టర్ బెడ్ రూమ్‌కు వాల్ టు వాల్ చెస్ట్ నట్ కలర్ టేకలాం వార్‌డ్రోబ్ వుంది. అందులో నాలుగు అల్ మైరాలు; డ్రస్సింగ్ టేబుల్ అమర్చి వున్నాయి. గోడలకు వేసిన ట్రెడిషనల్ వాల్ పేపరు అక్కడ కూడా దెబ్బతిని వుంది. బెడ్‌రూమ్‌లకు అటాచ్‌డ్ బాత్ రూమ్ లున్నాయి. బాత్‌రూమ్‌లు ఫ్లోరింగ్ మార్బుల్, వెస్టరన్ స్టయిల్‌తో వున్నాయి.



బాత్ టబ్ - షవరింగ్ ఏర్పాట్లున్నాయి. తొమ్మిది అడుగుల మేరకు వైట్ గ్లేజ్డ్ టైల్స్ వున్నాయి.

బెడ్ రూమ్‌ల తర్వాత కిచెన్‌కు రావడమైంది. ఆధునిక పద్ధతుల్లోనే కిచెన్ వుంది. మార్బుల్‌తో ప్లాట్ ఫాంమ్ ఏర్పాటయి వుంది. ఒక పక్కన స్టీల్ సింక్ వుంది. ప్లాట్ ఫారం కింది భాగమంతా ప్లయివుడ్‌తో కవర్ చేసివుంది. లోపల సామాన్లు పెట్టుకోవచ్చు అంతేకాకుండా కప్ బోర్డువుంది. దాని పక్కనే స్టోర్ రూమ్ కూడా వుంది. అది వంటగదికి అందుబాటులోనేవుంది.

ఓ కారిడార్‌లోంచి బంగళా వెనుక భాగానికి వచ్చారు. వెనుక స్లాంట్ రూఫ్ గల వరండా వుంది. అందులోంచి బయటికి పోతే ఖాళీ ప్రదేశం—ముప్పై అడుగుల వెడల్పున ఓ చివర చిన్న ఔట్ హౌసుంది. సర్వెంట్ క్వార్టరు. ఇంటి వెనుక రకరకాల మొక్కలూ, చెట్లు వున్నాయి. వెనుక పక్క గార్డెనంతా గందరగోళంగావుంది.

ఇంటినంతా నిశితంగా, తాను ఉండే దృష్టితో పరిశీలించింది లావణ్య. ఎక్కడెక్కడ ఏం మార్పులు చేయాలో, ఎట్లా చేస్తే బావుంటుందో ఆలోచించుకుంటూనే వుంది లావణ్య.

ఇల్లు చూసేటప్పుడు వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకోలేదు. లావణ్య నిశ్శబ్దంగానే, అభావంగానే అంతా చూసింది.

డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నారు.

"మీ వారేం చేస్తారు?" అంది సుశీలాదేవి.

"అమెరికాలో డాక్టరు. మేం కూడా మూణ్ణెల్ల క్రితం వరకూ అక్కడ వున్నాం. కాని ఆ జీవితంతో, లైఫ్ స్టయిల్‌తో విసిగిపోయాం. ఇండియాలో సెటిల్ అవుదామని నిర్ణయించుకున్నాం. నేనూ, మా అబ్బాయి ముందు వచ్చాం. ఆయన రెండు మూడు నెలల్లో వచ్చేస్తారు. ఈ లోపల ఓ బిల్డింగ్ కొని రెడీ చేస్తే బావుంటుందని అనుకొన్నాను. అందుచేతనే ఇళ్ళ వేటమీద పడ్డాను. వారంనుంచీ రోజూ ఏదో ఒక బిల్డింగ్ చూస్తున్నాను. నిన్న శ్రీనగర్ కాలనీలో ఓ కొత్త బిల్డింగ్ చూచాను. మొన్న బర్కత్‌పురాలో.... అంతకు క్రితం శాంతినగర్‌లో.... మీ రొక్కరే ఇంట్లో వుంటున్నారా?" అంది లావణ్య.

"లేదు. మా అమ్మాయి, నేనూ వుంటున్నాము. సర్వెంట్లు వున్నారు. అమ్మాయి ఓ ఫ్రెండ్‌తో మ్యాటినీకి వెళ్ళింది." అంది సుశీలాదేవి.

"మీ వారు....?"

"మావారు ప్రస్తుతం బొంబాయిలో వుంటున్నారు. ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్స్ బిజినెస్. ఫోర్ట్ వీధిలో ఆఫీసుంది. అప్పుడప్పుడూ వచ్చిపోతూ వుంటారు. ఈ ఇల్లు నా పేరు మీదనేవుంది. డాక్యుమెంట్సన్నీ నా దగ్గరే వున్నాయి."

అంతలో సర్వెంట్ మెయిడ్ ట్రేలో కాఫీ తెచ్చి యిచ్చింది ముగ్గురికీ.

"మీకు ఇల్లు నచ్చిందా?"

"నచ్చబట్టే అడుగుతున్నాను."

"నాకూ బ్రోకర్లంటే బొత్తిగా పడదు. పార్టీలతో ముఖాముఖి మాట్లాడుకోవడమే శ్రేయస్కరం."

"అవును"

"బేరానికి కూడా ఆస్కారంలేని రేటు చెబుతాను. అర్థాంతరంగా అమ్ముకుపోయే అవసరం నాకు లేదు. నేను అనుకున్న రేటు వస్తేనే అమ్ముదామనుకుంటున్నాను."

"చెప్పండి ఆ రేటేమిటో!"

ఓ నిముషంసేపు ఆలోచించి, లావణ్య మొహంలోకి చూసింది సుశీలాదేవి. ఆమె మొహం నిమ్మకు నీరెత్తి నట్టుగా వుంది.

"ఆరు లక్షల, అరవై ఆరువేల, ఆరొందల అరవై ఆరు రూపాయల అరవై ఆరు పైసలు. నాకు ఆరు అంకె అంటే ఇష్టం. అందుచేత పైసలతో చెప్పాను. మీరు ఆలో



చించి చెప్పవచ్చు. ఈ రేటులో మార్పు వుండదు. మీ ఇష్టా ఇష్టాలు, నిర్మొహమాటంగా మాట్లాడుతున్నానని మరోలా భావించకండి. నా పద్ధతే అది" అంది సుశీలాదేవి.

ఆ రేటుకు తబ్బిబ్బు కాలేదు లావణ్య. గంభీరంగా, నిశ్శబ్దంగా నాలుగు నిముషాల పాటు ఆలోచించిందామె. కొసకు "సరే" అంది లావణ్య.

"డాక్యుమెంట్స్ డూప్లికేట్ ఇస్తాను. మీ లాయర్‌తో సంప్రదించండి" అంది సుశీలాదేవి.

"అలాగే అగ్రిమెంట్ వ్రాయించేటప్పుడు అడ్వాన్సు ఏమైనా ఇవ్వమంటారా?"

"అడ్వాన్సు లేనిదే అగ్రిమెంటు ఏముంది! అరవై ఆరువేల ఆరొందల అరవై ఆరు రూపాయల అరవై ఆరు పైసలు అడ్వాన్సుగా ఇవ్వండి."

"అలాగే" అంది లావణ్య.

డూప్లికేట్ డాక్యుమెంట్లు ఇచ్చింది సుశీలాదేవి. అవి పుచ్చుకొని ఆ మరునాడు లాయర్ను సంప్రదించింది లావణ్య.

అడ్వాన్సు చెక్కు ద్వారా చెల్లించి, అగ్రిమెంట్‌లో ప్రవేశించారు లావణ్య, సుశీలాదేవి. అగ్రిమెంట్ ప్రకారం రెండు మాసాల గడువులోగా ఆ బంగళాను రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది.

o o o

తర్వాత నెల రోజులకు ఓ రాత్రి ఎనిమిది గంటలకు లావణ్య, రాజేష్ డిన్నర్‌కు హోటల్ బంజారాకు వెళ్ళారు. జంట నగరాల్లో వున్న హోటల్స్‌ను, బార్స్‌ను విజిట్ చేసి ఎక్కడ చైనీస్ డిషెస్ బావుంటాయో తెల్సుకోవడం రాజేష్‌కు సరదా. అందుకోసమే తల్లిని వారానికో మంచి హోటల్‌కు తీసుకెళ్ళమని వేధిస్తూ వుంటాడు.

హోటల్ బంజారాలో ఆ రోజురాత్రి లావణ్యకు పాత స్నేహితురాలు శ్రీలేఖ తటస్థ పడింది. వాళ్ళూ వెరైటీ కోసం ఫామిలీతో అక్కడకు వచ్చారట. ఆమె భర్త ఓ పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్‌కు మేనేజింగ్ డైరెక్టరు. పరస్పర నమస్కారాలూ, పరిచయాలూ అయ్యాక స్నేహితురాళ్ళు ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"ఎక్కడుంటున్నారు?" అంది లావణ్య.

"బంజారాహిల్స్, రోడ్డు నంబరు 12 లో" అంది శ్రీలేఖ.

"అదే రోడ్డులో నేనూ ఓ బంగళా కొన్నాను. అడ్వాన్సు ఇచ్చాను. ఓ నెలలో రిజిస్టర్ చేయించాలి."

"ఎవరిదా యిల్లు"

చెప్పింది లావణ్య.

"సుశీలా దేవి బంగళానా?"

"అంటే! ఆమె నీకు తెలుసా?"

"ఆమె నాకు వ్యక్తిగతంగా తెలీదుగ నీ, ఆమె గురించి చాలా మందికి చాల రకాలుగా తెలుసు."

"ఏమని?"

"ఏం చెప్పేది? కావాలంటే నేను విన్నది చెబుతాను."

"చెప్పు" అంది లావణ్య.

చికెన్ కార్న్ సూపు పొగలు గమ్ముతూ టేబుల్ మీదకు వచ్చింది.

"ఆ బంగళాను ఆమె భర్త రామచంద్రం కట్టించాడట. అసలు రామచంద్రం ఎల్.ఐ.సి.లో ఓ మామూలు అసిస్టెంట్ ఉద్యోగి. అయితే యేం—మంచి మాటకారి. జంట నగరాల్లో అధికారులూ, అనధికార్లూ సహా మందితో అతనికి పరిచయాలున్నాయి. ఏ పనైనా ఇన్‌ఫ్లుయన్స్ ద్వారా ఇట్టే చేయించగలడు. అతనూ, సుశీలాదేవీ చిక్కడపల్లిలో డెభ్భై రూపాయల చిన్న పోర్షన్‌లో అద్దెకుండేవారట. అలాంటిది ఒక నెల రోజుల్లో లక్షాధికారి అయ్యాడు. ఉద్యోగానికి రిజైన్ చేశాడు"

"ఎలా లక్షాధికారి అయ్యాడు?"


"దాన్ని గురించే బోలేడు కథలు అమల్లో వున్నాయి. కొందరు చెప్పడం రేసుల్లో సంపాదించాడని, మరి కొందరు చెప్పడం స్మగ్లింగ్ బిజినెస్ వుందని, ఇంకొందరు చెప్పడం కోయంబత్తూరు నోట్లు మార్చాడని, వీటన్నిటినీ మించిన ఓ కథ ప్రచారంలో వుంది.

"ఏమిటది?"

"ఒకసారి రామచంద్రం ఓ మల్టీ మిలియనీర్ ఫ్రెండ్‌తో ఫస్టు క్లాసులో కుపేలో ప్రయాణం చేస్తున్నాడట. ఆ ఫ్రెండ్ విమానాలు ఎక్కడట-హార్ట్ కంప్లెయింట్ వుండడంతో. ఆ ఫ్రెండ్ దగ్గర అక్ష రూపాయలదాకా క్యాష్ ఉందట. రేసు కోసం మద్రాసు వెళుతున్నారట. ఆ ఫ్రెండ్‌కు అర్ధరాత్రి హార్ట్ అటాక్ వచ్చి కావలి ప్రాంతానికి రైలు చేరుకునేప్పటికి చనిపోయాడట. ఆ క్యాష్‌ను రామచంద్రం తన పరం చేసుకొని అతర్వాత దాన్ని రేసుల్లో పదిరెట్లు చేశాడట. ఆ డబ్బుతో బంజారా హిల్స్‌లో బంగళా కట్టాడట. ఆ బంగళాను కాస్త తెలివిగలదీ, చురుకైనదీ, అందమైనదీ, ముందు చూపుగలదీ అయిన సుశీలా దేవి తన పేర పెట్టించుకున్నదట. ఇప్పుడు రామచంద్రం జాడ కచ్చితంగా ఎవ్వరికీ తెలీదు."

టేబుల్ మీదకు బటర్ చికెనూ, ప్రాన్స్ పలావూ, వెజిటబుల్ సలాడూ వచ్చాయి.

"అదెట్లా?" అంది లావణ్య విస్మయ కుతూహలంతో.



"సుశీలాదేవి క్యారెక్టర్ మంచిది కాదని చెప్పుకుంటారు. డబ్బు సంపాదించే వరకూ రామచంద్రాన్ని ఆరాధించింది. నడి మంత్రపు సిరి వొచ్చిపడగానే ఆమె బుద్ధులు పెడదారి పట్టాయట. ఆమెకు రామచంద్రం స్నేహితుడైన ఓ హోటల్ యజమానితో అక్రమ సంబంధముందట. ఆ విషయాన్ని తెల్సుకొన్న రామచంద్రం తన భార్యను చంపడానికి పరోక్షంగా ప్రయత్నాలు చేశాడట. ఆ రహస్యాన్ని సుశీలాదేవి గ్రహించింది. తాను ముందుగా జాగ్రత్త పడిందట. తత్ఫలితంగా ఒకరోజు రామచంద్రం హఠాత్తుగా అదృశ్యమై పోయాడు. బిజినెస్ మీద సింగపూర్ వెళ్లాడనీ, అక్కడ కింగ్స్ హోటల్‌లో ఎవరో మర్డర్ చేశారనే వార్తలు పొక్కాయి. కాని సుశీలాదేవి కథనం ప్రకారం బొంబాయిలో బిజినెస్ చేస్తున్నాడనే, రెండు నెలలకో మూడు నెలలకో వచ్చి పోతుంటాడనీ. ఈ మధ్య కాలంలో రామచంద్రాన్ని ప్రత్యక్షంగా హైదరాబాద్‌లో చూసినవాళ్లు ఎవరూ లేరు మరి."

"సుశీలాదేవి సామాన్యురాలు కాదన్న మాట"

"అనే అనుకోవాలి. ఇప్పటికీ ఆ హోటల్ యజమానితో 'డాట్సన్ బెర్రీ' కారులో తిరుగుతూనే వుంటుంది. అతను ఆమె బంగళాకు అన్ని వేళల్లో వెడుతూనే వుంటాడు. తన శీలాన్ని గురించి పట్టించుకోని స్త్రీ ఎంత సాహసానికైనా పాల్పడగలదు—అలాంటి స్త్రీని ఈనాటి సమాజం మాత్రం ఏం చేయగలదు? ఆమెకు డబ్బుంది; అందముంది; పరువు ప్రతిష్ఠలు గల పురుషుల అండవుంది. ఏమైనా చేయగలదు? చేసింది కప్పిపుచ్చుకో గలదు."

ఇద్దరూ బటర్ చికెన్ తినడంలో నిమగ్నులయ్యారు.

సుశీలాదేవి చరిత్ర విన్న తర్వాత

లావణ్య మనస్సులో ముల్లుగుచ్చుకున్నట్లయింది. తింటూ ఆలోచనలో పడింది. సుశీలాదేవి కథకూ, బంగళా కొనడానికీ సంబంధ మేముంది! ఒక్కొక్క బిల్డింగ్‌కూ, ఒక్కొక్క ఫ్యామిలీకీ....ఒక్కొక్క కథా వుండొచ్చు. వాట్ని గురించి పట్టించుకోవాల్సిన పనేముంది?—అని సరిపెట్టుకుంది లావణ్య.

అగ్రిమెంట్‌లోని తేదీ దాటక ముందే బంజారా హిల్స్‌లోని ఆ బంగళాను లావణ్య రిజిస్టర్ చేయించుకుంది.

రోడ్డు నెంబర్ 12లో వున్న బంజారా హిల్స్ బంగాళాలో లావణ్య ప్రవేశించింది. గేటుకు ఇరు వైపులా వున్న ప్లాంక్స్ మార్పించింది. ఒకదాని మీద ఇంటి పేరు, "లావణ్య" అనీ, మరోదాని మీద భర్త పేరు, "డా. రజనీ కాంత్" అనీ బ్లాక్ మార్బుల్ ప్లాంక్స్ మీద గోల్డెన్ లెటర్స్‌తో వ్రాయించింది.

నాలుగు రోజుల్లో డా. రజనీ కాంత్ అమెరికా నుంచి వస్తున్నట్టు కేబుల్ వచ్చింది.

బంగళాకు కొన్ని రిపేర్లు చేయించింది లావణ్య, కొత్తగా రంగులు వేయించింది. ముందు గార్డెన్ బాగుచేయించింది. వెనుక కొన్ని చెట్లను కొట్టించింది.

ఆరోజు సాయంకాలం రాజేష్ గోల్డెన్ రిట్రెవర్ "హిట్లర్"తో బాల్‌తో ఆడుకుంటున్నాడు. బంగళా వెనుక వరండా కింద గార్డెన్ చైర్‌లో కూర్చుని "ఉమెన్స్ జర్నల్"లో బొమ్మలు చూస్తూ కూర్చుంది లావణ్య.

రాజేష్ బాల్ విసురుతుంటే, పరుగెత్తి కెళ్ళి ఆ బాల్‌ను తెస్తూన్నది 'హిట్లర్', ఒకసారి బాల్ కాంపౌండు ప్రక్కనున్న గడ్డి దుబ్బులో పడింది. ఆ బాల్ కోసం 'హిట్లర్' పరుగెత్తింది. కాని అది బాల్ జోలికిపోలేదు. ముందు కాళ్ళతో, మూతితో ఆ గడ్డి దుబ్బుల్ని తవ్వింది. అక్కడేముందోనని రాజేష్ వెళ్ళాడు. అది తవ్వుతూంటే చూస్తూ నిలబడ్డాడు వింతగా, విస్మయంగా. ఆ తర్వాత "మమ్మీ!" అని కేక వేశాడు రాజేష్ సంభ్రమాశ్చర్యంతో.

అక్కడకు వెళ్ళింది లావణ్య.

గడ్డి దుబ్బుల్ని తవ్వగా మట్టి బయట పడింది. ఆ మట్టిని మరికొంత తవ్వగా చేతుల, కాళ్ళ ఎముకలూ, పుర్రె బయట పడ్డాయి.

"ఏమిటి మమ్మీ!" అన్నాడు రాజేష్ భయంతో.

లావణ్యకు వొళ్ళు గగుర్పొడిచింది.


రాజేష్ తల్లిని మళ్ళీ అడిగాడు.

అసలు సంగతి చెబితే అబ్బాయి భయంతో దడుసుకుంటాడని లావణ్య గ్రహించింది.

"ఏం లేదురా! ఈ ఇంటి వాళ్ళకు స్టాలిన్ అనే కుక్క వుండేదట. దానికి జబ్బు చేసి చనిపోయిందట. ఇక్కడ పాతి పెట్టారట దాని బొమికెలే ఇవి" అంది లావణ్య మామూలు స్వరంతో.

రాజేష్ కనుబొమ్మలు ఎగుర వేశాడు ఆశ్చర్యాతిశయంతో.

కాని ఆ ఎముకలూ, పుర్రె కుక్కవి కావనీ, సుశీలాదేవి భర్తవనీ, రామచంద్రం బ్రతుకు అక్కడే భూస్థాపితమైందనీ— అనుకుంది లావణ్య. ■



తుంగభద్రా ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారి ఉత్పాదన కర్నూల్ (ఆంధ్రప్రదేశ్)

నేనూ నా ప్రేమకథ

మల్లిక్

ఆశ్చర్యం కలిగించే ప్రేమ కథలు ఉంటాయ్. వార్ని! .... ప్రేమకోసం ఎంత తెగించారు!!....ఎంత సాహసంచేశారు వీళ్ళసాధ్యం కూలా అని మనం ముక్కున వేలేసుక్కుని తీరాల్సిందే కొన్ని ప్రేమ కథలు విన్న తరువాత. అలాగే మనసుకు బాధ కలిగించే ప్రేమకథలు ఉంటాయ్. అరెరే.... ప్రేమకోసం ప్రాణాలుకూడా త్యాగం చేశారే అని కొన్ని ప్రేమకథలు విన్న తరువాత బాధపడతాం అందులో ప్రాణ త్యాగం చేసిన హీరోతో మనల్ని మనం పోల్చుకుని మరింత ఇదిగా బాధపడ్తాం. నిజమే కదా....హీరోతో కాకుండా విలన్‌తో పోల్చుకోవడం సాధ్యమా చెప్పండి.

నా మట్టుకు నేను కొన్ని ప్రేమకథలు చదివి ముక్కున వేలేసుక్కున్నాను. కొన్ని ప్రేమకథలు చదివి బాధపడిపోయాను.

ఒకసారి పకపకా నవ్వించే ప్రేమకథలు ఉండవా? అని సందేహంతో నా ప్రక్కసీట్లో పనిచేసే పాపారావ్‌ని అడిగాను. వాడు జేబురుమాలుతో నోరుమూసుకుని ఘొల్లున నవ్వాడు. రుమాలుతో నోరు మూసుకుని నవ్వడమేమిటీ అని ఆశ్చర్యపోతున్నారా? నవ్వేటప్పుడు నామీద తుంపర్లు పడకుండా ఉండేందుకు వాడు అలా చేసి ఉండొచ్చు అని సహృదయంతో మీరు ఆలోచించవచ్చు గానీ ఆగాడిద అలాంటి ఉపకారబుద్ధి ఉన్న వాడు కాడు. నాదగ్గర సంవత్సరం క్రితం అప్పుగా తీసుక్కున్న వంద రూపాయలు ఇప్పటి వరకూ ఇవ్వలేదు.

సరే....పకపకా నవ్వించే ప్రేమకథలు ఉండవా అనికదూ నేను వాడిని అడిగింది?...

నవ్వి నవ్వి తడిసి ముద్దయిన జేబు రుమాలు నోటి మీదినుండి తీసి "తెలుగు సినిమాలు నువ్వసలు చూడవా?" అని ఎదురు ప్రశ్న వేసి వెళ్ళిపోయాడు పాపారావ్.

నేను బిక్కచచ్చిపోయాను. ఆ సమయంలో అద్దంలో నాముఖం నేను గనుక చూసుకుని ఉంటే వెధవని వెయ్యికి తక్కువ కాకుండా తిట్టుకుని ఉండేవాడిని.

అసలు పాపారావ్ జేబురుమాలు నోటికి అడ్డు పెట్టుకుని ఎందుకు నవ్వుతాడో చెప్పలేదు కదూ?....వాడి పలువరస కూడా వంకరగా ఉంటాయ్.

ఈ నవ్వు పుట్టించే ప్రేమకథలు నాకో పెద్ద సమస్య అయిపోయింది. వాటి తాలూకు ఆలోచనలు పాతబడిపోయిన పెళ్లాంలా మెదడుని తినేయసాగాయ్

హాస్యకథల పోటీలో ఎన్నికైన కథ



ఎన్నో....ఎన్నెన్నో ప్రేమకథలు చదివాను గానీ అన్నీ త్యాగాల ప్రేమకథలు, విచారం ప్రేమకథలు, సంతోషం ప్రేమకథలు. ఇంకా వగైరా వగైరా ప్రేమకథలు....

అసలు ఈరచయితల్ని అనాలి... ఛూ....

"డ్రాఫ్టింగ్ చెయ్యడం రాకపోతే అడిగి తెలుసుకోవాలి....అలా ఫైలు మీద ఉమ్మేస్తే ఎలా?..." మా సూపరింటెండెంటు సీరియస్‌గా నావైపు చూస్తూ అన్నాడు.

ఆలోచనల్లో మునిగిపోయి నేను చేసిన తప్పును గ్రహించాను. జేబురుమాలు తీసి ఫైలును తుడిచాను.

ఆరోజు నామనసు ఆనందంతో గంతులు వేసింది. ఎందుకంటే ఆరోజే మాఆఫీసులో కొత్తగా ఓ టైపిస్టు చేరింది. పేరు హేమమాలిని అయితే బావుండేది కానీ కాదు.... సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి!....ఆ అమ్మాయిని చూసిన తరువాత ఆ పేరు కూడా నాకు ఎంతో మంచి పేరులా అనిపించింది. అయినా పేరులో ఏముంది?...

చూసిన మరుక్షణం నేను అనుకున్నాను నా డ్రీమ్ గర్ల్ ఆ అమ్మాయేనని.

అంత మాత్రంచేత మనసు గంతులు వేయాలనేం లేదుగా?....

మా మేనేజరు పరాంకుశం ఆ అమ్మాయిని ప్రతి బల్ల దగ్గరికీ తీసుకువెళ్ళి అందరికీ పరిచయం చేశాడు.

"ఈయన ఈ సెక్షనులో యు. డి. సి. అప్పుడప్పుడూ మన ఆఫీసు కల్చరల్ ప్రోగ్రాంలలో, నాటకాల్లో వేషాలు వేస్తుంటాడు. చాల యాక్టివ్ పర్సన్‌లే...." అన్నాడు అమ్మకడుపు చల్లగా పరాంకుశం.

సుబ్బలక్ష్మి చిరునవ్వుతో నమస్కరించింది.

"అయితే మీరు మంచి నటులన్నమాట!...."

ఇదిగో.... ఇక్కడే ఆనందంతో నా మనసు గంతులు వేసింది. ఉక్కిరి బిక్కిరి అయిపోయాను....

గబుక్కున కుర్చీలోంచి లేచాను. నమస్కారం పెడదామని అనుకుంటే చేతిలో ఫైలుంది. ఈ వెధవ ఫైలు చేతిలోకి ఎలా వచ్చింది?

విసురుగా టేబులు మీద ఫైలు పడేశాను. ఆ విసురుకి దొంతరగా ఉన్న మిగతా ఫైళ్లు నేలమీద పడ్డాయ్. గబగబ క్రిందికి వంగి వాటిని సరి టేబుల్ మీద పెట్టి చిరునవ్వు నటిస్తూ నమస్కారంపెట్టి ఎదురుగా చూశానుగానీ అక్కడ సుబ్బలక్ష్మి గానీ పరాంకుశంగానీ కనబడలేదు.

నేను దరిద్రపు మొహాన్ననీ....నష్టజాతకుడిననీ చిన్నప్పటినుండీ మా అమ్మ నన్ను తిడ్తూనే ఉంది. అది నిజమే అనిపించింది నాకు. ఎందుకంటే సుబ్బలక్ష్మిని మా సెక్షనులో కాకుండా ప్రక్క సెక్షనులో వేశారు.


సుబ్బలక్ష్మి అటెండెన్సు రిజిష్టరులో సంతకం చెయ్యడానికి రోజూ మా సెక్షనుకి రావాలి....అలా రోజూ ఆమెను చూసే అదృష్టం నాకు దొరికింది.

ఒకసారి అటెండెన్సు రిజిష్టరులో నేను సంతకం చేస్తుంటే వెనకే సుబ్బలక్ష్మి నిలబడింది. తనుకూడా సంతకం చెయ్యడం కోసం.

"అరె....పెన్ తేవడం మర్చిపోయాను. మీ పెన్ ఇస్తారా సంతకం పెట్టి ఇస్తాను" అని నన్ను సుబ్బలక్ష్మి అడిగేసరికి "ఆహా.... ఎంత అందమైనదీ ప్రపంచము... ఈ సృష్టిలో ప్రతి యొక్కటియూ ఎంతో మధురమైనదిగదా?....భగవంతుని లీలలు ఎవ్వరికి అర్థమగును?"....అని ఆలోచిస్తూ తన్మయత్వంలో కళ్లు మూసుకున్నాను.

"మీకు పెన్ ఇవ్వడం ఇష్టం లేకపోతే పోనీలెండి...."

ఉలికిపడి కళ్లు తెరిచి చూశాను. సుబ్బలక్ష్మి నావంక అయోమయంగా చూస్తూ నిలబడి ఉంది.



నా తన్మయత్వం ఆమె తప్పుగా అర్థం చేసుకుందని గ్రహించాను.

"ఎంతమాట...మీకు పెన్ ఇవ్వడం నా అదృష్టం...." అన్నాను.

పెన్ క్యాప్ తీసి వెనకకు తగిలించి ఆమె చేతికి ఇచ్చాను. మా అమ్మ తిట్టినట్టు నేను నష్ట జాతకుడినే. పెన్ను ఇచ్చేటప్పుడు కనీసం ఆమె చేతివేళ్లు కాదుకదా ఆ వేళ్ల తాలూకు గోళ్లుకూడా తగల్లేదు.

"ఏమిటండీ మీ పెన్ వ్రాయడం లేదు...." సుబ్బలక్ష్మి పెన్ పైకెత్తి పాళీ వైపు నిశితంగా పరిశీలిస్తూ చూసి అంది.

"ఏదీ ఇలా తెండి...."

ఆమె చేతిలోంచి పెన్ తీసుకున్నాను. మా అమ్మ తిట్టినట్టు ఈసారి కూడా నేను నష్టజాతకుడినే.

ఆమెకంటే నిశితంగా పాళీని చూశాను. ఎడమ చేతిలోకి మార్చి మళ్ళీ చూశాను. పాళీ భూమికి లంబంగా ఉండేటట్టు పెన్నుని నిలువుగా పట్టుకుని చూశాను.

"పెన్ను బాగానే ఉందే!!.... ఇప్పుడే నేను సంతకం కూడా చేశాను. మీరు పట్టుకునే సరికి పిచ్చిముండ సిగ్గు పడిపోయి ఉంటుంది.... హి....హి. ..హి...."

ఆమె నవ్వలేదు.

నేను క్రిందికి వంగి ఓ చిత్తు కాగితం తీసి దాని మీద వ్రాసి చూశాను .... ఊహు ....లాభం లేదు. నేల మీదికి పెన్ను విదిలించాను. మళ్ళీ వ్రాశాను. కాగితం చిరిగింది. పెన్ను మళ్ళీ విదిలించాను. ఇంకు అయిపోయిందేమో, విదిలిస్తే ఇంకు రాలడం లేదు.

"పరవా లేదు లెండి .... ఈయన దగ్గర పెన్ను తీసుకుని సంతకం చేసేగాను...."

సుబ్బలక్ష్మి నాతో చెప్పి వాళ్ళ సెతును లోనే పని చేసే గణేశ్ రావ్‌తో కలిసి వెళ్ళి పోయింది.

పెన్ను కనిపెట్టిన వెధవెవడో ఇంకు లేకపోయినా వ్రాసేటట్టు ఎందుకు కనిపెట్ట పోతేపోయాడు .... నా పెన్ను వ్రాయక వ్రాయాపోయే ఆ గణేశ్‌గాడి పెన్నెందుకు ?....థూ....

"పైళ్ళ అనుకున్నాను.... అటెండెన్స్ రిజిస్టర్ల మీదకూడా ఉమ్మేస్తున్నావా...." గుడ్లురుముతూ అన్నాడు మా సూపరింటెండెంట్.

నా వెనకే ఆయన నిలుచుని ఉండటం నేను చూడలేదు మరి.

ఈ మధ్య నాకేమిటో మహా చెడ్డ వికారంగా ఉంటోంది. ఒకరోజు డాక్టరు దగ్గరికి వెళ్ళాను.

"వికారంగా ఉంటుందండీ..." అన్నాను.

"మూడు పూట్లా ఎవోమిన్ మాత్రలు వాడు..." అని చెప్పాడాయన.

మాత్రలు వాడానుగానీ ఆవేమి పని చెయ్యలేదు. మా అమ్మ నా కోసమని (నా వికారం కోసమని) ప్రత్యేకంగా నిమ్మకాయ పచ్చడి పెట్టింది. పచ్చడి తింటున్నంత సేపూ బాగానే ఉంటుంది గానీ వికారం మాత్రం తగ్గలేదు.

నా వంద రూపాయల అప్పు తీర్చలేక పోయినా పాపారావ్ నాకు అంతరంగిక సలహాదారు. అందుచేత నా వికారం సంగతి వాడికి చెప్పాను.

"కొద్ది రోజులుగా నిన్ను గమనిస్తు న్నాను....నీ వికారం గురించి నాకు అర్థం అయిపోయింది. అది మందులకీ, పచ్చళ్ళకీ అల్లం రసాలకి తగ్గే వికారం కాదు."

"మరి?...." నేను బెంబేలెత్తి పోయాను.

"ఈ వికారం శారీరక రుగ్మతల వల్ల కలిగింది కాదు.... ఇది మానసికమై నది....దీనికి కారణం సుబ్బలక్ష్మి...."

"సుబ్బలక్ష్మి!!...."

"అవును...సుబ్బలక్ష్మిని నువ్వు ప్రేమిస్తు న్నావు. వికారం ఈజీక్వల్టు ప్రేమ.... హా హా హా...."

వెంటనే చేతికి జేబురుమాలు అందని కారణంగా చొక్కా పైకెత్తి నోటికి అడ్డు పెట్టుకుని నవ్వాడు పాపారావు. అతని చొక్కా క్రింది భాగం అంతా తడిపి పోయింది.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. పాపారావు మాటలే నా చెవుల్లో ప్రతిధ్వని స్తున్నాయ్.

"వికారం ఈజీక్వల్టు ప్రేమ...."

అవును సుబ్బలక్ష్మి నా డ్రీమ్‌గర్ల్... సుబ్బలక్ష్మిని నేను ప్రేమిస్తున్నాను. ఇన్నాళ్ళకి నేనుకూడా ప్రయోజకుడి నయ్యాను.... సుబ్బలక్ష్మిని నా స్వంతం చేసుకుంటే గానీ నా వికారం తగ్గదు.

మర్నాడు....

"సుబ్బలక్ష్మిని నేను వికారిస్తున్నాను." అన్నాను పాపారావ్‌తో.

పాపారావు అర్థం కానట్టు చూశాడు నావైపు.


"అదే.... ప్రేమిస్తున్నాను.... వికారం ఈజీక్వల్టు ప్రేమ. నిన్న రాత్రంతా బాగా ఆలోచించాను.

"కానీ ఆలోచించకపోయినా నీ వికారం గురించి నాకు తెలుసు...."

"ఈ వ్యవహారంలో నీ సలహా కావాలి ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"ముందు ఆమె పనిచేసే సెతునకి రోజూ ఏదో నెపం మీద వెళ్ళు.... ఆమె వైపు చూపులూ, చిరునవ్వులూ విసిరి ఆమె అంటే నీకు యిష్టం ఉందని ఆమెకి తెలిసేలా ప్రవర్తించు.... తరువాత నెమ్మది నెమ్మదిగా మాటలు కలుపు...."

"రోజూ పనిలేకుండా ఏ నెపం పెట్టుకుని ఆ సెతునుకి వెళ్ళాలి? తీరా వెళ్ళిన తరువాత అక్కడ ఓ మూల నిలబడి ఆమె వైపు చూస్తూ ఉంటే ఏం బావుంటుంది?...." అంటూ నా సందేహాన్ని వెలిబుచ్చాను.



పాపారావ్ విసుక్కున్నాడు.

"మరీ ఇంత అజ్ఞానం అయితే ఎలా?.... ఆ సెక్షనులోకి గణేశ్‌రావ్‌తో స్నేహం కలుపుకో—అతనితో మాట్లాడడానికి వెళ్ళినట్టు వెళ్ళి ఆమె మీదకి లుక్స్ విసురు. అన్నట్టు గణేశ్‌రావుది ఆ అమ్మాయి ప్రక్క సీటే, బాగా దగ్గర నుండే లుక్స్ విసరొచ్చు...."

పాపారావ్ సలహా నాకు బాగా నచ్చింది. అప్పటి కప్పుడే సుబ్బలక్ష్మి పనిచేసే సెక్షనుకి వెళ్ళాను. ఆ సమయంలో సుబ్బలక్ష్మి టైపు చేస్తోంది. గణేశ్‌రావ్ ఫైల్లో ఏదో గెలుకుతున్నాడు పెన్నుతో.

కుర్చీ లాక్కుని గణేశ్‌రావు ముందు కూర్చున్నాను. గణేశ్‌రావ్ తలెత్తి నా వైపు చూశాడు.

"హలో గురూ బావున్నారా? ఏమిటో ఈ మధ్య మీరు మా సెక్షనుకు కూడా రావడం లేదు...." అన్నాను చాల కలుపుగోరు తనంగా.

గణేశ్ రావ్ తెల్లబోయి నా వంక చూశాడు. బహుశా హఠాత్తుగా నే(ను) చనువుగా పలకరించినందుకు కాబోలు.

"బాగానే ఉన్నాను...ఏం పని మీద వచ్చారు?..."

ఈ వెధవ హఠాత్తుగా ఇలా అడుగుతాడని అనుకోలేదు. వచ్చినవాడితో ఆ మాటా ఈ మాటా మాట్లాడితే వీడి సొమ్మేం పోయింది? ఏం పని మీద వచ్చారట! బోడి స్టైయిలూ వీడూను.

"పనేం లేదు...నా సీట్లో అంతగా పని లేదు. పోనీ గోళ్ళు గిల్లుకుందామనుకుంటే అవెప్పుడో కొరికేశాను....హి....హి....హి"

సుబ్బలక్ష్మి వంక ఓరగా చూశాను ఆమె నా జోక్‌కి నవ్వలేదు. అంత అందమైన అమ్మాయి సెన్సాఫ్ హ్యూమర్ లేక పోవడమేమిటి? ఉహు......ఉండే ఉంటుంది. నా జోక్ విని ఉండకపోయి ఉండొచ్చు... అంతే.

"మీకు పని లేకపోవచ్చుగాని నాకు చాల పని ఉంది......." అని తల ఫైల్లో దూర్చేశాడు గణేశ్ రావు.

నేను పాపారావ్ దగ్గరికి వెళ్ళి వాడిని చెడా మడా తిట్టేశాను........నీ సలహా పడ్డినట్టే ఉందని.

"మరి ప్రేమంటే ఏమనుకున్నావ్?.... సహనం ఉండాలి. అవమానాలూ బాధలు భరించాలి....సుబ్బలక్ష్మితో నీకు కాస్త పరిచయం అయ్యేవరకూ ఆ గణేశ్ రావ్ గాడిని జిడ్డులా పట్టుకో....ఆ తరువాత వాడిని నువ్వు కేర్ చెయ్యక్కర లేదు...." అన్నాడు మర్నాడు....పాపారావ్,

గణేశ్ రావ్ ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాను. "హలో బావున్నారా?" సుబ్బలక్ష్మి వైపు చూస్తూ గణేశ్ రావ్ ని అడిగాను.

"బావున్నాను గానీ....చాల బిజీగా ఉన్నాను."

వెధవ....నేను సుబ్బలక్ష్మి గురించి వస్తున్నట్లు పసిగట్టలేదు కదా?

"సర్లెండి .... పనెవరికి లేదు....ఇరవై నాలుగ్గంటలూ ఇలా ఫైళ్ళు ముందేసుకుని కూర్చుని ఇంత సీరియస్‌గా పని చేస్తే మెదడు మొద్దుబారిపోతుంది....మధ్యమధ్య నాలాంటి స్నేహితుల్తో కులాసాగా కబుర్లు చెప్తే అలసట అనేది ఉండదు...."

"ఇంతకీ మీ పేరు?...." గణేశ్ రావ్ కుర్చీలో అలసటగా వెనక్కు వాలాడు.

"చూశారా...పని చేసి చేసి మీ మెదడు మొద్దుబారి పోయింది, నా పేరే మర్చి పోయారు. నా పేరు సీతారాం అండీ బాబూ...."

"ఏం పనిమీద వచ్చారు?"

"మళ్ళీ అదే కూతా?"

"అబ్బ........పనీ... పనీ ఏం సిన్సియర్ వర్కర్లండీ బాబూ" నవ్వునటిస్తూ మస్కా కొడ్తున్న ధోరణిలో అన్నాను.

వెధవ కాస్త చిరునవ్వు నవ్వాడు. పడ్డాడు.... వల్లో పడ్డాడు.

"అద్సరేగానీ మీరు ఆవకాయ పెట్టుకున్నారా?...."

గణేశ్ రావ్ తెల్లబోయి చూశాడు.

సుబ్బలక్ష్మి కిసుక్కున నవ్వింది.

సుబ్బలక్ష్మికి సెన్సాఫ్ హ్యూమరుంది.

"ఏమిటీ?...? గణేశ్ రావ్ అడిగాడు.

పీడికి బుర్ర లేదు. పదిసార్లు చెప్తేగానీ అర్థంకాదు.

"ఆవకాయ పెట్టుకున్నారా?...."

"అబ్బే ఇంకా లేదండీ...." ఇబ్బందిగా కదులుతూ సుబ్బలక్ష్మి వంక ఓ అరక్షణం చూసి అన్నాడు.

నాతో మాట్లాడుతూ అటు చూస్తాడేం వెధవ. కొంపతీసి సుబ్బలక్ష్మితో వెధవ్వే షాలు వెయ్యాలని అనుకోవడం లేదుకదా?

"ఇంకా ఆవకాయ పెట్టుకోలేదూ .... మాయింట్లో పోయిన నెల్లోనే పెట్టేశాం... మార్కెట్లోకి పళ్ళు వచ్చేస్తున్నాయ్. ఇం కొద్ది రోజులు పోతే మీకు మామిడికాయలు దొరకవు. త్వరగా ఆవకాయ పెట్టు కోండి...."

"అలాగే...."

"అన్నట్లు మీరు మామిడికాయ ముక్కల్ని ఉప్పులో ఊరేసి ఎండబెట్టి నిలవ ఉంచుకుంటారా?...."

"ఆ...." గణేశ్ రావు మళ్ళీ ఇటునుండి అటు కదిలాడు కుర్చీలో.

"మీకు మామిడి పళ్లలో ఏ పళ్లంటే యిష్టం?"


"ఏమీ యిష్టంలేదు...."

"నాకు చెరుకు రసాలంటే యిష్టం... కానీ ఇక్కడ మంచి రసాలు దొరకవు.... మా ఊళ్లో మంచి రకం రసాలు ఇంతంత పెద్దవి దొరుకుతాయి. ఏమిటి అలా కదులు తున్నారు?... కుర్చీలో గుండు సూదులే మైనా ఉన్నాయేమో చూస్కోండి...."

గణేశ్ రావ్ సీరియస్‌గా చూశాడు. నవ్వలేదు... వెధవకి సెన్సాఫ్ హ్యూమర్ లేదు. ఓరగా సుబ్బలక్ష్మి వంక చూశాను.

సుబ్బలక్ష్మి ముసిముసిగా నవ్వుతోంది. నాకు చచ్చేంత ఉత్సాహం వచ్చింది.

"ఇక్కడ పళ్ళు తూకం వేసి అమ్ము తారు గానీ మాఊళ్లో పాతికలు, పరకలు



లెక్కన అమ్మితారు ...ఇంతకీ పరకంటే ఎంతో తెలుసా?...పదమూడండీ బాబూ.... ఇకపోతే అక్కడ పంచరార కలశాలు అనే మామిడిపళ్ళుకూడా దొరుకుతాయ్ అవి"

"నాకు అర్జంటుగా బయటికి వెళ్ళే పనుంది....వస్తాను...."

గణేశ్ రావ్ కుర్చీలోంచి లేచి సర్రున బయటికి వెళ్లి పోయాడు. నేను కూడా లేవక తప్పలేదు.

మర్నాడు అదే సమయానికి గణేశ్ రావ్ సెక్షనులోకి అడుగు పెట్టాను. కుర్చీ లాక్కుని గణేశ్ రావ్ దగ్గర కూర్చుందామని అనుకుంటూ ఉండగా "ఏమోయ్ సీతారాం....ఇలారా...." అంటూ వాళ్ళ సెక్షన్ సూపరింటెండెంటు లక్ష్మణ రావు పిలిచాడు.

రోజూ ఇలా వచ్చి మా క్లర్కుల్ని డిస్టర్బ్ చెయ్యకు అని తిట్టడానికి పిలిచాడేమో....మెల్లిగా అతని దగ్గరికి వెళ్లి నిలుచున్నా.

"కూర్చో...."

కూర్చున్నాను,

"నువ్వు శివానందం గారి అబ్బాయివేనా?"

"అవునండీ!...."

"మరి చెప్పవేం?....నిన్న సాయంత్రం సుల్తాన్ బజార్లో మీ నాన్నగారు కలిశారు. మా వాడు కూడా మీ ఆఫీసులోనే పని చేస్తున్నాడు అని చెప్పారు. ఎలా ఉంటాడని అడిగాను. సన్నగా నల్లగా పొడుగ్గా అదో మాదిరిగా ఉంటాడని చెప్పారు........అంతే చటుక్కున నువ్వే శివానందం గారి అబ్బాయివని పోల్చేశాను...."

లక్ష్మణరావు ఒక అరగంటపైగా నన్ను కూర్చోబెట్టి నానారకం చెత్త వాగుడు వాగి నన్ను పంపించేశాడు. సుబ్బలక్ష్మిని చూడాలన్నా వీలు లేకుండా ఆమె సీటు వెనక్కు ఉంది. ఆయన మాట్లాడుతుంటే వెనక్కి తిరిగి చూస్తే ఏం బావుంటుంది?..

మళ్ళీ మర్నాడు గణేశ్‌రావ్ సీటు దగ్గరికి బయలు దేరాను. సెక్షనులో అడుగు పెడుతూనే

"ఏం వోయ్.... ఇలారా"

లక్ష్మణరావ్ పిలిచాడు....

అరగంట గడిచిపోయింది. నేను సెక్షనుకి వెళ్ళిపోయాను.

రోజూ ఇదే తంతు. గణేశ్‌రావ్ దగ్గర కూర్చుని పది రోజులు అయిపోయింది.

నేను పాపారావ్‌కి నా ప్రాబ్లమ్ గురించి చెప్పాను. లక్షణరావు బారినుండి నేను బయటపడే ఉపాయమే లేదా? అని అడిగాను.

"నన్ను అడిగితే అది పెద్ద ప్రాబ్లమే కాదు....అసలైన ప్రాబ్లమ్ వేరే ఉంది."

నా గుండె దడ దడ లాడింది.

"ఏమిటి?...."

"నువ్వేమో ఆ లక్ష్మణరావుతో బాతాఖానీ వేస్కుంటూ కూర్చున్నావ్...కానీ ఆ గణేశ్‌రావ్ సుబ్బలక్ష్మిలో బాగా పరిచయం ఏర్పరుచుకుంటున్నాడు ... వాళ్ళ సెక్షనువాళ్ళు చెప్పారు. వాళ్ళిద్దరూ ఎప్పుడూ అదే పనిగా మాట్లాడుతూ ఉంటారట..."

నాకు ఒక్క క్షణం గుండె కడుపులోకి జారిపోయినట్టు అనిపించింది.

"ఓరి దౌర్భాగ్యుడా...అందుకనా ఈ మధ్య నేను పలకరించినా దులపరించుకుని వెళ్ళిపోతున్నావ్?....అమ్మో అమ్మో.... నా డ్రీమ్‌గర్ల్‌ని తన్నుకు పోవడానికి చూస్తున్నాడు."

"పాపారావ్.... సుబ్బలక్ష్మి నాకు దక్కేలా చూడు...."

"అయిదయి పోయింది.... మనం బయటకెళ్ళి ఎక్కడైనా కూర్చుని మాట్లాడితే బావుంటుంది."

ఎక్కడైనా కూర్చుని మాట్లాడితే బావుంటుందట. పబ్లిక్‌గార్డెన్‌లో కూర్చుని మాట్లాడదామంటే వస్తాడా వెధవ?

ఇద్దరం బార్‌కి వెళ్లాం.

సీసాలూ, గ్లాసులూ, జీడిపప్పులూ, కోడి కూర అన్నీ వచ్చేశాయ్.

పాపారావ్ వాటిమీద పడ్డాడు. కొద్దిసేపటికి పాపారావ్‌కి నిషా ఎక్కడం మొదలుబెట్టింది.

"నాయనా .... నువ్వు శాస్త్ర సలహా పడేసి తరువాత తాగు .... నీ వాలకం చూస్తుంటే సలహా చెప్పకుండా ఔట్ అయ్యేలా ఉన్నావ్—...."

"ఓ తప్పకుండా ఇస్తాను. సలహాదేం ఉంది-అన్నట్టు నువ్వు నాకెప్పుడో వంద రూపాయలు అప్పు ఇచ్చినట్టున్నావ్ కదూ!"


"అర్థం అయ్యింది నాయనా .... ఆ వంద రూపాయలు కూడా నువ్వు ఇవ్వ నక్కరలేదులే....త్వరగా చెప్పు"

"సుబ్బలక్ష్మిని నువ్వు పొందాలంటే ముందు గనేశ్‌రావుకి సుబ్బలక్ష్మికి మధ్య మనస్పర్థలు కలగాలి...."

"ఎలా... ఎలా....ఎలా....ఎలా?...."

"అంత ఆతృతైతే ఎలా? .... చెప్తాను విను. గణేశ్‌రావ్‌కి ఏదైనా అవమానం జరిగిందనుకో...అప్పుడు అది చూసి సుబ్బలక్ష్మి నవ్విందనుకో... మయసభ సీనులో దుర్యోధనుడికి అభిమానం దెబ్బతిన్నట్టు గణేశ్‌రావ్‌కి అభిమానం దెబ్బతింటుంది....అంతే వాడికథ ఫినిష్....నీ కథ స్టార్ట్...."

"కానీ సుబ్బలక్ష్మి నవ్వాలి కదా?"



"ఓరి అక్కుపక్షీ....సుబ్బలక్ష్మికి నవ్వొచ్చేలా గణేశ్‌రావ్ అవమానించబడాలి..."

"ఎలా....ఎలా....ఎలా....ఎలా...?"

"అరటిపండు తొక్క!"

"అరటి పండు తొక్కా? .... ఏమిటది?...." నేను బుర్ర గోక్కున్నాను.

"మొన్నటినుండీ వాళ్ళు లంచ్ రూమ్‌కి వెళ్ళి లంచ్ తీసుకుంటున్నారు కదా?...."

"అవును"

"లంచ్‌టైం కాగానే ఇద్దరూ కలిసే వస్తున్నారు కదా?"

"అవును"

"ముందు గణేశ్‌రావ్-వెనక సుబ్బలక్ష్మి ....మూడు రోజులనుండీ అలానే వస్తున్నారు. వాళ్ళు నీ టేబులు ముందునుండే వాళ్ళ సెక్షనుకు వెళ్ళాలి...."

"అయితే ఏమిటి?"

"రేపు నువ్వు లంచ్‌లో ఇడ్లీలు దోసెలు తినవు....ఇంచక్కా అరడి పళ్ళు తింటావ్"

"ఎందుకూ?!"

"ఎందుకేమిటి?....అరటిపండు తొక్కని జాగ్రత్తగా దాచుకుని అల్లంత దూరంలో గణేశ్‌రావ్‌ని చూడగానే ఆ తొక్కని జాగ్రత్తగా అతను నడిచే దారిలో వెయ్యాలి.... గణేశ్‌రావ్ దాని మీద కాలేసి జర్రున జారి పడ్తాడు....అప్పుడు వెనుకగా వస్తున్న సుబ్బలక్ష్మి ఫక్కున నవ్వుతుంది....క్లోజ్...."

నాకో సందేహం వచ్చింది....మళ్ళీ అడుగుతే తిడ్తాడేమోనని భయం వేసింది అయినా ధైర్యంచేసి అడిగేశాను.

"గణేశ్‌రావ్ మరి ఆ తొక్కని తొక్కక పోతేనో?"

"ఎల్లుండి లంచ్‌లో మళ్ళీ అరటిపళ్ళే తింటావ్... ఎల్లుండికూడా తొక్కకపోతే ఆ మర్నాడు కూడా అరటిపళ్ళే తింటావ్ ఆ మర్నాడు కూడా తొక్కకపోతే..."

"ఇంక చాలు బాబూ....... అర్థం అయ్యింది.... యాహూ..." సంతోషం పట్టలేక గట్టిగా అరిచాను.

"నేను తాగితే నీకు నిషా ఎక్కిందేం?" పాపారావ్ ఆశ్చర్యంగా నా వంక చూశాడు.

ఆ రోజు రాత్రంతా నిద్రపట్టలేదు నాకు. రేపు గణేశ్‌గాడి చాప్టర్ క్లోజ్.... ఎల్లుండి నుండి సుబ్బలక్ష్మితో పరిచయం కోసం నేను వేసే కొత్త ప్లాన్స్....

మర్నాడు....

లంచ్ టైం....

అరటిపళ్ళు తినేశాను, నాకే కాదు.... పాపారావుకీ టెన్షన్‌గానే ఉంది.

లంచ్ టైం అయిపోయింది.

ఒకటి....రెండు....మూడు నిమిషాలు.

అదిగో గణేశ్‌రావ్....వాడికి వెనకాల పది గజాల దూరంలో సుబ్బలక్ష్మి.

నేను చేతిలోని అరటిపండు తొక్కని జాగ్రత్తగా ముందుకు విసిరాను.

"ఎందుకయినా మంచిది. ఇంకోటి రెండు గజాల అవతల విసురు...." పాపారావ్ గుస గుస లాడుతూ అన్నాడు.

నేను అలానే చేశాను.

గణేశ్‌రావ్ తొక్కని సమీపిస్తున్నాడు.

టక్ టక్ టక్ టక్....

అతని బూట్ల చప్పుడు.

లబ్ డబ్ లబ్ డబ్

నా గుండె చప్పుడు.

వచ్చేశాడు....వచ్చేశాడు.... అడుగు వే ....సాడు.... దాటేశాడు.

టక్....టక్....టక్....టక్....

లబ్...డబ్...లబ్....డబ్....

రెండో తొక్క! .... వెయ్ .... అడుగు వెయ్ .... వేస్తున్నాడా? ప్చ్ .... దాన్నీ దాటేశాడు.

పాపారావు మాట ఇంకా పూర్తికానే లేదు ధనేల్‌మని శబ్దం కెవ్వుమని—గూబ గళ్ళు పడిపోయేలా కేక వినిపించింది.

పాపారావు నేనూ ఉలిక్కి పడ్డాం.

మా కళ్ళముందు భయంకరమైన దృశ్యం.

సుబ్బలక్ష్మి నేలమీద వెల్లకితలా పడి ఉంది. ఆమె తల నేలని తాకి కొబ్బరి కాయ పగిలిన శబ్దం చేసింది.

ముక్కుతూ మూల్గుతూ లేచింది సుబ్బలక్ష్మి. ముందు వెళ్తున్న గణేశ్‌రావ్ పరుగెత్తి సుబ్బలక్ష్మి దగ్గరికి వచ్చాడు.

"దెబ్బ తగిలిందాండీ?" అని అడిగాడు.

"నిలువునా పడితే దెబ్బ తగలదూ?" సుబ్బలక్ష్మి విసుక్కుంది.

గణేశ్‌రావు చెయ్యి అందించి ఆమె లేచి నిలబడడానికి సాయపడ్డాడు.

నా నవనాడులు కృంగి పోయాయ్. గణేశ్‌రావ్, సుబ్బలక్ష్మి నాలుగడుగులు ముందుకు వేశారు.

మళ్ళీ కెవ్వున కేక .... దబ్బున శబ్దం.

రెండో అరటి పండు తొక్క కూడా సుబ్బలక్ష్మినే బలి తీసుకుంది.

సుబ్బలక్ష్మి వారం రోజులు శలవు పెట్టింది. ఆ రోజు లంచ్‌లో అరటిపళ్ళు తిన్నది నేనేనని ఆమెకి తెలిసి పోయింది.

".....నవ్వించే ప్రేమకథలుంటాయా అని ఒకసారి నన్ను అడిగావ్ గుర్తుందా?....నీదే ....హా .... హా .... హా ...." పాపారావ్ కర్చీఫ్ మూతికి అడ్డు పెట్టుకున్నాడు.

నాది పకపకా నవ్వు తెప్పించే ప్రేమ కథ ఎందుకౌతుంది? ✳

ప్రమోషన్

విశ్వ్యాహాంసి

అది 'డీలక్స్ పబ్లిసిటీ ఎసోసియేట్స్' ఆఫీసులో రిసెప్షన్ హాలుని ఆనుకుని కుడివయిపుగా ఉన్న చిన్న గది. గది మధ్యలో స్టీల్ టేబిల్, కుడివైపు ఆనుకుని ఒక చివరి నుంచి మరో చివర్ని ఆక్రమించిన నాలుగు అల్మైరాలు ఉన్నాయి. టేబిలు ముందు కూచుని పని చేసుకుంటున్నతని వయసు ముప్ఫయి ఉండొచ్చు. గదిలోకి ఎవరయినా ప్రవేశించగానే, అతని పరిచయం చేసే నేమ్ ప్లేట్ ఒకటి టేబుల్ మీద ఎదురొస్తుంది. దాని మీద ఎమ్. సి. రవీంద్ర కుమార్, అసిస్టెంట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, అని వుంటుంది.

మంచి వేసవి కాలపు మధ్యాన్నం మూడు గంటల సమయం. బాగా ఉక్కగా వుంది. అప్పుడే భోజనంచేసి వచ్చాడు రవీంద్ర. ఫ్యాన్ వేసుకున్నా చల్లగా అన్పించటం లేదు. "కంపెనీ పేరూ పెద్దదే, చెప్పుకొందుకు చేస్తున్న ఉద్యోగం పేరూ పెద్దదే. కానీ ఏం లాభం? పడుతున్న కష్టానికి తగిన సౌకర్యాలు లేక పోయాక" అని లోలోపలే విసుక్కుంటున్నాడు అతగాడు.

తన పై ఆఫీసరు సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఏర్ కూల్డ్ రూము, అక్కడున్న ఫస్ట్ క్లాసు ఫర్నిచర్ తలచుకుంటే మరింత చిరాకేస్తుంది రవీంద్రకి. ఇంతా చేస్తే, బాధ్యత నెత్తినేసుకుని పనిచేసేది తను. పై పైన డాబుగా తిరిగేవాడు అతను, లోపలెంత కచ్చగా ఉన్నా సరే, ఎదురుగా 'ఎస్సర్, ఎస్సర్' అనక తప్పదు. తనకొచ్చే జీతం ఎనిమిదొందలే అయినా, కంపెనీ ప్రెస్టీజికి తగినట్లు సూటు వేసుకు తీరాలి. వేసవి కాలం వచ్చిందంటే, ఎప్పుడాఫీసు నించి బయట పడతానా, ఈ సూట్ విప్పి ఈజీ డ్రస్‌లోకి మారతానా అన్నట్లుంటుంది అతనికి.

పరాగ్గా ఫైల్లో పేజీలు తిప్పుతున్న రవీంద్ర; ఫోన్ మోగేసరికి విసుగ్గా అందుకుని 'హలో' అన్నాడు. మాట్లాడుతున్నది ఎస్. ఇ. నారాయణరావు.

"హలో రవీంద్రా, ఇప్పుడే మేనేజర్ గారితో మాట్లాడి వచ్చాను. హి వాంటెడ్ టు సీయు. సాయంత్రం వెళ్ళేలోగా మీట్ అవమన్నారు. బై దిబై, నేను చూడాల్సిన వర్క్ ఏమయినా వుందా?"

"నో సర్—ఎవ్విరి థింగ్ ఈస్ రొటీన్.... నాలుగున్నరకి అయిపోతుంది నా పని. అప్పుడు మేనేజర్‌గార్ని మీట్ చేస్తాను.... అన్నట్లు.... 'మధూ లిక్కర్స్' కంపెనీ పేపర్స్ అకౌంట్స్ సెక్షన్‌కి పంపించేదా? మీరేమయినా...."

"నోనో. నేను ముందే చూసేను. పంపించేయి. ఒకే బై, సీయు టుమారో" అన్నాడు. ఫోన్ పెట్టేసిన శబ్దం అయింది.

మేనేజర్ తనతో మాట్లాడాలను కోవటం కొంత ఆశ్చర్యంగానే ఉంది రవీంద్రకి. అతనీ పోస్ట్‌కి వచ్చి నాలుగేళ్ళయింది. ఈ నాలుగేళ్ళలో నారాయణరావు నెలవులో వెడితే, మూడుసార్లు అఫీషియల్‌గాను, ఏవో కంపెనీ డిన్నర్ పార్టీల్లో అనఫీషియల్‌గా రెండు సార్లు మాత్రమే బిగ్ బాస్‌తో ఎదురుపడి మాట్లాడటం జరిగింది.

అనుకున్న టయిముకి పనముంది. వాష్ బేసిన్‌లో ముఖం కడుక్కుని, తల దువ్వుకుని, టై సరిజూసుకుని, ఛెయిర్ మీదున్న కోటు తొడుక్కుని బయలు దేరాడు రవీంద్ర.

మేనేజర్ గది ముందున్న చిన్న గదిలో ఒకమ్మాయి టైప్ చేస్తోంది. రవీంద్ర రాకను గమనించి, చేస్తున్నపని నాపి అతనికి విష్ చేసింది.

"బాస్ కోసం వచ్చారనుకుంటాను. వారు ఇంటికి వెళ్ళి కాస్సేపయింది. మీరొస్తే ఇంటికి రమ్మన్నారు" అన్నది.

మరింత ఆశ్చర్యపోయాడు రవీంద్ర.

"ఓకే. థాంక్స్ ఫర్ ది మెసేజ్" అనేసి బయలు దేరాడు.

హెల్మెట్ బిగించి, పది నిమిషాల్లో శివరామ్ కార్నడ్ గారిల్లు చేరాడు. పోష్ బంగళా కుండాల్సిన గేట్ వాచరు, గేటు దాటగానే ఎదురయే ఫ్లవర్ గార్డెన్, వరండాలోనే స్వాగతం పలికే అల్సేషియన్ డాగ్ లాంటి లక్షణాలన్నీ వారింటికి వున్నాయి.

పోర్టికోలో స్కూటరాపి బెల్ నొక్కాడు. తలుపు తీసిన పనికుర్రాడు, మీరు రవీంద్రగారా?" అనడిగి, అవుననగానే శివరామ్‌గారి గదికి దారి చూపించాడు.

వెళ్ళగానే టీకప్ ఆఫర్ చేసిన బిగ్ బాస్ మర్యాదకి తబ్బిబ్బవక తప్పలేదు రవీంద్రకి.

"నీతో ఒకపని చేయించాలని రమ్మన్నానోయ్"

"చెప్పండి సర్" వినయంగా అన్నాడు రవీంద్ర.

"చాలా ఏళ్ళుగా మనకున్న ప్రాస్పెక్టివ్ కస్టమర్స్‌లో "ప్రియా" ప్రెషర్ కుకర్స్ సంస్థ ఒకటి. వారి స్పెషాలిటి అందరికీ తెలిసిన విషయమే. మన స్టేట్‌లో మొదటగా తయారయిన ప్రెషర్ కుకర్ "ప్రియా". ఇప్పటికీ ఎన్నో ఇతర బ్రాండ్స్ వచ్చినా, తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నది. ఇంతే కాకుండా వారి స్పేర్ పార్ట్స్‌కి డూప్లికేట్స్‌ని తయారు చేయలేని ప్రత్యేకత ఒకటుంది. అయితే ఈ మధ్య ఏడాదిగా స్పేర్ పార్ట్స్‌లో ముఖ్యమయిన అంటే ఎక్కువగా సేల్ అవాల్సిన రబ్బర్ గాస్కెట్ అమ్మకం బాగా పడిపోతున్నట్లు తెలుస్తోంది.

"అందుక్కారణం, ఎవరో డూప్లికేట్‌ని తక్కువ ఖర్చుతో తయారు చేయటం, అమ్మటమే అనిపిస్తుంది. ప్రియా" ట్రేడ్ మార్క్‌ని అనధికారంగా ఉపయోగించుకుంటున్న దెవరో తెలిస్తే ప్రాసిక్యూట్ చేయవచ్చు."

"ఇదిలాగే కొనసాగితే, మన కంపెనీ కూడా కొంత నష్టం భరించాల్సిరావచ్చును. అందుకని మనమే దీన్ని ఎన్‌క్వైరీ చేసి చూస్తే, ఆ కంపెనీకి మేలు చేసినట్లవుతుంది"

"ఈ పని నీకు అప్పజెప్పాలనే నిన్ను రమ్మన్నది. ఇది రహస్యంగా జరగాలి. అందుకనే ఇంటికి పిలిచాను."

"ఓకే సర్. నాకొంచం టయమివ్వండి ప్రయత్నిస్తాను" మెచ్చుకోలుగా చూసారు శివరామ్ గారు.

ఆయన ఆఫీసులో ప్రత్యేకంగా, అందరికీ దూరంగా ఉన్నట్టు కన్పించినా, ఏ మూల



ఏం జరుగుతుందో, ఏ ఫైలు ఎవరి టేబిల్ మీద నిల్చి పోయిందో లాంటివి బాగా తెలుసు. అలాంటి వాడికి రవీంద్ర తెలివి, కార్యదక్షతా తెలియని విషయాలను కోవటం పొరబాటు.

o o o

టాంక్ బండ్ మీద నిలుచుని, వెయిట్ చేస్తోన్న రమ ముఖం వికసించింది, అల్లంత దూరంలో పసుపుపచ్చ స్కూటర్ కన్పించగానే.

స్కూటర్ ఆగగానే, "ఏమిటో ఇంతా లస్యం?" అంది.

"పెద్ద సారువాడితో మీటింగ్ అయిందిప్పుడే" అన్నాడు రవీంద్ర.

"ఊహూ. అవునా ఏమిటో విశేషం? ఏదయినా కొత్త బాధ్యత నెత్తి నెత్తారా?"

"ఊఁ. ఓ చిత్రమయినపనే అప్పగించారు" అని మొదలుపెట్టి క్లుప్తంగా విషయాన్ని వివరించాడు.

"మరయితే ఇంకేం, మూడు రోజుల్లో పనిముగించి బాస్‌ముందుపెట్టేయి. త్వరగా ప్రమోషన్ ఇచ్చేస్తారు" అంది రమ, చిరునవ్వుతో.

వారిద్దరి మధ్యా ప్రేమాయణం నాలుగేళ్ళుగా సాగుతోంది. రమ అంటే రవీంద్ర వాళ్ళమ్మకి ఇష్టమే. రవీంద్రపై రమ ఇంట్లో వాళ్ళకీ సదభిప్రాయమే. అయినప్పటికీ వాళ్ళ వివాహం వెనక్కే వెళుతోంది.

అందుక్కారణం రవీంద్ర మీదున్న కొన్ని బాధ్యతలు. అతనికి కాలేజీ చదువుల్లో వున్న తమ్ముళ్ళిద్దరున్నారు. వాళ్ళలో పెద్దవాడి చదువయి ఉద్యోగమయినా రావాలి. లేదా — తనకి ప్రమోషన్ అయినా రావాలి - అంత వరకూ పెళ్ళి వద్దు అని రవీంద్ర నిర్ణయం. అందుకే ఇలా సినిమా, షికార్ల ఛాన్సులతో సంతృప్తి పడుతోంటా రిద్దరూ.

o o o

రవీంద్ర తన పరిశోధన ఇలా మొదలుపెట్టాడు. ఇలాంటి డూప్లికేట్స్ తయారుచేసే కంపెనీలు ఎంత రహస్యంగా వ్యవహరిస్తుంటాయో అతనికి బాగా తెలుసు. తనెవరో ఏమిటో తెలిసిన ఏ షాప్ వాడూ చచ్చినా తనకి క్లూ ఇవ్వడు. అందుకనే సిటీకి బాగా దూరంగా ఉన్న 'అశోక్‌నగర్' ఎక్స్‌టెన్షన్‌లో ఓ ఎలక్ట్రికల్ సామాన్ల షాప్‌కి వెళ్లాడు.

మామూలుగా ఇతను వెళ్ళగానే,

"యస్ సర్. ఏం కావాలండి?" అనడిగాడు సేల్స్‌మన్.

"'ప్రియా' కుక్కర్ గాస్కెట్ ఒకటివ్వండి."

అతనందించిన ప్లాస్టిక్కవర్ అందుకుని అటూ ఇటూ తిప్పిచూస్తూ,

"ఎంతవుతుందిది?" అన్నాడు.

"పది రూపాయలు సార్"

"అబ్బో పది రూపాయలే, పోయినేడాది తొమ్మిదికే అమ్మారుకదోయ్!"

"నిజమేనండి. కానీ ఈ మధ్యనే ఆర్నెల్లుగా అన్ని కుక్కర్స్ స్పేర్స్ రేట్లు పెరిగిపోయినాయి. మేమేం చేయగలం సార్" అన్నాడు అటుగా ఓ టేబిల్ ముందు కూచున్న ప్రొప్రయిటర్ వయిపు చూస్తూ.

మరో షెల్‌లోంచి ఇంకో కవర్ పట్టుకొచ్చాడీసారి.

"ఇది చూడండి. కొత్తగా అమ్ముతున్నాం. ప్రియా కుకర్‌కి సరిగ్గా సెట్టవుతుంది. బాగా పనిచేస్తుందని చాలామంది కస్టమర్స్ అన్నారు."

దాన్నందుకుని చూసాడు. దానిమీద ప్రియా అనే పేరే వుంది. కానీ ట్రేడ్ మార్క్‌లో, డిజైనింగ్‌లో తేడా వుంది.


"ఇదెంత?"

"తొమ్మిది రూపాయలు సార్"

"ఒక రూపాయి తక్కువ" అని లెక్కగట్టుకుని, "సరి ఇదే తీసుకుంటాను" అని డబ్బు తీసిచ్చాడు.

అటు తర్వాత ప్రొప్రయిటర్ దగ్గరికి నడిచి, "హలో చూడండి. మీకి గాస్కెట్స్ డూప్లికేట్స్‌ని సప్లయి చేస్తున్న కంపెనీ ఏదో తెలుసునా?" అడగటంలో ఎంత అమాయకత్వం ప్రదర్శించబోయినా, అసలు ప్రశ్నే అనుమానాన్ని రేకెత్తిస్తోంది.

ఆ వివరాలన్నీ మీకెందుకు?— అంటున్నట్లుగా రవీంద్ర ముఖంలోకి చూసాడు అతను. తన విజిటింగ్ కార్డు తీసి చూపక



తప్పలేదు.

వెంటనే పక్కలో బాంబు పడ్డవాడిలా ఉలిక్కిపడ్డాడు అతను.

"అయ్యయ్యో సారీ సర్! మీరెవరో ముందు తెలియదు. రండిలా 'కూర్చోండి" అని కౌంటర్ అవతల క్లోసెట్ లోకి ఆహ్వానించాడు. కూల్ డ్రింక్స్ తెప్పించాడు.

రవీంద్ర వాళ్ళ కంపెనీ పబ్లిసిటీ ఇచ్చే, "డాగర్" ఎలక్ట్రికల్ అప్లైయన్సెస్ డీలర్ ఈ షాపతను. అందుకనే అంత మర్యాద.

మళ్ళీ తన ప్రశ్నని రిపీట్ చేసాడు రవీంద్ర.

"ఇలాంటివి పెద్దగా వివరాలు తెలుసుకునే ప్రయత్నం మేమూ చెయ్యం సార్. అయినా అడుగుతున్నది మీరు గనక చెపుతున్నాను. లక్ష్మి మార్కెటింగ్ కంపెనీ అనే ఒక చిన్న సంస్థ ఉంది. నెలకోసారి వాన్ వస్తుంది. విచారించుకొని మాక్కావలసిన గాస్కెట్స్ ఇచ్చి వెళుతుంటారు"

అడ్రస్ చెప్పమని అడగలేదు రవీంద్ర. నిజంగా అలాంటి కంపెనీ ఒకటున్నట్లయితే టెలిఫోన్ డైరెక్టరీ లో చూస్తే తెలిసిపోతుంది అడ్రస్.

షాప్ నించి బయటికొచ్చిన వెంటనే ఆపనే చేసాడు. అయితే మొదటి షాపులో దొరికిన ఇన్ఫర్మేషన్ ఎంత వరకు నిజమో ముందుగా వెరిఫై చేసుకోవాలి అనుకున్నాడు.

దాదాపుగా అక్కడుపయోగించిన పద్ధతిలోనే నాలుగయిదు షాపుల్లో విచారించాడు (ప్రతి షాపులో గాస్కెట్ కొనలేదు). అన్ని చోట్ల లక్ష్మి మార్కెటింగ్ కం. పేరే లభించింది.

ఆ రోజుకి విచారణ విరమించి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. మరురోజు ఉదయం చూడాల్సిన అర్జెంట్ వర్క్ అవటానికే మధ్యాహ్నం అయిపోయింది. అప్పుడు బయలుదేరాడు రాజేంద్రనగర్ కి.

బాగా చివర్లో ఓ పెద్ద కాంపౌండ్‌లో రెండు గోడౌన్లు, చిన్న ఆఫీసు బిల్డింగ్ కన్పించాయి. తన విజిటింగ్ కార్డుపయోగించి నేరుగా ప్రొప్రయిటర్‌ని చూడబోయాడు.

మెల్లిగా అసలు విషయం బయట పెట్టాడు.

అతను కొద్దిగా ఉలిక్కి పడటం, రవీంద్రకి తెలుస్తోనే వుంది. వెనువెంటనే ఉలికిపాటుని కప్పిపుచ్చుకుంటూ, "మీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. మా కంపెనీ ఓపెన్ చేసి పదేళ్ళయింది. ఇంతదాకా టాయిలెట్ సామాను తప్ప, వేరేవస్తువుని మేం మార్కెటింగ్ చేయనేలేదు," అన్నాడు.

డెడ్ ఎండ్‌ని చేరినట్లయింది రవీంద్రకి. అవతలి వ్యక్తి బుకాయింపు తెలుస్తోనే ఉంది. నేరుగా వెళ్ళి గోడౌన్స్ అన్నీ ప్రతీ అంగుళం వెతికేద్దామా అన్నంత కోపం వచ్చింది. చేసేదేం లేక బయల్దేరాడు.

స్కూటర్ స్టార్ట్ చేయబోతుండగా అంత దూరంలో పార్క్ చేసిన ఓ వాన్ పక్కన డ్రైవర్ కాబోలు కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు.

అతన్ని చూడగానే ఓ అయిడియా తట్టింది. "సరే ఇదీ ప్రయత్నిద్దాం" అనుకొని, అతన్నిలా రమ్మని సైగచేశాడు.

మౌనంగా గేట్ దాటేవరకూ నడిచి, "చూడబ్బాయి, నేనొకటి అడుగుతాను. సరిగ్గా సమాధానం చెప్పేవంటే ఇది నీదే" అంటూ చేతిలో పది నోటు చూపించాడు.

అతను వింతగా నోటు వయిపు చూస్తూ తల ఊపేడు.

"అబద్ధం చెబితే పట్టియ్యగలను" అన్నాడు బెదిరిస్తున్నట్లుగా, "నోటు అందదు" అనే అర్థం వచ్చేలా.

ఆ డ్రైవర్‌కిది మరి విచిత్రంగా ఉంది. "ఇతనెవర్రా, జవాబు తెలిసీ, ప్రశ్న వేస్తాను, డబ్బిస్తాను-అంటున్నాడు" అనుకున్నాడు.

"అడగండి సార్, అబద్ధం చెప్పే అలవాటు లేదు"

"నువ్ నీడ్యూటీలో ఏరోజుల్లో ఏ కంపెనీలకి వెళుతుంటావో చెప్పాలి"

"ఎక్కువగా షాప్ డెలివరికి పోతానండి. ప్రతి సోమవారం, మంగళవారం మాత్రం రమోలా టాల్కం పవుడర్ ఫేక్టరీకి. శనివారాలు "ప్రియా ప్రెషర్ కుకర్స్" గోడౌన్స్‌కి వెళుతుంటాను సార్"


సమాధానానికి అదిరి పోయాడు రవీంద్ర. అయినా ఆశ్చర్యాన్ని కనిపించనీయకుండా, "మామూలుగా "ప్రియా" కంపెనీ నించీ ఏం లోడ్ చేసుకొస్తుంటావోయ్" అడిగాడు.

"నాకు తెలీదుసార్. ఆ పేకింగ్స్ కొంచం వింతగా ఉంటాయి. అంత పెద్ద కంపెనీ వారి పేరుగానీ, వస్తువు పేరుగానీ, ఇతర వివరాలు గానీ ఏమీ వుండవు వాటిమీద. అయినా అవన్నీ మాకెందుకు సార్. చెప్పిన పని చేసుకు పోతుండటం వరకే తెలుసు"

మౌనంగా రవీంద్ర అందించిన నోటు అందుకొని వెనుదిరిగాడా డ్రైవరు. "ఏమిటిది చిత్రంగా ఉందే. తాము తయారు చేసే వస్తువుకి, తామే డూప్లికెట్ తయారు చేసే అవసరం ఏమిటి "ప్రియా" కంపెనీకి. ఈ డ్రైవర్‌కి నేనెవరైనదీ తెలీదు కద. అబద్ధం ఎందుకు చెబుతాడు. ఇందులో నిజమెంతుందో ఎలా కనుక్కోవాలి?" అని ఆలోచనలో పడిపోయి అలాగే నిలుచున్నాడు కాస్సేపు.

ఆకలి అవటం తెలుస్తోంటే టయిం చూసాడు. రెండు గంటలయింది. భోజనం గుర్తొచ్చి స్కూటరెక్కాడు.

సాయంత్రం, వాళ్ళింటి దగ్గిర రమని పికప్ చేసుకుని బిర్లా మందిర్‌కి బయలుదేరాడు. దేవుడికి దండం పెట్టుకుని, కొబ్బరి ముక్కలు నవుల్తూ, మెట్లమీదో పక్కగా కూచున్నారు.



టాంక్ బండ్ మీద లయిట్లనీ, ట్రాఫిక్ నీ హుసేన్ సాగర్ నీ చూస్తూ మాటలు చెప్పు కున్నారు. పొద్దున జరిగిందంతా వివరించాడు రవీంద్ర క్లుప్తంగా. రమ సిక్స్త్ సెన్స్ మీద రవీంద్రకి మంచి నమ్మకం. తన బుర్ర పని చేయటానికి మొరాయించి నప్పుడు ఆమెని సలహాలు అడగటం మామూలే.

రమ కాస్సేపు ఆలోచించి, "నాకో ఐస్ క్రీమ్ ఇప్పిస్తే, నీకు సలహా చెబుతాను" అన్నది చిన్న పిల్లలాగా.

"ఓస్ అంతేగద. ముందు సలహా ఇచ్చేయి మళ్ళీ అయిస్ క్రీం"

"ఈ ప్రియా కంపెనీ గాస్కెట్ను తయారు చేసే రబ్బరు ఒక ప్రత్యేకమయిన కెమికల్ ఉందనీ, వల్కనైజేషన్ లోనే ఒక ప్రత్యేకమయిన పద్ధతిని ఉపయోగిస్తారనీ, నువ్వే ఒకసారెప్పుడో చెప్పేవు. ఈ డూప్లికేటు గాస్కెటు ఎలాగూ కొన్నావు గదా. ఒక ముక్క కట్ చేసి ఏ ఎనలిటికల్ లాబ్ కో పంపితే, వివరాలు తెలుస్తాయి."

ఇంత చిన్న విషయం నాకెలా తట్ట లేదా అని ఆశ్చర్య పోయాడు రవీంద్ర. అది పసికట్టినదానిలా, "ఎంత పెద్ద ఉద్యోగమయితేనేం, సైన్స్ చదివిన వాళ్ళలా మీ ఆర్ట్స్ వాళ్ళ బుర్ర ఎక్కడ పనిచేస్తుందిలే" అన్నది మెల్లిగా.

ఆ మాటలతో అంతవరకూ ఛెన్స్ గా వున్న రవీంద్ర మనసు తేలికయింది. "ఏ రమా! మాటలు జాగ్రత్త. నీ పని పట్టిస్తాను," అంటూ ఆమె బుగ్గలు రెండూపట్టి సాగతీస్తూ, చిన్నగా కన్ను కొట్టాడు.

o o o

మళ్ళీ మేనేజర్ గారింటికి వెళ్ళాడు రవీంద్ర. ఈ సారి స్వీటు, కారం, కాఫీ అయేదాకా అసలు విషయానికి రాలేదు శివరామ్ గారు.

"ఇప్పుడు చెప్పవోయ్. ఇంతకూ నీ పరిశోధ నేమయింది?"

"ఎస్సర్, ఆ డూప్లికేట్స్ ని తయారు చేస్తున్నదీ, 'ప్రియా' ప్రెషర్ కుకర్స్ కం. వారేనండి"

"వాట్.... ఏమిటి నువ్వంటున్నది. వాళ్ళకేం పని డూప్లికేట్ను తయారు చేయటానికి. నాతో జోక్ చేస్తున్నావా?" తీవ్రంగా వున్న ఆయన స్వరానికి భయ

పడలేదు రవీంద్ర.

"నా దగ్గర ఆధారాలున్నాయండి" అని మొదట్నించీ తను ట్రక్ డ్రైవరుతో మాట్లాడి వివరాలు రాబట్టిన దాకా, వివరించాడు, ఆయనకి.

"అయితే ఒక మామూలు డ్రైవర్ మాటల్నే ఆధారం అంటావ్?"

"నోనో సర్. డూప్లికేట్ గాస్కెట్ మెటీరియల్, అనాలిసిస్ కూడా చేయించాను. మన ఫైల్లో వున్న అసలు వస్తువుల వివరాలకి టాలీ అవుతున్నాయి. ముఖ్యంగా "ప్రియా" జర్మనీనుంచి స్పెషల్‌గా దిగుమతి చేసుకునే స్టైయిరీన్ అనే పదార్థం కూడా ఇందులో వుంది. అదింకెవరికీ దొరికే అవకాశం లేదుకదా. డిజైనింగ్, వల్కనైజేషన్ అంతా ఒకే విధంగా వున్నాయి.

శివరామ్ గారి నోట మాట రాలేదు కాస్సేపు.

"ఇలా ఎందుకు జరుగుతున్నదనుకుంటున్నావోయ్. ఇది చాలా ఫూలిష్‌గా కన్పించటం లేదూ?"

"మన దగ్గరున్న "ప్రియా" కంపెనీ స్టాటిస్టిక్స్ ఓ మూడేళ్ళవి కొంతవరకూ, పరిశీలించి, కొన్ని వివరాలు తెలుసుకున్నాను సర్"

"మార్కెట్‌లో ఈ మధ్యలో చాలా రకాల కుకర్స్ వస్తున్నాయి. అన్నిట్లోకీ మొదటినించీ మంచి పేరూ, హెచ్చుఖరీదు రెండూ "ప్రియా" కుకర్‌కే. స్పేర్‌పార్ట్స్ విషయంలోనూ అంతే. అందులోనూ కుకర్ ఉపయోగించే ప్రతీ ఒక్కరూ, అప్పుడప్పుడూ కొని తీరాల్సిన స్పేర్ గాస్కెట్. దీని ఖరీదిప్పటికి పది రూపాయలు పెరిగింది. ఈ కారణంగానేమో, "ప్రియా" కుకర్ సేల్స్‌లోనే ఈ మూడేళ్ళలో చెప్పుకోతగ్గ అభివృద్ధి కన్పించటం లేదు. అందుకని గాస్కెట్ ఖరీదు హఠాత్తుగా తగ్గించేస్తే కంపెనీ ప్రిస్టేజికే భంగం కదా! ఒకప్పుడు ఆ సలహానిచ్చిందీ మనమే!

"ఇలాంటి పరిస్థితిలో, ఏ పేరులేని ఫేక్టరియో, డూప్లికేట్సు తయారు చేసి, అమ్ముకున్నా ఆశ్చర్యం లేదు. అందుకని ఆ పని తామే చేస్తే ఏం అని, మామూలుగా తమ ఫేక్టరీలో తయారయిన వాటిలోనే, కొన్నిటిని వేరుగా పేక్ చేసి, తక్కువ ధరకి అమ్ముతున్నారు (డూప్లికేట్సుగా) అనిపిస్తుంది. దీస్ ఈస్ వాట్ అయి ఫెల్ట్ సర్" అని ముగించాడు.

అక్కడినించీ అతను వెళ్ళిన కాస్సేపటికే శివరామ్ కార్నడ్ గారు, "ప్రియా" ప్రెషర్స్ కుకర్స్ కంపెనీ, జనరల్ మేనేజర్‌తో మాట్లేడేరనీ, వారిద్దరి మధ్యా ఫోన్లో సంభాషణ చాలాసేపే జరిగిందనీ రవీంద్రకి తెలీదు.

o o o

స్కూటర్ పార్క్‌చేసి, రమ వెంట ఇందిరా పార్క్‌కేసి నడుస్తూ, అన్నాడు రవీంద్ర. "ఈ రోజు నువ్వేం అడిగినా సరే రెడీ. అయామ్ వెరి హేపీ టుడే" అన్నాడు.

"తెలుస్తోనే ఉంది సంతోషం. మాటల్లో వేరే చెప్పాలా?" అన్నది రమ తాను చిన్నగా నవ్వుతూ.

"ఇంతకీ విశేషమేమిటి? మీరు పడిన కష్టానికి మెచ్చి, ఓ వందేమయినా ఇంక్రిమెంటిచ్చారా?"


"హు వందేంఖర్మ. ఇప్పట్నించీ రెండింతలు వస్తుంది జీతం. నువ్వింక వృద్ధ కన్యగా వుండి పోతానని బెంగ పెట్టుకోనక్కర్లేదు. మీ వాళ్ళకి చెప్పేయి, ముహూర్తాలు చూడమని"

"అబ్బో, వ్యవహారం జోరులో ఉందే......"

ఇద్దరూ పచ్చని పచ్చికలో కూర్చున్న తర్వాతన్నాడు రవీంద్ర, "ఇవాల్టితో సరి డీలక్స్ పబ్లిసిటీ ఎసోసియేట్స్‌లో మన ఉద్యోగం"

"అదేం .... ఇప్పుడేగా ప్రమోషన్ అన్నావు....గాభరాగా అడిగింది రమ.

"పూర్తి చెప్పనిస్తేగా, మన దృష్టిలో ప్రమోషన్ క్రిందే లెక్క. అయితే కంపెనీ



మారుతోంది. అంతే. ఓ వారంలోగా 'ప్రియా' ప్రెషర్ కుకర్స్, రీజినల్ సేల్స్ ఆఫీస్ మేనేజర్‌గా, కర్నూలు వెళ్ళి చేరాలి"

"నిజం! నువ్వు చెబుతోంది నిజమా"

"మనిద్దరం ఇలా ఎదురెదురుగా కూచోని కబుర్లు చెప్పుకుంటున్నంత నిజం. చిత్రమేమిటంటే, మా మేనేజర్‌గారే వారికి నన్ను సిఫార్సు చేశారట. ఎపాయింట్‌మెంటు విషయం ఫోన్లో చెబుతూ, 'ప్రియాకుకర్స్', జి. ఎమ్. చెప్పారు"

అయితే స్వంత లాభం లేకుండా నీకీ ఉద్యోగమిచ్చుంటారా వాళ్ళు.......నో డౌట్....వారికి మీ తెలివి, ఎఫిషియెన్సీ అన్నీ పూర్తిగా తెలిసే ఉద్యోగం ఇచ్చుండవచ్చు....బట్ నాకొకటి అనిపిస్తోంది....ఆ కంపెనీ రహస్యం ఒకటి నువ్వు కనిపెట్టావు గదా. అది మీ పెదవిదాటి బయటికి రాకుండా ఉండకానికి మిమ్మల్ని తమ ఉద్యోగిగా చేర్చుకున్నారా అనిపిస్తుంది. కంపెనీలో ఓ బాధ్యతగల ఉద్యోగిగా, ట్రేడ్‌సీక్రెట్స్‌ని కాపాడటం నీ కర్తవ్యంగా మారుతోంది కదా........"

"అవునేమో........" ఆలోచనలో పడిపోయాడు రవీంద్ర.

వీరిద్దరి బుర్రలకీ అందని విషయమింకొకటి వుంది. ఈ రహస్యం బయటకి రాకుండా వుండడానికిగాను, ఏటా పల్లిసిటీకిగాను తామిచ్చే డబ్బుకి, అయిదువేలు హెచ్చు చేయటానికి తామంగీకరిస్తున్నట్లు, 'ప్రియా'కంపెనీ జి. ఎమ్. దేశ్‌పాండేగారు, శివరామ్ కార్నడ్‌కి మాటిచ్చారని మూడో మనిషికి తెలీదు. ★

ఒక సీరియస్ కథ

మూలం : కర్ట్ కుసెన్‌బర్గ్ · స్వేచ్ఛానువాదం : ఎమ్. పార్థసారథి

సుబ్బారావు హాస్య రచయిత. అతడి కథల్లో హాస్యరసం ఎంత ఎక్కువగా వుంటుందంటే రాసేటప్పుడు బలవంతంగా వచ్చే నవ్వును ఆపుకోలేక అతడి కడుపుబ్బి పోతూవుంటుంది. అతడి కథలు చదివి నవ్వని పాఠకుడు లేడు. జనానికి నవ్వటం యిష్టం గనక అతను అశేష జనాదరణ పొందిన రచయిత కావటానికి ఎంతో కాలం పట్ట లేదు.

కాని ఒక రోజున సుబ్బారావు తననూ తన పాఠకులనూ నవ్వులపాలు చేసుకోవటం యిష్టంలేక ఒక బ్రహ్మాండమైన సీరియస్ కథ రాయాలని నిర్ణయించుకున్నాడు. తీరా రాయటానికి కూర్చునేసరికి అదంత తేలికైన విషయం కాదని తెలిసిపోయింది. హాస్య రసానికి అలవాటు పడిన అతడి కలం మరే రసాన్నీ కాగితం మీద కక్కలేక పోయింది. చివరికి బజారు కెళ్లి కొత్త పెన్ను కొనుక్కొచ్చుకుంటే తప్ప అతనికీ సమస్య తీరలేదు.

నెల రోజులు ఏకబిగిన, నిర్విరామంగా గంభీర ముద్రలో కూర్చుని రోజుకు రెండు వాక్యాల చొప్పున రాసి ఒక గంభీరమైన కథ ముగించాడు సుబ్బారావు. ఆశయ సిద్ధిని సాధించి అలవాటు ప్రకారం తన మిత్రబృందానికి కథను చదివి వినిపించాడు. మిఠా చదువుతుంటే తన రచన సమగ్ర స్వరూపం తనకు మొదటి సారిగా కన్పించినట్టుగా వుంటుంది సుబ్బారావుకు. ముక్కలు ముక్కలుగా రాసిన తన కథ యితివృత్తం యిప్పుడతనికి సంపూర్ణంగా దర్శన మిచ్చింది.

హాస్యానికి అలవాటు పడిన శ్రోతలకి ఆశాభంగం కలిగిస్తున్నాననే భయంతో మొదట బెరుకు బెరుకుగా ప్రారంభించాడు గాని త్వరలోనే యితివృత్తంలో మునిగిపోయాడు. కంఠస్వరం హెచ్చింది. కాకపోతే ఈ పఠనా కార్యక్రమంలో మధ్య మధ్య అంతరాయం కల్గించే శ్రోతల నవ్వులు ఈసారి వినిపించలేదు. గదినిండా నిశ్శబ్దం ఆవరించింది. శ్రోతలు తనను వింటున్నారా లేదా అని ప్రతీక్షణం ఓర కంట వాళ్లను కనిపెడుతుండే దురలవాటు సుబ్బారావుకులేదు. కాని కథ మధ్యలో ఓసారి కళ్లెత్తి తన మిత్రులవైపు చూసేసరికి ఇద్దరు నిద్రపోతున్నారు. మనసు చివుక్కుమన్నా సుబ్బారావు—పఠనమాపలేదు. తప్పెవరిది? గుర్రుపెడుతున్న శ్రోతలదా? కథదా? లేదా తను చదివే పద్ధతి అంతగా జోల పాడుతున్నట్టున్నదా? సరే, ఏ కారణమైతేనేం? మరికాసేపటికి సుబ్బారావు కూడా విసుగొచ్చింది. గొంతు నొప్పెట్టినట్టుగా తోచింది. ఒక సుదీర్ఘమైన వాక్యం చదువుతూ మధ్యలో తనూ గురక మొదలెట్టాడు. కాగితాల బొత్తుకూడా నిద్రముందుకొచ్చి అతని చేతుల్లో నించోలేక నేలమీద వాలిపోయింది.

అలాగ, ఆ గదిలోని జనమంతా తెల్లా

రిందాకా పుస్తకాల్లా పడుకున్నారంటే మీరు నమ్మలేక పోవచ్చు గాని నిజమంతే నండి; ఆ శ్రోతలకు మళ్ళీ తెలివి వచ్చేసరికి బారెడు ప్రొద్దెక్కింది. అతి నిశితమైన విమర్శనాగరిమ కలిగిన ఆ శ్రోతలు ఆ కథాప్రాముఖ్యాన్ని యిట్టే పసికట్టారు. ఏ పాఠకుణ్ణి/శ్రోతనైనా నిద్రాదేవికి బానిస చెయ్యగలిగిన అనన్యసామాన్యమైన, అప్రతిహతమైన, అజేయమైన, అనుపమానమైన శక్తి ఆ కథలో వుందని ఏకగ్రీవంగా తీర్మానించారు. మానవ జాతికి యింత కన్నా గొప్ప వరమింకేం కావాలి? నెల తిరిగేలోగా సుబ్బారావు (రాసిన) కథ అచ్చుఖుంది. ఎన్ని ముద్రణలైనాయో



తెలియదుగాని ఎప్పుడడిగినా పుస్తకాల షాపులవాళ్ళు "కాపీలై పోయాయండి." అంటూనే వుంటున్నారు.

ఎవరి మంచం మీద చూసినా ఈపుస్తకమే కనిపించేది. ఎవరికన్నా ఈ కథ చదివి వినిపించాలంటే, పాఠకుడు కూడా ముందరే పక్క సరిచేసుకొని, పడుకొని గాని చదవటం ప్రారంభించే వాడుగాదు.

మానవ కళ్యాణానికి మహోపకారం చేసిన మహాస్రష్టగా మానవజాతి సుబ్బారావుకు ఎంత రుణపడి వుందో మీరూహించుకోవచ్చు. అతడికి జరిగిన సన్మానాలు, అతడు సంపాదించిన డబ్బు....సరేలెండి, ఎవరికి తెలుసు ఆలెక్కలన్నీ.

ఐతే ఒక చిత్రమైన విషయం మాత్రం యింకా తేలలేదు. కథ ముగింపేమిటో ఎవరికీ యింతవరకూ తెలియదు. ఆవరిపేజీ దాకా చదివిన పాఠకుడెవరూ యింతవరకూ పుట్టలేదు. మామూలు మనుషులందరూ ప్రారంభంతోనే ఖాళై పోయేవాళ్ళు. నిద్రపట్టక బాధపడే కొద్దిమంది జబ్బు మనుషులు మరో నాలుగు పేజీలు చదవగలిగేవాళ్లు. ఇంకా మొండిఘటాలు మహాఐతే మరో రెండు మూడు పేజీలు.... జగమొండిగాళ్ళు సగందాకా.... అంతే.

కొందరు తుంటరిగాళ్ళు తాము ముగింపు చదివేశావని చంకలు గుద్దుకోవటానికి ప్రయత్నించారుగాని, నిద్రలేచాక వాళ్ళకు చదివింది ఒక అక్షరమన్నా జ్ఞాపకం వుంటే ఒట్టు.

అందువల్ల ముగింపు గురించిన అనేక అభిప్రాయ భేదాలు యింకా అపరిష్కృతంగానే వున్నాయి. ✻

వేర్ గోస్ మై కంట్రీ??

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ఉదయ చంద్రరావుకు మనస్సంతా చికాగ్గా ఉంది. సామాన్యంగా అతను వెల్తురునీ వెన్నెలనీ అభిమానిస్తాడు, కాని ఆరోజు ఆ సమయాన మట్టుకు అతనిలో వెల్తురు మీద ద్వేషం పుట్టు కొస్తోంది. అప్పటికి చీకటి పడి దాదాపు రెండు గంటలు దాటింది కాని అతను గదిలో లైటు వేసుకోలేదు. కిటికీ తలుపులన్నా తెరవ లేదు. అలా చీకట్లో మంచం మీద పడుకుని మనస్సుతో కుస్తీ పట్టసాగాడు.

"ఏం చెయ్యాలి తనిప్పుడు? తన కర్తవ్య మేమిటి?"

పైన సీలింగ్ ఫ్యాను సన్నగా చప్పుడు చేస్తూ వెచ్చటి గాలిని గదినిండా నింపుతోంది, ఆలోచనలతో అతని మెదడు కూడా వేడెక్కుతోంది.

నిజానికి అతనికి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. అతని కోసం అతని తండ్రి బోలెడు ఆస్తిని సంపాదించి పెట్టాడు. గొప్పతనం కోసమూ, సమాజంలో కొడుకు పాలిష్డ్‌గా కనిపించాలనీ తండ్రి అతణ్ణి ఇష్ట మొచ్చిన చదువు చదువు కొమ్మన్నాడు. ఇంజనీరింగును ఎన్నుకున్నాడు ఉదయ చంద్రరావు, బియ్యీ పూర్తి చేసాడు. పూర్తవంగానే ఉద్యోగం చేస్తానన్నాడు. తండ్రి ఒప్పుకోలేదు, వ్యాపారం చేసు కొమ్మన్నాడు. లేదా ఏదయినా కంట్రాక్టులు తీసుకుని దర్జాగా కాలం వెళ్ళ బుచ్చమన్నాడు, కాని తను చూసిన సినిమాలు, చదివిన పుస్తకాలు కారణంగా వ్యాపారులన్నా కంట్రాక్టరులన్నా సమాజానికి చీడ పురుగులన్న ఒక రకమైన అలస భావం కలిగిఉన్న ఉదయ చంద్రరావు అందుకు ఒప్పుకోలేదు. అభ్యుదయ భావాలు కలిగి ఉన్న అతను కష్టించి బ్రతకాలనుకున్నాడు. తన స్వంత కాళ్ళ మీద తను నిలబడతా నన్నాడు. అలా తండ్రితో విభేదించి ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. త్వరలోనే మంచి ఊపులో పనులు సాగుతున్న ఒక ప్రాజెక్టులో జూనియర్ ఇంజనీరుగా ప్రభుత్వోద్యోగం లభించింది. జాయినయ్యాడు. అక్కణ్ణించి ప్రారంభ మయింది అసలు గొడవంతా....

చటుక్కున ఫ్యాను ఆగిపోయింది. కరెంటు పోయి ఉండాలి, మంచం మీంచి లేచి వెళ్ళి కిటికీ తలుపులు తెరిచాడు ఉదయచంద్రరావు. ఒక్క ఊపున వెన్నెల అతణ్ణి ముంచెత్తుతూ గదిలోకి దూకింది. ఆకాశాన చంద్రుడు కళ్ళు విప్పార్చుకు చూస్తున్నాడు. ఆ వెలుగులో ప్రాజెక్టు ప్రాంతమంతా స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడా లైట్లులేవు. దూరాన నది కవతల కొండలు అక్కడక్కడా కాల్తూ మంటల హారాల్ని మెళ్ళో వేసుకున్నట్లు కనిపిస్తు న్నాయి. గాలిలేదు, అదో చికాకైన విషయం. చొక్కా విడిచి వెనక్కు మంచం మీదకు విసిరేసాడు. అతని ఒంటిమీద బనీనులేదు. నడుంనుంచీ పై భాగమంతా

నగ్నంగావుంది.

ఉద్యోగం లభించిన క్రొత్తలో అతను ఎన్నో కలలు కన్నాడు. విద్యుక్త ధర్మానికి కట్టుబడి ఉండాలనీ, అవినీతికి దూరంగా ఉండాలనీ, చుట్టూ ఉన్న మనుష్యుల్ని ఎంతో కొంత సంస్కరించాలనీ ఏవేవో ఊహా హర్మ్యాల్ని సృష్టించుకున్నాడు. కాని త్వరలోనే అతను నిరాశ చెందాల్సి వచ్చింది. తన చుట్టూ ఉన్న వాతావరణం అవినీతితో పూర్తిగా కుళ్ళి కంపు కొడుతున్నది అవటమే కాక అందులో నీతికి ఏమాత్రం స్థానం లేదని గ్రహించటానికి అతనికి ఎక్కువరోజులు పట్టలేదు. ప్రాజెక్టులోని మెజారిటీ ఉద్యోగులు కంట్రాక్టర్లతో కుమ్మక్కు అయో లేక మరో విధంగానో అక్రమ సంపాదన చేయటము, పైగా దాన్ని తమ హక్కుగా భావించటమూ అతనికి విచిత్రంగా కనిపించేది. ప్రాజెక్టు క్రింద ఖర్చు అయే మొత్తంలో నాల్గో వంతుకు పైగా ఇట్లాంటి అక్రమ సంపాదనల క్రింద అంటే ఆఫీసర్ల, ఉద్యోగుల జేబుల్లోకి — పోవటాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు. కొన్ని సెక్షన్లుంటాయి. ఇట్లాంటి అక్రమ సంపాదనలకు అమితమైన అవకాశాల్ని కల్పించేవి! పాడి బర్రెల్లాంటి అట్లాంటి సెక్షన్లు దొరకాలని జేయీలూ సూపర్‌వైజర్లూ తహతహలాడుతుండటమూ, ఆ సెక్షనే కావాలని కొన్ని సమయాల్లో రాజకీయ వత్తిడుల్ని కూడా తీసుకు వస్తుండటమూ; ఏ కాస్త నిజాయితీగల ఆఫీసరో అట్లాంటివాళ్ళను ఆ బాపతు సెక్షన్ల నుండి తీసి వేయగానే తన పంచ ప్రాణాలు లాగివేయ బడ్డట్లుగా ఆ సూపర్‌వైజరో జేయీయో గిలగిలలాడిపోవటమూ, ఇట్లాంటివన్నీ చూసి విభ్రమంతో తల ముక్కలయి పోయాడు ఉదయచంద్రరావు.

ఈ బాపతు ఉద్యోగుల్లో అంతరాత్మ అనేది ఉండదా ఏమిటని మాటిమాటికీ అతనికి సందేహం కలిగేది. ఇట్లాంటి వాళ్ళంతా తమ పై ఆఫీసర్లు చేసే అక్రమ సంపాదనలతో తమను పోల్చుకుంటూ తాము చాల నయమన్నట్లు ఒక రకపు విచిత్ర ఫిలాసఫీని మాట్లాడటం గమనించాడు. దురదృష్టవశాత్తూ ఆ డిపార్టుమెంటులో అంతకుముందు రిటైరైన ఒకళ్ళిద్దరు చీఫ్ ఇంజనీర్లు మరీ అవినీతి కోరులుగా పేరుబడి ఉండటం వీళ్ళ వాదానికి మరింత ప్రోత్సాహాన్ని, బలాన్ని కలిగించుతోంది. ఇలాంటి అక్రమ సంపాదనలను ఎవరూ నేరం క్రింద తీసుకోక పోవటమూ, పైగా సమాజంలో అదో ప్రిస్టేజీ క్రింద భావించ బడటమూ, ఒకవేళ రుజువై వీళ్ళు పట్టుబడినా గాని చట్టంలో అందుకు తగ్గ సరైన పనిష్‌మెంట్ నిర్దేశించబడక పోవటమూ ఈ విచ్చల విడి తనానికి దారి తీస్తోందనిపించింది ఉదయచంద్రరావుకు.

క్రొత్తగా అప్పుడే కాలేజీనుంచి బయటికొచ్చిన యువకులు కూడా అసలు జీతం కంటే ఈ పైసంపాదన కోసం ఎక్కువగా పెరపెరలాడుతుండటం ఉదయచంద్రరావుకు మరీ విచిత్రమనిపించేసి. అదేమిటి, వాళ్ళలో ఉడుకు రక్తం లేదా? యవ్వన సహజమైన ఆదర్శాలు నిజాయితీ మొదలైనవి మచ్చుకైనా లేకుండా అంతటి నిర్వీర్యంగా తయారవుతోందా నేటి తరం? అతని ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.

అంతలో గభాల్న లైట్లు వెలిగాయి. కళ్ళు చిట్లించాడు ఉదయ చంద్రరావు. చికాగ్గా వెనక్కు తిరిగి గోడవద్దకు వెళ్ళి లైటు తీసివేసి తిరిగి కిటికీ వద్దకు వచ్చి నిలబడ్డాడు. కాంపునిండా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి...

ఉద్యోగంలో చేరినప్పటినుంచీ తన ఆదర్శాలు కారణంగా అతను అశాంతి పాలవుతూ వచ్చాడు. అనేక సమయాల్లో అతను అవినీతిని అంగీకరించక పోవటం అతని పై ఆఫీసర్లకు "చెప్పులోనిరాయి" క్రింద పరిణమించటంతో వాళ్ళ కన్నెర్రకు



గుర్తై ఈ డివిజనునుంచి ఆ డివిజనుకు, అక్కడి నుంచి మరో చోటికి, ఇలా ట్రాన్స్ఫర్లు చేయబడ్డాడు. కొన్ని సమయాల్లో ఇతను మాకక్కర లేదంటూ కొందరు ఆఫీసర్ల చేత సరెండర్ చేయబడ్డాడు. అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు ఖరాబయ్యాయి. మొత్తానికి ప్రాజెక్టులో అతనో వింత జీవి క్రిందా, ఓ తలతిక్క మనిషిగానూ పరిగణించ బడుతున్నాడు.

"ఇదా నిజాయితీకి ప్రతి ఫలం?!" బాధగా గొణుగుకున్నాడు ఉదయచంద్ర రావు.

ప్రస్తుతం రెండు రోజులనుంచీ అతను లీవుమీద ఉంటూ డ్యూటీకి వెళ్ళటంలేదు. దానికి కారణం మూడు రోజుల క్రితం జరిగిన ఒక సంఘటన.

నాలుగు నెలల నుంచి అతను ప్రాజెక్టుకి అవసరమయే విద్యుత్పరికరాలు, మెషీన్లు, వాహనాల విడిభాగాలు మొదలైన వాటిని ఖరీదు చేసి స్టోర్ చేసి ఉంచే ఒక డివిజనాఫీసులో పనిచేస్తున్నాడు. ఆ డివిజనుకి అధికారైన ఇ. ఈ. దురహంకారే కాక దురాశా పూరితుడు కూడా. ఎంతసేపూ తన జేబునెలా నింపుకోవాలా అని చూస్తుంటాడు. ఏవైనా పరికరాలు కొనాలంటే ఆ ఆఫీసు నుంచి ముందు ఎంక్వయిరీలు పంపుతారు కొన్ని కంపెనీలకు. ఆ కంపెనీల వాళ్లు తమ రేట్లను ఉదహరిస్తూ పంపేక కొటేషన్లను కంపారెటివ్ స్టేట్ మెంట్ ద్వారా పోల్చి చూసుకుని తక్కువ రేట్లకు కోట్ చేసిన కంపెనీలకు మాత్రం ఆర్డర్లు వేసి ఖరీదు చేయాల్సి ఉంటుంది. కనీసం మూడు కంపెనీల రేట్లనన్నా ఇలా కంపేర్ చేయాల్సి ఉంటుంది రూలు ప్రకారం. (కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప!) అయితే అవినీతిని ఆశ్రయించ దల్చుకున్న వాళ్ళకు అన్వేషిస్తే వక్రమార్గాలు లభించక పోవు. ఒక కంపెనీ వాడు తన కంపెనీ పేర ఇష్ట మొచ్చిన రేట్లను కోట్ చేస్తూ మరో మూడు నాలుగు బోగస్ కంపెనీల పేర్ల క్రింద తన రేట్ల కంటే హెచ్చు రేట్లను కోట్ చేసి సబ్మిట్ చేస్తూ ఆర్డర్లను సంపాదించుకోవటం ఒక రకం. అయితే ఈ బోగస్ కంపెనీల పేర్లు ఇ ఈ పంపిన ఎంక్వయిరీ లిస్టులో ఉండాలి. అంటే ఇలాంటి దుశ్చర్యలకు కంపెనీ వాడితో ఇ. ఈ. చేతులు కలపాల్సి ఉంటుందన్న మాట! ఉదయ చంద్రరావు వాళ్ళ ఇ ఈ ఈ బాపతుకు సంబంధించిన ఆఫీసరు. ఎంక్వయిరీ పంపేటప్పుడే తనకిష్టమైన కంపెనీ కాక ఈ రకపు బోగస్ కంపెనీల పేర్లకు మాత్రం ఎంక్వయిరీ పంప బడేటట్టు చూసే వాడు. ఇలా అతను తనకిష్టమైన కంపెనీల నుండి బజారు రేట్లకంటే అతి దారుణమైన హెచ్చు రేట్లకు వస్తువుల్ని ఖరీదు చేస్తూ జేబులు నింపు కుంటుండే వాడు. ఇటాల్లా చేయటం వల్ల ఆడిట్ వాళ్ళకు పట్టుబడటమంటూ జరగదు. కొద్ది రోజుల్లోనే ఈ రహస్యాన్ని గమనించిన ఉదయ చంద్రరావు తర్వాత తయారు చేసిన ఒక ఎంక్వయిరీలో అసలు సిసలైన మరో నాలుగు మంచి కంపెనీల పేర్లను కూడా ఇంక్లూడ్ చేసి సంతకానికి ఇఈ వద్దకు పంపించాడు. అది చూస్తూనే మండిపోతూ ఇఈ అతని కోసం కబురు పెట్టాడు, వెళ్లాడు ఉదయ చంద్రరావు.

"ఈ కంపెనీల పేర్లను ఇంక్లూడ్ చేయమని నీకెవరు చెప్పారు మిస్టర్?"

"నేనే ఇంక్లూడ్ చేసాను."

"అదే, ఎందుకు చేసావంటున్నాను."

"మన ఆఫీసు ఫరమ్స్ రిజిస్టర్‌లో ఈ కంపెనీలు కూడా రిజిస్టరయి ఉన్నాయి సార్."

అయితే నన్ను అడగాల్సిన పని లేదా?"

"పోటీ ఎంత ఎక్కువ అయితే వస్తువు అంత తక్కువ ధరకు లభిస్తుందని వాటిని ఇంక్లూడ్ చేసాను. తక్కువ ధరకు మెటీరియల్‌ని కొనటంవల్ల డిపార్ట్‌మెంటుకి లాభమే కదండీ."

"నో ఆర్గ్యుమెంట్స్ ప్లీజ్! ఈ కొత్త కంపెనీల పేర్లను తీసివేసి ఎప్పటిలాగే పాత కంపెనీలను మాత్రమే ఉంచుతూ ఫ్రెష్ ఎంక్వయిరీ తయారుచేరుసి పట్రా" అన్నాడు ఇఈ సీరియస్‌గా.

ఉదయచంద్రరావు అందుకు వొప్పుకోలేదు. ఫలితంగా మరి కొద్ది రోజుల్లోనే అతనికి మరోడివిజనుకు ట్రాన్స్ఫరు చేయబడుతూ ఆర్డర్లు అందాయి. విచిత్రమనిపించిందతనికి.

"లైసెన్స్‌డ్ కరప్షన్!" కసిగా గొణిగాడు.

ఉద్యోగ జీవితంలో మొదటిసారిగా నిరాశను ఫీలయ్యాడు ఉదయచంద్రరావు. రెండు రోజులనుంచి సెలవు పెట్టి ఇంటివద్ద ఉంటూ ఈవిషయంమీదే ఆలోచిస్తున్నాడు. ఒక్క ఈ సంఘటనే కాదు, అతను మునుపు ఇట్లాంటివి మరెన్నో జరిగాయి. ఇట్లా

ఎంత కాలమని?? ఫుట్ బాల్ లా తన్ను బడుతూ, అశాంతికి లోనవుతూ, తోటి ఉద్యోగులచేత విచిత్రంగా చూడబడుతూ నిజంగానే తను మూర్ఖుడా? స్వార్థం గురించికాక విద్యుక్త ధర్మం గురించి తాపత్రయ పడటం అవివేకమా?? ఏమో సమాజం నుండి తనకు నైతిక సహాయం లభించటంలేదు — ప్రస్తుతం తన కర్తవ్య మేమిటి? ఇలా ఉద్యోగకాలజీవితాన్నంతా అవకతవకగా మలుచుకోవటమా లేక అందరిలా తనూ....

"ఉదయా!"

చప్పున పులకరించింది ఉదయ చంద్ర రావు హృదయం-ఆస్వరం కమలది. యూడీసీ రామనాథం కూతురామె. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నారు.

"రా కమలా," అన్నాడు.

"చీకట్లో ఏం చేస్తున్నావు ఉదయా?"

ఆమె మెల్లగా నడుచుకుంటూ వచ్చి అతని వెనక నిలబడింది. రెండు చేతుల్ని అతని పొట్టచుట్టూ బిగించి తన కుడిచెంపతో నగ్నంగా ఉన్న అతని వీపుమీద కొద్దిసేపు అటూ ఇటూ పామింది.

"ఏమిటి. ఆలోచిస్తున్నావు?" అన్నది.

చెప్పాడు ఉదయ చంద్రరావు.

"నిజానికి నాకీ ఉద్యోగం చేయాలని లేదు కమలా. నాకు నేను స్వతంత్రంగా బ్రతుకు దామనీ, మనుషుల్లో ఆదర్శంగా నిలబడదామనీ, దేశ నిర్మాణ కృషిలో ఏదో ఉడతా భక్తిగా పాలు పంచుకుందా మనీ ఇలా ఏవేవో ఆశలతో ఉద్యోగంలో చేరాను. కాని - కాని .... రోజు రోజుకూ నాకు అర్థమవుతోంది, ఇక్కడ నిజాయితీకి స్థానం లేదు. సెన్సాఫ్ డ్యూటీని ఓ వెర్రి వాడి మనస్తత్వంక్రిందా, మంచితనాన్ని చేతగాని తనం క్రిందా లెక్కగడుతు న్నారీ మనుష్యులు. వీళ్ళంతా డబ్బుకాపీ నం గాళ్ళు. డబ్బుకోసమో, ప్రమోషను కోసమో ఎంత అసహ్యమైన పని చేయటాని కైనా వెనుకాడరు వీళ్ళు. కూటికి గతిలేని వాళ్ళు అట్లాంటివి చేసినా ఏ కొంతో సమ ర్థనీయంగా ఉంటుంది గాని వీళ్ళు, వీళ్ళు... కమలా ఇన్నాళ్ళూ లేనిది ఇవాళ నాకీ ఉద్యోగం మీద విరక్తి పుడుతోంది. ఎక్కడ లేని నిస్పృహ ఆవరిస్తోంది నా మనస్సుని. ఏం చెయ్యాలి నేనిప్పుడు? ఇలాగే అధర్మా నికి ఎదురు తిరుగుతూ జీవితంలో ఇబ్బం దుల్ని వెంట తెచ్చుకుంటూ బ్రతకనా లేక నేను కూడా ఈ మందలో ఒకడిగా కలిసి పోనా?? చెప్పు కమలా నువ్వైనా చెప్పు, ఎట్లా బ్రతకమంటావు నన్ను?"

"నిజంగా నీకు నా సలహా కావాలం టావా ఉదయా?"

"అవును కమలా, చెప్పు. కాబోయే సహధర్మచారిణివి, నీ సలహా కాక మరెవరి సలహా కావాలి నాకు?"


"నువ్వూ అందరిలాగే ఉండు ఉదయా రెండు చేతులా సంపాదించు."

ఉలిక్కి పడ్డాడు ఉదయచంద్రరావు. చటుక్కున వెనక్కి తిరిగి, రెండు చేతులూ కమల భుజాలమీద వేసి ఆమెను కుదుపుతూ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసాడు.

"డార్లింగ్, ఏమిటి నువ్వనేది? అసలు నువ్వేనా ఈ మాటలంటున్నది ??!! కొద్ది క్షణాలు ఊరుకుని మళ్ళీ అన్నాడు బాధగా.

"అందమైన ఆడవాళ్ళ హృదయాలు ఎంత వికృతంగా వుంటాయి కమలా !! అవును ... డబ్బు! డబ్బు!!" కసిగా గొణి గాడు.

"నన్ను అపార్థం చేసుకోకు ఉదయా," అతనికి దగ్గరగా జరుగుతూ అన్నదామె. "అందరి ఆడవాళ్ళలా నాకూ నా భర్త బాగా సంపాదించాలనీ, నన్ను లగ్జరీస్‌లో ముంచెత్తాలనీ, నేను కోరుకున్న బట్టలు గానీ నగలు గానీ లేదనకుండా కొనగలిగే స్తోమతు అతనికి ఉండాలనీ, సాటి ఆడ వాళ్ళు నా ఐశ్వర్యాన్నీ అదృష్టాన్నీ చూసి ఈర్ష్య చెందాలనీ, ఇలాంటి కోర్కె లుండటం అసహజం కాదనుకుంటాను."



"వానిటీ!" వ్యంగ్యంగా అన్నాడు ఉదయ చంద్రరావు.

"అవును ఉదయ్యా, స్వేచ్ఛను అణచుకోవాల్సి వచ్చేసరికి ఆడది వానిటీని ఆశ్రయించాల్సి వస్తోంది. ఉదాహృగా..."

కమల వెళ్ళిపోయాక ఉదయ చంద్రరావు నిద్రపోవటానికి ప్రయత్నించాడు. అనుకోకుండా అతనికి కళ్ళ ముందు తన డాక్టరు మిత్రుడు కదలాడాడు. అతని పేరు రఘు. అతను యంబీ పాసయి ప్రైవేటుగా ప్రాక్టీసు పెట్టాడు ప్రాజెక్టులో. తరచుగా ఉదయ చంద్రరావు ఏమీ తోచనప్పుడు అతని వద్దకు వెళ్ళి కాలక్షేపం చేసి వస్తుంటాడు. ఒక రోజు అతను వెళ్ళేసరికి రఘు ముందున్న కుర్చీలో ఒక యువతి కూర్చుని ఉంది. ఆమెను చూడగానే ఊరు స్త్రీ అని తెలుస్తోంది. ఉదయ చంద్రరావు వెళ్ళగానే అప్పటి వరకు నవ్వుతూ కబుర్లు చెబుతున్న ఆమె చప్పున లేచి నిలబడింది.

"వెళ్ళొస్తాను డాక్టరుగారూ"

"మంచిది, డబ్బులేమైనా కావాలా?" అన్నాడు రఘు,

"ఒక ఇరవై ఉంటే ఇవ్వండి."

జేబులోంచి రెండు నోట్లు తీసి ఆమెకిచ్చాడు రఘు.

"ఆశ్చర్యంగా ఉంది," ఆమె వెళ్ళిపోయాక అన్నాడు ఉదయచంద్రరావు.

"ఇంత వరకూ నేను ఒక పేషంటు డాక్టరుకు డబ్బులివ్వటాన్ని చూసాను. గాని, డాక్టరే పేషెంటుకు డబ్బులివ్వటాన్ని మాత్రం ఇదే చూడటం—"

"నువ్వు పొరపడుతున్నావు ఉదయ చంద్రరావ్, ఆమె నా పేషెంటు కాదు."

"మరి?"

"నా ఏజంటు," నవ్వాడు రఘు.

అర్థం కానట్లు చూసాడు ఉదయ చంద్రరావు

"సూటిగా చెప్పమంటావా?" రఘు అన్నాడు. "అయితే విను- ఈ ప్రాజెక్టుకు వచ్చిన కొత్తలో అందరిలాగా నేను కూడా మామూలు రోగాల్ని కుదర్చటానికి ప్రయత్నించాను. నా హస్తవాసి బాగోకో ఏమో గాని అందులో అంతగా రాణించలేక పోయాను. ఈలోపు మరో ఇద్దరు యంబీగాళ్లు నాకు పోటీకి వచ్చారు. ఉన్న గవర్నమెంట్ హాస్పటల్ కాక ఇల్లాంటి పరిస్థితుల్లో డాక్టరుగా ఎట్లా నిలదొక్కుకోవాలంటావు?" చటుక్కున పెద్దగా నవ్వాడు రఘు. అంతలోనే మళ్ళీ అన్నాడు, "ఆఖరుకు ఆలోచించి ఆలోచించి ఈ లైనులోకి మారాను...."

"ఏ లైను?"

"బుద్ధావతారానివి—నీకు తెలియకపోవచ్చు. చివరికి నేనిక్కడ సుఖరోగాల

స్పెషలిస్టుగా స్థిరపడ్డాను. స్థిరపడ్డాను అనటంకంటే ప్రసిద్ధి చెందానంటే బాగుంటుంది... ఇంతకుముందు వెళ్ళిన దాని లాంటివాళ్ళు మరో నలుగు రయిదుగురు ఉన్నారు. వీళ్ళంతా నా ఏజెంట్లు ఇలాంటి ప్రదేశాల్లో వ్యభిచారం సహజమూ, తప్పని సరి కూడాను. ఈ ఆడవాళ్ళు తమ రోగాల్ని విటులకు అంటించుతుంటారు. తప్పనిసరిగా వాళ్ళు ట్రీట్ మెంటుకు నా వద్దకే వస్తుంటారు. కాక వీళ్ళు నా పేరును సజెస్ట్ చేస్తుంటారు కూడా అవసరాన్ని బట్టి. ఇప్పుడు అర్థమయిందనుకుంటాను నీకు, వీళ్ళు నా ఏజెంట్లు ఎట్లా అయ్యారో. అటు వాళ్ళ వ్యాపారమూ, ఇటు నా వృత్తీ. ఇలా దినదిన ప్రవర్ధమానమవుతుంటాయి. అడపా దడపా నేను నా ఏజెంట్లకు కమీషన్ క్రింద ఎంతో కొంత ముట్ట జెప్పుతుంటాను."

"హారిబుల్ !!"

అది గుర్తుకొచ్చి జుగుప్సతో జలదరించింది ఉదయచంద్రరావు హృదయం. ఎక్కడ చూసినా స్వార్థం, అధర్మం, అవినీతి!! ఇట్లాంటి మందమధ్య తనలాంటి వాళ్ళు ఎన్నాళ్ళని నెగ్గుకురాగలరు? కమల, రఘు, ఇఈలు, ఏఈలు, కంట్రాక్టర్లు, సాటి జేఈలు, అంతా అతని కళ్ళముందు గిరగిరా తిరగసాగారు. వాళ్ళంతా అతన్ని వెక్కిరిస్తున్నారు. గేలి చేస్తున్నారు. దయ్యం లాంటి అవినీతి హస్తం గుప్పిట తెరచి అతణ్ణి ఆహ్వానిస్తోంది....

మర్నాడు ఉదయానికి అతని మనస్సు కాస్త తేలిక పడింది. ఆఖరికి అతనో నిర్ణయానికి రాగలిగాడు....

ఆ సాయంత్రం అతను బజారులో నడుస్తుంటే కంట్రాక్టరు రెడ్డి కనిపించాడు జీపులో ఎటో పోతూ. వెనక సీట్లో అతని వద్ద పనిచేసే జోసెఫ్ అనే ఓ మేస్త్రీ కూర్చుని ఉన్నాడు.

"ఉదయ చంద్రరావుగారూ మేము నర్సీపట్నం పోతున్నాము వస్తారా?" అన్నాడు రెడ్డి స్టీరింగు ముందునుంచి.

కొద్దిసేపు ఆలోచించాడు ఉదయచంద్రరావు.

"పదండి నేనూ వస్తాను. నాకు కాస్త ఛేంజ్ కావాలనిపిస్తోంది" అన్నాడు.

ఆశ్చర్యపోయాడు. రెడ్డి. అతనేదో మాటవరసకు అన్నాడు కాస్త వ్యంగ్యంగా కూడ అన్నాడేమో. ఎందుకంటే ఉదయచంద్రరావు సామాన్యంగా కంట్రాక్టర్లతో అంత కలుపుగోలుగా ఉండడు. వాళ్ళ సహాయాల్ని ఎంత చిన్నవైనాగాని స్వీకరించడు. కూడా అదీకాక అంతకు ముందు ఒకసారి పవర్ హౌస్ రూఫ్ కాంక్రీటింగ్ చేయించుతున్నప్పుడు అక్కడ కంట్రాక్టరుగా రెడ్డి చేసే అక్రమాలకి ఉదయచంద్రరావు సహకరించకపోగా అతనితో వివాదపడ్డాడు. అట్లాటి ఉదయచంద్రరావు ఇవాళ తన ప్రపోజల్ కి వెంటనే వొప్పేసుకోవటం వింత గొల్పింది రెడ్డికి. అతని కళ్ళలో విజయగర్వం లాంటిది ఒక్క క్షణం కదిలి మాయమయ్యింది.

ముందు సీట్లో రెడ్డి పక్కన ఉదయచంద్రరావు. ఆ పూట అతను రెడ్డితో చాలా కలుపుగోలుగా మాట్లాడాడు. చెక్ పోస్టు దాటి కొంత దూరం పోయాక సడన్ గా టాపిక్ మార్చేస్తూ రెడ్డితో అలా అన్నాడు.

"రెడ్డిగారూ, ఆఖరుకి నేనో నిర్ణయానికి వచ్చాను."

"ఏ విషయంలో?"


"ఏమిటండోయ్ ఆ నిర్ణయం?"

"చెబుతాను. అది చెప్పబోయే ముందు మీకో ఉపమానం చెప్పాలనిపిస్తోంది. వినటానికి మీకేమీ అభ్యంతరం లేదుగా?!

"నో నో, చెప్పండి!"

"ఈ ప్రాజెక్టుల క్రింద ఖర్చయ్యే ఈ సొమ్మంతా ఎవరిదంటారు? ప్రభుత్వానిది. అంటే ఒకరకంగా ప్రజల ఖజానా అన్న మాట..."

"కరెక్ట్. అయితే"



"ఈ ప్రభుత్వోద్యోగులు ఉన్నారు చూసారు, నన్ను కూడా కలుపుకుని-వీళ్ళంతా ఆ ఖజానాని కాపాడటానికి వినియోగించబడ్డ శునకాలు-ఐమీన్ కుక్కలు"

"సెభాష్ ఈ ఉపమానం చాలా బాగుంది, సెక్టన్!"

"ఇకపోతే మీ కంట్రాక్టర్లు ఉన్నారు చూసారూ, వాళ్ళు దొంగలు. ఈ ఖజానాని ఏదో రకంగా అక్రమంగా దోచుకోవటానికి ప్రయత్నిస్తూ అడ్డుగా ఉన్న ఈ కుక్కలకు ఏ బిస్కట్టునో, మాంసం ముక్కనో ఎరగా వేసి లోబరుచుకుంటూ తమపని కానిచ్చుకుపోతుంటారు. అవునంటారా?"

"ఆఫ్ కోర్స్, ఎక్కడో మీ బోటి జాతి శునకాల విషయంలో తప్ప!"

"అవును. అయితే తొంభయి తొమ్మిది ఊరకుక్కల మధ్య ఒక జాతి శునకం తన ధర్మాన్ని నిర్వర్తించటం కష్టమని తెలుసుకున్నాను అనుభవం మీద. అందుకే ఆఖరుకి ఒక నిర్ణయానికి వచ్చాను."

రెడ్డి కళ్ళు తళుక్కున మెరిసాయి.

"ఏమిటది, ఊరకుక్కల్తో కలిసి పోదల్చుకున్నారా?" అన్నాడు

"లేదు లేదు. నేను చాలా అసహ్యించుకుంటాను దాన్ని...." కొద్దిసేపు ఊరుకుని చిన్నగా అన్నాడు ఉదయచంద్రరావు. "ఈ ఉద్యోగానికి రిజైన్ చేయదల్చుకున్నాను."

"ఒస్, అంతేనా?! ఓటమిని ఒప్పుకోవటమన్న మాట! మరి తర్వాత ఏం చేద్దామని?"

కన్నింగ్‌గా నవ్వి, ఇలా అన్నాడు ఉదయచంద్రరావు.

"దొంగను కాదల్చుకున్నాను!"

"వ్వాట్!!?" నోరు తెరిచాడు రెడ్డి.

అంత వరకూ వాళ్ళ సంభాషణ వింటున్న వెనక సీట్లోని జోసెఫ్ చటుక్కున తన రెండు భుజాల మీదా, హృదయం మీద క్రాస్ చేసుకుంటూ చిన్నగా గొణిగాడు.

"మే గాడ్ సేవ్ దిస్ నేషన్!" ✱

సస్పెన్స్

చిట్టారెడ్డి సూర్యకుమారి

తూరుపు వాకిళ్ళు తెరుచుకున్నాయి.

ఉదయించిన కర్మసాక్షి ఉదయాద్రి నుండి గగనానికి ఎక్కిపోయాడు.

ఆదివారం సెలవురోజు, చల్లగా కాసేపు పడుకుందామంటే ఏదో ముంచుకు పోయినట్లు వచ్చేశాడు.

కిటికీలో నుంచి దూసుకు వచ్చిన కిరణాలను చూచి మంచం దిగింది చిత్ర.

స్నానాదులు ముగించి వచ్చేటప్పటికి బల్లమీద టిఫిన్ రెడీగా వుంది.

ఆదివారం ఇంట్లో అందరూ వుంటారు. కలిసి భోజనాలు చేస్తారని ప్రొద్దున్న టిఫిన్ నుంచి రాత్రి భోజనంవరకు అన్నీ స్పెషల్స్ చేస్తుంది అమ్మ 'నిద్ర లేవండి–స్నానాలు ముగించండి – పాలు తాగండి, నాష్టా చేయండి!, అని ఆ రోజు ఎవర్నీ తొందర చేయదు చేసినా వినరు. అందరూ రిలాక్సింగ్ మూడ్‌లో వుంటారు.

నాన్న తొమ్మిది గంటలవరకు పేపరు పట్టుకుని గడ్డం మరో అంగుళం పెరిగినాక రెండోసారి కాఫీతాగి అప్పుడు షేవింగ్ మొదలు పెట్టుతారు.

వేడి వేడి దోసెమీద అమ్మ పెట్టి వెళ్ళిన వెన్న కరుగుతూంటే చూస్తుంది చిత్ర.

నాన్న షేవింగ్ ప్రారంభించాడు. అమ్మ సంభాషణ మొదలు పెట్టింది.

"శిల్పని చూచుకోటానికి రేపు వస్తారు...."

"చిత్రకి కూడా సంబంధం చూచి ఒకసారి చేస్తే ఖర్చులు కలసి వస్తాయి..."

శిల్ప వాళ్ళకి నచ్చాలి. కట్నం కానుకలు అన్నీ కుదిరితే ఫిబ్రవరిలో పెళ్ళి చేయవచ్చు.

రేపు వాళ్ళు వచ్చి వెళ్ళేకగాని ఏ సంగతి తెలియదు. అందాక సస్పెన్స్!!

ఈజీ చైర్‌లో పడుకుని తలారబెట్టుకుంటూ జ్యోతి చదువుతున్న సాహిత్య అంది "హమ్మయ్యా.... శేఖర్ గుండెల మీద తల ఆనించి నిశ్చింతగా కళ్ళు మూసుకుంది మీరా. సస్పెన్స్ తీరిపోయింది"

అంతలో 'రచన' వీక్లీ పట్టుకు వచ్చింది,

"ఏయ్ రచనా ఇలా ఇవ్వు–యిప్పుడే



చదివి యిస్తా" అని సాహిత్య అడుగుతుంటే రచన పరుగెత్తుకుపోయింది.

"నవీన్ వారి ప్రేమ గురించి ఇంట్లో చెప్పేస్తా నన్నాడు, వారి పెళ్ళికి వాళ్లు

ంకి కరిస్తారో లేదో? అదే పెద్ద సస్పెన్స్‌గా వుంది" అని చిత్ర అనుకుంటూంది.

"నవీన్ అమ్మా నాన్నని కాదని తనను పెళ్ళి చేసుకుంటాడా! చేసుకోక పోతే! అమ్మో! నవీన్ చూడక తను వుండలేదు. నవీన్‌ను కాదని మరొకరిని పెళ్ళి చేసుకో లేదు..." అని చిత్ర తలుస్తూ కాఫీగ్లాసు పట్టుకుని వరండాలోకి వచ్చింది.

సినిమా రివ్యూ చూస్తున్న తాతయ్య 'చిత్రా! అమావాస్య చంద్రుడు చూశావా! ... చివర్లో గుడ్డివాడికి పెళ్ళి అవుతుందా!'

సినిమాకి వెళ్ళి చూచేదాక ఆ సస్పెన్స్ భరించలేని తాతయ్య చిన్న పిల్లాడిలా అడుగుతున్నాడు

నవ్వుతూ "చూచి వచ్చి చెప్పుతాను తాతయ్యా"

నానమ్మ గదిలోనుంచి దగ్గు వినిపించింది. ఆ తర్వాత మాటలు "నిన్న ఎక్సరే తీశారు. రేపు రమ్మన్నారు రిజల్టును చెప్ప టానికి, ఏం జబ్బు అంటారో..."

చివరికి నానమ్మ కూడ సస్పెన్స్‌తో బాధ పడుతూంది.

సస్పెన్స్ భరించలేని అమ్మ సీరియల్స్ చదవటం మానేసింది. చిత్ర నవ్వుకుంటూ తన గదిలోకి వెళ్ళింది.

పుస్తకంలో దాచుకున్న నవీన్ ఫోటో తీసి ఎవ్వరూ చూడకుండ ముద్దు పెట్టుకుని దాచేసింది. వారి ప్రేమకు వయస్సు ఐదు సంవత్సరాలు, అయినా ఇప్పుడిప్పుడే ప్రేమలో పడినట్లు కొత్తగా వుంటుంది. ప్రేమకు వృద్ధాప్యం లేదు. వెగటు లేదు. ఏ రోజుకారోజు కొత్తగా నవీన్‌ను కలు సుకోబోతుంటే థ్రిల్లింగ్‌గా వుంటుంది. చూచేదాక-ఆరాటం వచ్చేస్తుంటే గుబు లుగా మళ్ళీ రేపు కొరకు వళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూడటంలోనే సంవత్స రాలు గడచి పోయాయి. తనకు డిగ్రీ వచ్చింది. బాంకులో వుద్యోగం దొరికింది.

నవీన్ ఇంజనీర్ అయ్యాడు. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే పెళ్ళికి తొందర పడుతున్నాడు.

అతని తొందరకు ఆవేశానికి నవ్వుతుంటే "మనకు పెళ్ళి అయివుంటే ఐదేళ్ళ కొడుకు వుండేవాడు. అని అంటే....

"మా అమ్మచాలు వస్తే ఈ పాటికి నల్గురు వుండేవాళ్ళు," ఆ మాటకు నవీన్ కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తుంటే కిల కిల నవ్వింది చిత్ర.

వారి ప్రేమ సంగతి ఇంట్లో చూచా యగ తెలుసు. ముందు ఆ ప్రాబ్లెమ్ క్లియర్........ అయితే వీళ్ళకి చెప్ప వచ్చు..............

తీరికగా పడుకుని చిత్ర నవీన్‌గురించి కలలు కంటూ కాలక్షేపం చేసింది.

భోజనాలు అయ్యాక తయారై కమల ఇంటికి వెళ్ళుతున్నానని చెప్పి వచ్చింది.

కమల ఇంట్లో నవీన్ చిత్రకోసం కాచు కుని వున్నాడు. ఆలస్యం భరించ లేనట్లు ఎదురొచ్చాడు నవీన్ చూచి ఎన్నాళ్ళో అయినట్లు చిత్ర చూస్తుంటే" చిత్రా ఇంట్లో నీ గురించి చెప్పేశాను.... నిన్ను చూపిస్తానని చెప్పాను"

చిత్రకు భయం వేసింది ఏ వంక పెట్టి కాదంటారోనని.

వాళ్ళు గొప్పవాళ్ళు. నవీన్‌కు బోలెడు కట్నం ఇస్తామని వస్తున్నారని తెలుసు. అందుకే భయం.

చిత్ర భయం కనిపెట్టి "పెద్దవాళ్ళకి చెప్పటం మన ధర్మం, వారికిష్టమైతే చేస్తారు. లేదా మనమే చేసుకుంటాం-" అంటూ చిత్రను ప్రయాణం చేశాడు.

చిత్ర ఒకసారి అద్దంలో చూచుకుని నవీన్ వెంట వచ్చి మోటార్ బైక్ ఎక్కింది.

నవీన్ చిత్రను చూశాడు.

చిత్ర తను మామూలుగ వేసుకునే పంజాబి డ్రస్‌లోవుంది. అవి చిత్రకు అలవా టైన దుస్తులు.

"చిత్ర నీ రంగు — పొడుగు—దుస్తులు చూచి ఏ పంజాబి పిల్లనో తెచ్చాను అను కుంటారు. చక్కగా నూరు పైసల తెలుగు



మాత్రయిలా చీర కట్టుకునిరా" అన్నాడు.

చిత్ర యింటికి కాస్త దూరంలో ఆపి, "త్వరగా రా" అన్నాడు.

చిత్ర పరుగున ఇంట్లోకి వచ్చింది. బెనారస్ చీర కట్టుకుని, జడలో పూలు పెట్టుకుని నుదుట కుంకుమ దిద్దుకుంటుంటే....

"ఎక్కడికే పెళ్ళి కూతురులా తయారై పోతున్నావు!" అని అక్క శిల్ప అడిగింది.

"వచ్చాక చెప్పుతాను ఓ కథ"

"సస్పెన్స్‌లో పెట్టి చంపక చెప్పిపోరాదూ."

శిల్ప అసలు సస్పెన్స్‌ను భరించలేదు. నవల ప్రారంభించి నాలుగు పేజీలు చదివి గబుక్కున వెనక పేజీలు తిప్పుతుంది. సమాప్తం చదివాక తిరిగి ప్రారంభిస్తుంది. 'మరో నిముషం వుంటే ప్రశ్నలు కురిపిస్తుంది లేదా వెంట వస్తుంది. బాబోయ్!' అనుకుంటూ పరుగు పెట్టింది.

ఎదురైన అమ్మకు పాదాభివందనం చేసి – వెనక్కి తిరిగి చూడలేదు - అమ్మ చెప్పేది, అడిగేది, వినిపించుకోలేదు. పరుగున వెళ్ళింది రోడ్డుమలుపు తిరిగింది, అంతవరకు నవీన్ ఎక్కడ వున్నాడో కాని రయ్‌మంటూ వచ్చాడు.

"చిత్రా! యు ఆర్ బ్యూటిఫుల్, ఐ లవ్ యు" ఈ స్త్రీ తనదే అన్నట్లు గర్వంగా చూస్తుంటే ఐదు సంవత్సరాల నుంచి ఈ మాటే వింటున్న చిత్ర ముసిముసిగా సిగ్గుగా నవ్వుతూ చెంగున ఎగిరి కూర్చుంది.

నవీన్‌కు అందమైన చిత్రను చూస్తుంటే గర్వంగా, వుద్వేగంగా, ఇంటికి తీసుకు పోతుంటే ఆనందంగా వుంది.

చిత్రకు పరీక్షకు పోతున్నట్లు గుండె దడ దడ మని కొట్టుకుంటుంటె నవీన్ వీపు మీదకు వొరగబోయింది... అంతే మెరుపు మెరిసినట్లయింది.

పైట జారి పోవటం చిత్రకు తెలియనే తెలీదు!

చక్రంలోపడి చుట్టుకుపోయి యమపాశంలా పట్టి లాగేసింది. చిత్ర తల నేలకు కొట్టుకుంది. ఏం జరిగిందో చూస్తున్న, గుర్తించలేనట్లు గుడ్డిగా చూస్తున్న నవీన్‌కు గుడ్‌బై చెప్పుతున్నట్లుగా చెయ్యి మాత్రం కదలి కదలి ఆగిపోయింది. కాని చిత్ర పెదాలపై చిరునవ్వు చిత్రంగా నిలిచి పోయింది.

మానవ జీవితంలో మృత్యువు కంటె గొప్ప సస్పెన్స్ ఏముంది.

మృత్యువు ఏ క్షణాన? ఎప్పుడు? ఎక్కడ! వస్తుందో-వూహాకందని మృత్యువే గొప్ప సస్పెన్స్ థ్రిల్లర్-చిత్రకు ఆ సస్పెన్స్ తెలిసిపోయినట్టు నవ్వుతూంది... ✳

వాయిదా విలాపం

పి. శ్రీనివాస శాస్త్రి

ఒక్క మాటలో చెప్పాలంటే అహోబల రావుది వాయిదాల జీవితం.

దేశ పరిస్థితులు బాగుపడిన తరవాత గానీ పెళ్ళి చేసుకోను అంటూ నూనూగు మీసాల వయసులో ప్రతినపట్టి ఎప్పటి కప్పుడు పెళ్ళిఊసు వాయిదా వేసుకొంటూ వచ్చాడు. ఫలితంగా జుట్టు నెరిసి, ముఖం వడిలి, కాళ్ళలో సత్తువ తగ్గిన వయసులో కూడా బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. "పెళ్ళికి దేశ పరిస్థితికీ లంకె పెట్టుకుంటే దేశంతో బాటు నువ్వూ పాడయిపోతా వారే" అని మిత్రులు చేసిన హెచ్చరిక తలకెక్కి నలభయ్యో ఏట పెళ్ళి పీట ఎక్కాడు. ఆ పెళ్ళిపీటకి టకాలు లేదు. తాళి కట్టిన భార్యకి తన మీద ప్రేమ లేదు. అందుచేత పిల్లల్ని కనడం వాయిదా వేసుకున్నాడు. సంసారం సరంజామా "వాయిదాల" మీద కొన్నాడు. యాభయ్యో ఏట ప్రథమ సంతానం. సుభద్రని కన్నప్పటికి ఇంట్లో ఫాన్, టేబుల్, కుర్చీలూ, మంచాలూ ఏదీ ఇన్‌స్టాల్‌మెంట్లు పూర్తిగా కట్టకపోవడంవల్ల అతని సొంతం కాదు. సుభద్రని ఆపరేషన్ చేసి బైటకు తీసిన డాక్టరు మూడొందలు బిల్లుచెప్పాడు మూడు వాయిదాల్లో తీరుస్తానన్నాడు అహోబలరావు. "మీకిచ్చే బోనస్‌లోంచి మూడొందలూ డాక్టరీ ఫీజు కట్టెయ్యండి. కనీసం ఈ పాపన్నా పూర్తిగా మన సొంతం అవుతుంది" అంది భార్య. బోనస్ అను వాయిదా వేతనాన్ని ఆఫీసు యజమానులు వెంటనే చెల్లించక వాయిదా వేశారు. దాంతో పుట్టిన మూడు నెలల తరువాతగానీ సుభద్ర సొంత బిడ్డ కాలేక పోయింది అహోబలరావుకి.

ఈ కథ ప్రారంభమైన రోజున—అంటే ఫస్తు నెలాఖర్లో అర్జంటుగా 8 వందలకి అవసరం వచ్చింది కాని, ఆ అవసరం తీరే అవకాశం రాలేదు.

అందుచేత దిక్కుతోచక గుండెలు గోక్కుంటూ కరువు తీరా ఏడుద్దామను కున్నాడు అహోబలరావు. ఆ ఆలోచన కలిగిన ఉత్తర క్షణంలో చుట్టూ కలయ చూశాడు.

తానున్నది ఆఫీసులో.

తన చుట్టూ ఉన్నది సహచరులు.

ఇంత మంది మధ్య, హఠాత్తుగా ఏడుపు లంకించుకుంటే పరువేం కాను?

అందుచేత అహోబలరావు ఏడుపుని తాత్కాలికంగా వాయిదా వేసుకొన్నాడు.

"మరి పది నిముషాలు పోతే గడియారం గంట కొట్టేస్తుంది. (ఏ గడియారమూ కాలాన్ని వాయిదా వేయదు కదా!) బైటకి పోయి మరో ఐదునిముషాలు నడిస్తే పార్కొచ్చేస్తుంది, అందులో కూచుని కరువు తీరా ఏడ్చెయ్యొచ్చు."

అహోబలరావు ఈ నిర్ణయాని కొచ్చే సరికి గడియారం గంట కొట్టే ముందు ఆఫీసరు గార్నించి పిలుపొచ్చింది.

"ఏరోజు ఫైళ్ళు ఆరోజు పూర్తి చేయటం లేదు నువ్వు. పని వాయిదా వేస్తే ఊరు



కోసు" అనే సారాంశంగల ఉపన్యాసం అనంతరం ముఖ కవళికలో కొంత తీరు మార్చుకుని అహోబలరావు సతమతమవుతున్న సమస్యల మీదకి ఓ క్వశ్చన్ మార్కు తోశాడు ఆఫీస రాక్షసుడు.

ఆయనకి అర్జంటాతి అర్జంటుగా ఇప్పుడు గుంటూరు మిరపకాయలు కావాలి! పది కేజీలు పట్టమ్మని పురమాయించారు సగం డబ్బే యిస్తూ—"వెధవది పైసలు ఆడ్డం లేదోయ్ అహోబలరావూ!"

తివిరి ఇసుమున తైలంబు తీసినట్టుగా తిరిగి తిరిగి పాతిక రూపాయల అప్పు పుట్టించి ఆఫీసరారాధ్యదైవానికి గుంటూరు మిరపకాయల నైవేద్యం

సమర్పించు కున్నాడు అహోబలరావు ఆ తంతగం అయిన తరవాత ఏడద్దామన్న అహోబలరావు కోరిక రెట్టింపయ్యింది గాని పార్కు మూసేశారు. "ఇంటి కెళ్ళి ఏడద్దాంలే" అనుకున్నాడు అహోబలరావు మళ్ళా

డబ్బుల్లేవు అనుకోకుండా పౌరుషానికి "వెధవ సిటీ బస్సు కోసం ఎదురు చూడొద్దు" అనుకొని వీరోచితంగా ఇంటి వైపు నడక సాగించాడు. మధ్యలో కాళ్లు పీకినట్లయి హఠాత్తుగా తానిందాకా ఏడుపు వాయిదా వేసుకొన్న సంగతి గుర్తొచ్చింది అహోబలరావుకి.

ఆన్నూ, పానూ, వీలూ సాలూ సమయం సందర్భం ఇత్యాదులు కలిసాయో లేదోనని మళ్ళా చుట్టూ పరికించి చూసాడు,

ఇంకానయం. రోడ్డు గొప్పింటి పెళ్ళంత సందడిగా వుంది. అంత మంది మధ్యన ఏడుపు ప్రారంభించకుండా మరోసారి పరువు కాపాడుకొన్నందుకు తనను తాను మెచ్చుకున్నాడు. కానీ అంతలోనే ఒక సీసం పెంకు అకులాఅరిగిన చెప్పు కిందనించి కాలిలో కస్సున గుచ్చుకుంది. దబ్బున చతికిల పడ్డాడు. ఇక లాభంలేదు - ఏడ్చేద్దాం అనుకొంటుండగా కిలకిలలాడుతూ పిల్లలు చుట్టుముట్టారు. వాళ్ళెవరికీ సరిగా బట్టల్లేవు వాళ్ళవాళ్ళ తల్లిదండ్రుల సంసారాలు కూడా సరిగా సాగుతున్న దాఖలాల్లేవు. అయినా వాళ్ళు ఏడవటం లేదు. పైగా అహోబలరావు సీసం పెంకు గుచ్చుకొన్నందుకు ఏడిస్తే వెంటనే నవ్వుతూ చుట్టూ గంతులెయ్యడానికి రెడీగా వున్నారు. మిణుకు మిణుకు చూస్తూ"

బ్రేవో మైడియర్ అహోబలం అనుకున్నాడు అహోబలరావు. మళ్ళా ఏడుపు రాత్రికి వాయిదా వేసుకున్నాడు. అలా రోడ్డుమీద చతికిల పడే సీసంపెంకుని జాగ్రత్తగా కాల్లోంచి లాగి కాలి చెప్పుతో దాన్ని కసికసిగా చావ గొట్టేసరికి సీసం పెంకుకి ఏమీ కాకపోగా చెప్పు తెగింది. అహోబలరావు అంత విపత్తులోనూ ఏడవనందుకు చుట్టూ మూగిన పిల్లలు ఓ ఆటకి అవకాశం జారిపోయినట్లు చిన్న బుచ్చుకున్నారు. తెగిన చెప్పు విసిరేసి అహోబలరావు రోడ్డుచ్చుకున్నాడు.

ఆసుపత్రులు ... మందులు ... ఫీజులు ... ఉద్యోగాలు... లంచాలు ... రోడ్డుమీద సీసం పెంకులు ...బాగుపడని దేశపరిస్థితి...తెగిన తీగ కాని చెప్పు...

ఏడ్చెయ్యాలి.... ఏడ్చెయ్యాలి...., అనుకుంటూనే రెండో చెప్పును పారేద్దామా ఒంటిచెప్పుతో కుంటు కుంటూ నడుద్దామా అని ఆలోచించి ఆ రెండు చెయ్యడానికి మధ్య తరగతి మనసు వెంటనే ఇష్టపడక పోవడంతో కొంత దూరం కుంటుకుంటూ నడిచి ఆ తరవాత చెప్పు విసిరేశాడు.

ఆ ఒంటరి రోడ్డు మీద ఓ వీధి లైటుంది గానీ అది వెలగదు. ఆ రోడ్డులో దొంగలుంటారు తప్ప మనుషులుండరన్న నమ్మకంతో రాత్రిళ్ళు ఎవరూ అటు రారు. వచ్చినా అక్కడ ఉండకుండా జ్వాలాతోరణం నాడు నిప్పుల మీద నడిచే వాళ్ళలా నడుస్తారు — అనగా — పరిగెడతారు.

అక్కడికి రాగనే అహోబలరావుకి ఇందాకటినించీ వాయిదా వేసుకొంటూ వచ్చిన ఏడుపు ప్రెషరెక్కువైన పంపు నీళ్ళలా తన్నుకురాబోయింది.

వీధి లాంతరు కింద చేరగిలబడి ముందు మంద్ర స్థాయిలో ఆలాపన చేసుకున్నాడు.

పోలీసులకు శాస్త్రీయ సంగీత జ్ఞానం ఉండదేమోగాని అక్కడ ఆ చీకటిలో బీటు కానిస్టేబుల్ మాత్రం, "వెలగని వీధి లాంతరు కింద ఈ కచేరీ ఏమిటి?" అన్నట్లు చూసాడు అహోబలరావుని.

అహోబలరావు సంగీతకచేరీ చేయటం లేదని తెలుసుకున్న తరువాత, పాత కేడీ గాండేమో అన్నట్టు చూసాడు పోలీసు. అదీ అవునో కాదో ఇదమిత్థంగా తేలక ముందే పిచ్చాడు కాదు గదా అన్నట్టు చూసాడు పోలీసు మళ్లా.



అంతే-

అహోబలరావు ఏడుపు ఆలాపన దగ్గరే ఆగిపోయింది.

ఈ లోగా పోలీసు అహోబలరావు ఎవరో తేల్చుకోలేక, ఆపని తన పైఅధికార్లకి అప్పగించే ప్రయత్నంలోన అహోబలరావుని "పద పోలీస్ స్టేషన్‌కి" అని లాఠీ ఝళిపిస్తూ హెచ్చరించాడు.

నగరంలో ఇటీవల సంచలనం సృష్టించి "పోలీసోళ్ళ పేణాలు తోడేత్తన్న" చోరీ కేసుతో ఈ అహోబలరావుకి సంబంధం ఉందని ఇంటరాగేషన్‌లో ఎలాగోలా రుజువుచేసి........ అమట్న........??

పోలీసాయనకి హుషారొచ్చి లాఠీతో అహోబలం భుజబలాన్ని పరీక్షించడానికి ఉద్యుక్తుడయ్యాడు........

"ఏం చేస్తున్నావిక్కడ"—పోలీసు గర్జన.

"ఏడుస్తున్నాను" - అహోబలరావు సమాధానం.

"ఎందుకేడుస్తున్నావ్"

"అర్థం లేని ప్రశ్న. నవ్వడానికి కారణాలు తక్కువ. ఏడవడానికి అనేకం. అసలు ఏడుపే ఇప్పుడున్న పరిస్థితులకు కటాకట్‌న సరిపోతుంది. నవ్వు ఈ పరిస్థితుల్లో రాకూడనిది"

"ఐతే స్టేషన్‌కి పద-అక్కడ ఇంకా బాగా ఏడిపిస్తాం..."-తిరిగి పోలీసు గర్జన.

ఇక వాయిదా వేసుకో దలచలేదు అహోబలరావు.

విషాదంవల్ల కలిగే ఏడుపుకన్న, ఏడుపు వాయిదా వేసుకోవడం వల్ల కలిగే విషాదమే ఎక్కువ అని అర్థమై పోయిం అహోబలానికి

అందుకే-


అక్కడికక్కడ-

అప్పటికప్పుడు-

ఘొల్లున ఏడవబోయి-

ఛక్కున నవ్వేసాడు—ఏడవడానికి కూడా ఈ లోకం సౌకర్యంగా లేనందుకు విగ్గరగా, మనసారా······!!

✱



"If you know exactly what you are going to do, what's the good of doing it? There is no interest in something you know already, it is much better to do something else"

ఒక ఆర్ట్ క్రిటిక్ తో ఈ మాట అనాల్సొచ్చింది పికాసోకి. దీని వల్ల పికాసో, అతని కళా-బంటే తెలియచ్చు.

పికాసో స్పైన్‌లో, మాల్గాలో 1881లో పుట్టాడు-తండ్రి ఓ టీచర్, పైగా ఆర్టిస్ట్. పధ్నాలుగేళ్ళకే Barcelona చిత్రకళాశాలలో పరీక్షకి వెళ్ళాడు. పరీక్షకి నెల రోజులగడువిచ్చారు-ఆ పరీక్షని ఒకరోజులోనే పూర్తి చేశాడు! —అతే ఆ వయసులోనే పెయింటింగ్ చెయ్యడంలో ముఖ్యమైనవిగా కనిపించే వస్తువులోని అక్కరలేని అంశాలను పెయింట్ చేసే వాడుకాదు- తీసుకున్న వస్తువుని కొంచెం ఎక్కువ చేసి మరీ చూపేవాడు.

ఎక్కువ అవస్థ పడకుండానే మాడ్రిడ్‌లోని "రాయల్ అకాడమి" లో చేరాడు. ఎగ్జామినర్స్‌కి ఆశ్చర్యాన్ని కలిగించాడు. అప్పటి నుంచే తనవంటూ ప్రత్యేకమైన "రూల్స్" ని తయారు చేసుకున్నాడు చిత్రకళాశైలిలో.

తరువాత పికాసో Barcelona ముఖ్య పట్టణం Catalan లో స్థిరపడ్డాడు. అక్కడ కవులతోను, రచయితలతోనూ కలసి స్వేచ్ఛ కోసం పోరాడాడు. మిగతా "పోరాట పద్యమాల" లాగే కళావిభాగం కూడా కళాకారుడి "రాజకీయ జీవితం" లో ఓ ముఖ్య పాత్ర అవ్వాలనే

! పికాసో !

— మోహన్ కోడా —

వుద్దేశం వుంది. తన చుట్టు జరిగే అనేక పోరాట సంఘటనలని చూశాడు. తెలుసుకున్నాడు. కానీ రాజకీయ విషయమై చిత్రకళ ఉపయోగించగలిగేది అతి స్వల్పం అని అభిప్రాయ పడ్డాడు. పికాసో తన చుట్టూ వున్న రచయితల లాగ "రివల్యూషనరీ" కాలేదు. 1944లో కమ్యూనిస్ట్‌పార్టీ సభ్యుడయినా పికాసో తన చిత్రాల్లో పార్టీ విషయమై ఏదీ వ్యక్తం చెయ్యలేదు—

"Freedom is some thing you have to be very careful about what so ever you do, you find your self in chains"

అని అన్నాడు. రచయితలు రాసిన పుస్తకాలకి బొమ్మలువేసేవాడు. ఐతే అవి తను భావించిన 'సంకెళ్ళు' కావు అతని స్నేహితులకి సరదాగా, హాయిగా వుండేవాడు. ఐతే రాజకీయ విషయం మీద అభిమానం మాత్రంవుండేది కాదు. అతని స్కెచ్ పుస్తకాల నిండా బుల్ ఫైటర్స్, కేబరే ఆర్టిస్టులూ, చేపలు పట్టే వాళ్ళూ నిండిపోయేవారు.

19వ యేట "పారిస్"కి వచ్చాడు. పారిస్ కళలతో, కళాకారులతో నిండిపోయింది. మొదటిసారిగా Petrus Manach అనే వ్యాపారి దొరికేడతనికి. అతను పికాసో చిత్రాలను మూడింటిని కొన్నాడు. తరువాత నెలకి 150 ఫ్రాంక్‌లు పికాసోకి ఇచ్చేలా, పికాసో ప్రతినెలా తను చేసిన Paintings అన్నీ Monarch కి ఇచ్చేలా ఒప్పందమయింది.

అప్పటికి పికాసో చిత్రాలు ఎక్కువగా నగ్న చిత్రాలు, రేసుగుర్రాలు, ఫ్లవర్ స్టడీలు వుండేవి. అతని మీద మానె, వాన్‌గో, పిసారో, లాట్రెక్ లాటి చిత్రకారుల ప్రభావం వుండేది. ప్రతి వస్తువుని అమిత ప్రేమతో చిత్రించేవాడని—అతన్ని ప్యూర్ పెయింటర్‌గా అభిమానించేరు. ఓసారి ఓ క్రిటిక్ అన్నాడు "అతని టాలెంట్‌ని కాదనడం కాదుగాని, తను రోజుకి ఒక్క పెయింటింగ్ కన్నా ఎక్కువ చెయ్యద్దని సలహా ఇస్తాను" అని.....

ఈ శతాబ్దం మొదటి నాలుగయిదు సంవత్సరాలు పికాసో ముఖ్య దశల్లో ఒకటి—అదే "బ్లూపిరియడ్" సమాజంలోని బాధా సర్ప దష్టులూ, ముష్టివాళ్ళు, బార్సిలోనా వీధుల్లోనూ, బార్‌లలోనూ కనిపించే వేశ్యలనీ చిత్రించాడు-అతని బాధా తప్త హృదయం, కరుణ Cold blue tones తో వ్యక్తం అయింది. ఎంతో మంది కళా విమర్శకులకి వివాదమైన విషయం అది-ఒకటి మాత్రం నిజం-జాలి తోనూ, బాధ తోనూ నిండిన అతని భావాన్ని చెప్పిన రంగు నీలమే! చుట్టూ వున్న దరిద్రాన్ని చూపించాడు- చిరునవ్వు నవ్వే అస్కారం లేదు ఆ పీరియడ్ పెయింటింగ్స్ చూస్తే.... 1904 లో ఫ్రాన్స్‌లో పూర్తిగా స్థిరపడ్డాకా అతను చేసిన ఎచింగ్ "ది ఫ్రూగల్ మీల్"—ఆ మీడియంలో అద్భుత ఫలితం.

పికాసో జీవితం తనకు నచ్చిన పద్ధతి ప్రకారం గడిచింది. చక్కటి ఫెర్నాండ్ ఒలివియర్ అతన్ని ప్రేమించింది.—పికాసో ఇల్లు చిత్రకారులకి నీడలాంటిది. మేటిస్, బ్రాక్, మాక్స్ జాకబ్, అపొలొనేర్, డెకామెల్, లియో, గెట్రూడ్ స్టైన్ మొదలయిన చిత్రకారులు, మేధావులు చేరేవారు అతన్ని - వాళ్ళు నూనె కొనుక్కోలేనప్పుడు పికాసో కొవ్వొత్తి వెలుగులో పెయింట్ చేసేవాడు.

థియేటర్ టికెట్లు కొనలేక పోయారు గనక వాళ్ళు 'వాళ్ళ నాటకాలు వాళ్ళే వేసేవారు!'

ఆ దశ తరువాత పికాసో "రోస్ పిరియడ్" లో ప్రవేశించాడు-నటులు, సర్కస్ మనుషులు, విదూషకులు అతని ముఖ్య పాత్రలయారు. లేత గులాబీ రంగు అతని భావాన్ని చెప్పింది. శిల్ప ధోరణిలో

"(భూ)స్వామి నీతి"


"నేల పాదుల్ని
స్వేదంతో
పలకరించి,
ఎండల్ని, వానల్ని
శ్వాసగ పీలుస్తూ....
చేతుల
కొమ్మలు చాచి
శ్రమ ఫలాల్ని
కాయిస్తున్నాడు
వాడు....
"ఫలితం
పరోప కారార్థం"....
కష్టించడం నీవని
ఆస్వాదించడం మా విధి....
నిర్వచిస్తున్నాడు
వీడు"....

అవనిగడ్డ సూర్యప్రకాష్

"వాల్యూమ్" కి ప్రాముఖ్యత నిచ్చే బొమ్మలు, శిల్పాలు చెక్కడం కూడా ఆరంభించాడు. అప్పట్లోనే గెట్రూడ్ స్టైయిన్ "పోర్ట్రెయిట్" చేశాడు-ఎనభై తొంభై సార్లు పికాసో ప్రయత్నించాడు బొమ్మని పూర్తి చెయ్యడానికి-పూర్తవ లేదు అక్కడికీ-దాంతో ఓ రోజు పికాసో అన్నాడు "I cannot see you any longer when I look at you" అన్నాడు.

1907 వచ్చే సరికి పికాసో సమస్య పెయింటింగ్‌లో "Structure"; సిజాన్ ప్రభావం కొంత అతని మీద లేకపోలేదు "Les demosells Avignon" అనే పెద్ద పెయింటింగ్‌లో ఐదుగురు నగ్నంగా వున్న ఆడవాళ్ళని చిత్రించాడు-కానీ అతని మనస్సులో ఉద్దేశం నావికులు వేశ్యల దగ్గరికి వెళ్ళడం అనే వస్తువు. ఈ పెయింటింగ్ చూసిన కొందరు పికాసో ఆత్మహత్యకి తయారయాడనుకున్నారు-కానీ ఆ చిత్రం చూసిన బ్రాక్ మాత్రం "ఆర్టిస్ట్ కిరోసిన్ తాగేసి నిప్పులు కక్కుతున్నట్టుంది" అన్నాడు-మహానాయకుడి గళంలో ఆవిర్భవించిన మానసరాగం అది. దాంతో క్యూబిసమ్ బాగా వ్యాప్తిలోకొచ్చింది. కళ విచిత్రావస్థలు పడిన సంవత్సరం 1907 (యూరోప్‌లో) అప్పట్లో ఎందరో ఈ చిత్రం నుంచీ చూపులు దాటేశారు-పధ్నాలుగేళ్ళ తర్వాతగానీ ఆ చిత్రం గొప్పతనం తెలీ లేదు ప్రపంచానికి. పికాసో మీద తరువాత ఆఫ్రికన్ కళాప్రభావం పడింది. అప్పుడు ఆయన చిత్రాలను "నీగ్రో పీరియడ్" అన్నారు.

ఈ దశలో పికాసో భావం ఇది-ప వస్తువుని ఒకే కోణంలో చూస్తే అది చాలదు-అనేక కోణాల్లో దాన్ని "చూడగలగాలి" "గ్రహించగలగాలి"-త్రికలో ఓ కొత్త విధానంలో దాన్ని వ్యక్తం చెయ్యాలని అనిపించింది. భౌతికంగా కనిపించే వస్తువునీ, "Useless realism"నీ దాటాలి. అం చేతే క్యూబిజమ్ గూర్చి అంటూ "కమ్మని వాసన లాటిదే అది. నీ ముందునుంచీ, వెనుకనుంచీ, పక్కలనుంచీ, వచ్చే సువాసన ఎక్కడనుంచీ అని తెలీదు." "I Paint objects as I think them, not as I see them" అనీ అన్నాడు. నిర్దుష్టమైన ఒక విషయాన్నీ, భావ ప్రకటననీ చేస్తాయి పికాసో చిత్రాలు-క్రమంగా క్యూబిజమ్ లోంచీ విస్తృతమవుతున్న అతని చిత్రాలు "Paper Collage" విధానంలోకి వచాయి. కత్తిరించిన కాయితాలతో, "Scrape Material" తో నూతన విధానంలో కళాకృతి చేశాడు.



1915 దాకా జరిగిన ఈ ఘట్టం తరువాత మళ్ళీ అతను Pen drawings చేశాడు. అద్భుతమైన రేఖలతో చిత్రరచన చేశాడు- ఇటాలియన్ చిత్రకళాస్రష్టల కోవకి చేరేలా. పికాసో నిర్దుష్ట రూపానికన్నా. నిర్దుష్ట భావాన్నే ప్రధానంగా తీసుకున్నాడు. శిల్పం, వాస్తుశిల్పం, కవిత్వం రాయడంతో సహా నూతన చిత్ర సృష్టి అతనిది.

1937 ఏప్రిల్ 28-స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో సహాయార్థం హిట్లర్ సైన్యం నడిచింది. జన సమ్మర్దంగా వుండే "గుయెర్నికా" టౌన్ మీద మూడు గంటల పాటు బాంబుల వర్షం కురిసింది-జనం కిక్కిరిసిన పనివేళ - కప్పు కూలిన ఇళ్ళ మధ్య జనం భయంకరంగా సమాధి అయ్యారు. అప్పుడు స్పైనిష్ పెవిలియన్‌లో పెద్ద కేన్వాస్ మీద పికాసో తనహృదయ శోకాన్ని, హిట్లర్ పై ద్వేషాన్ని, మానవాహంకార ఫలితాన్ని, బాధనీ, ఒక ప్రపంచార్తినీ చిత్రించాడు- దీని పేరే "గుయెర్నికా." నలుపు, తెలుపు నీడల ఆ సమ్మేళనం భావాన్ని రెండింతలు చేసింది. ఎంతో విమర్శకి నిలబడిన చాలా రోజుల తరువాత ఆ చిత్రం గొప్పతనం తెలిసింది ప్రపంచానికి.

"నా చిత్రాల ద్వారా ఒక రివల్యూషనరీగా పోరాడాను - అది చాలదనీ గ్రహించాను - ఇంత బాధాతప్తమయ సమయంలో నా కళ ద్వారా మాత్రమే గాదు నాతో నే నేను పోరాడాలని తెలుసుకున్నాను." అని రాశాడు. అతని ప్రతిచర్యలెపుడూ మానసికమే, నిర్మాణాత్మకంగా రాజకీయ పరమైనవి కాదు.

కళాకారుడికీ, ఇతరుల లాగే రాజకీయ అభిమాన వాదం వుండచ్చు-ఐతే ఆ నమ్మకాన్ని అతని కళా సృష్టిలో చూపగలిగితే అంతకన్నా ఇంకేం కావాలి?-అనేది పికాసో అభిప్రాయం.

గొప్ప మానవతావాది పికాసో-మానవ ప్రకృతిని తన దృష్టిలో అనేక చిత్రాలలో వ్యక్తం చేశాడు. 93 సంవత్సరాల సంపూర్ణ జీవితం అతనిది—1973లో మరణించాడు.

అనంత నూతన సావిధానం అతని చిత్రకళ!



ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

"భవిష్యత్తు వారిదే"

"నేటి బాలల ద్వారానే రేపటి భారత దేశాన్ని మనం నిర్మిస్తాం" అని నవ భారత నిర్మాత జవహర్లాల్ నెహ్రూ అన్నారు. ఈ మహత్తర ఆదర్శాన్ని పాటిస్తూ మన రాష్ట్రంలో బాలల పరిస్థితులను మెరుగు పరచడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది.

బాలల ప్రతిభను ప్రోత్సహిస్తూ విద్యాయేతర కార్యక్రమాలను అభివృద్ధి పరిచే లక్ష్యంతో 1976 లో బాలల అకాడమిని ఏర్పాటుచేసిన ప్రప్రథమ రాష్ట్రం

ఆంధ్రప్రదేశ్. ఈ లక్ష్యంతోనే ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు.

మన రాష్ట్రంలో 66 బాల్వాడీలున్నాయి. పాఠశాలలకు వెళ్ళే బాల బాలికలకు వినోద కార్యక్రమాలను అందించడానికి వీలుగా 26 బాల విహార్‌లు పని చేస్తున్నాయి.

నిరాశ్రయులు, నిరాధారులు, ఆర్థికంగా వెనుక బడిన తరగతుల బాలల పోషణ నిమిత్తం 55 బాలల సంరక్షణ గృహాలు పనిచేస్తున్నాయి. వాటిలో 5 గృహాలను ప్రత్యేకంగా కుష్టు రోగులైన బాలల నిమిత్తం నిర్వహిస్తున్నారు.

వ్యవసాయ కూలీలకు చెందిన 5 సంవత్సరాల లోపు వయస్సు గల బాలల నిమిత్తం మన రాష్ట్రంలో 138 క్రెచెస్ ఉన్నాయి. వాటిలో 23 క్రెచెస్ ప్రత్యేకంగా గిరిజన బాలల నిమిత్తం ఉద్దేశించ బడినాయి.

మన రాష్ట్రంలో బాలల రోగ నిరోధక చికిత్స, ఆరోగ్య పరిక్ష, సంరక్షణ, సాంప్రదాయేతర విద్య కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం 13 కేంద్ర పరమైన పథకాలు, 9 రాష్ట్ర పరమైన పథకాలను అమలు జరుపుతున్నారు.

బాలల అభివృద్ధి పథకాల నిమిత్తం 1981-82 సంవత్సరంలో రు. 20 లక్షల కేటాయించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో జాతీయ బాలల విధి నిమిత్తం రు. 10 లక్షలు కూడా మంజూరు చేశారు.

ఆంధ్ర ప్రదేశ్ బాలలను ఉత్తమ జాతీయ పౌరులుగా తీర్చి దిద్దడానికి నిరంతరం కృషి జరుగుతోంది.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

నెం. 55. డి. ఐ. పి. ఆర్.

ప్రాణం లేని నీడలు

నాలుగు మూలల రాతి గోడలు నిలిపి
తలుపు బిగించి చీకటిని రగిల్చి,
గాలిలేని, వెలుతురు లేని, నీడలేని,
యీ గదిలో,
కదలలేక మెదలలేక,
ఊపిరి తీయలేక
చెదపట్టిన యెముకలు వంగలేక, విరగలేక,
నీలో ప్రాణశక్తి, దివ్యదీప్తి,
నరనరాల చైతన్యం
రక్త కణాల అరుణ్యం
నీలోనే నివురు గప్పి, పొగచూరి, మ్రగ్గి మ్రగ్గి,
వెదజల్లును అసహ్యపుటావిరులను,
విరులు వడలిరాలు నిస్తబ్దపు కావిరులను.

ప్రతి దినమ్ము, ప్రతి ప్రత్యుష, పవనమ్ము,
ప్రతి నిశీథ తారకల సంభ్రమణ గానమ్ము,
ప్రతి మబ్బు కొస దిగజారి పరుగులిడు మెరపు
ప్రతి పూదావి తరగ
గుహలోని పులి కేక
గుడిలోని జయ యింట
నీ గది చుట్టూ తిరిగి తిరిగి
నీ గది గోడలె తాకి తాకి
నీ కోసం పిలిచి పిలిచి
కరగిపోవును కాలపు శూన్యతలో!
కాని నువ్వు కదలవు, మెదలవు,
నువ్వు కన్నులు తెరవవు, చూడవు,
నువ్వు చీకటివి,
కనుపాప కరిగిన తెల్ల గ్రుడ్డువి,
నువ్వు రోగివి, భోగివి, కదలే శవానివి!
వెడలిపోయిన యుగ యుగాలలో
చచ్చిన పూర్వులు చేసిన శాపనాలు
నీకు తల్లి కడుపులో ఉన్నపుడే సంకెళ్ళయి,
నువ్వు ఊపిరి పీల్చిననాడే ఉరిత్రాడయి,
పగపట్టిన పామై,
కాలపు చీకటి లోయలన్నీ దాటి,
వంశ వంశముల రక్త జలధులు దాటి
నిన్ను తరుముకొని తరుముకొని వస్తే
లొంగిపోయిన లోహితాస్యుడవు!
ముసలి మఱ్ఱిచెట్టు వూడవలె,
శిథిలమైన కోటల గోడవలె,
వదలక, కదలక,
గుండెలలో చుట్టుకుని, నెత్తుటిలో పొదిగికొని,
పెరిగిపోయే కట్టుబాట్ల పాతవస్త్రముల మూట
మోసికొని మోసికొని క్రుంగి క్రుంగి
సంఘు గార్దభం ఓండ్రపెట్టగ
నీవూ నేనూ ప్రతిధ్వనించాం!
నీవూ నేనూ ప్రతిబింబించాం!
అపు నీలో నాలో నడుము విరిగి నిలిచింది ప్రాణశక్తి!

నీ భవిష్యత్తు కోనేరుగా,
నీ ఆశలు తెల్లని బాతులుగా,
ఊహించిన హృదంతర దృగంతర దివ్యత్వం
నీ పిరికి తనపు వాగురలో చిక్కి,
నీ జడత్వపు ధూళిలో నవసి
నశిస్తుంది - నువ్వు
జనన మరణాల మధ్య గంతువేసే
కీలు బొమ్మవై వసింపగ!
ఇంత హింస, పోరులేని బాధ,
చూపు కొసల నటించు పైశాచిక ద్వేషము,
నిన్ను కదలనివ్వని బెదరు, లోలోన
వెగటు ధూళి క్రమ్మిన మనస్సు,
ఆకసపు నీలి అంచుల పిలుపు వినలేని బధిరత
దశ దిశల యేడ్పు అవ్యక్తగళ సహస్రములు

ముసురుకొన్న యీగల తోలలేని
వ్రణము
ఏ తల్లి ఉసురు, ఏ క్షుధా శాపము,
ఏ నొసట చిటికిన వెలుగుల కలవరింత,
ఈ అశాంతి, ఈ శిథిలపరచలేని మంట
ఏ భూమి కడుపు పగిలి పొరలిన పొగల
పంట
ఏ మహోత్పాత సూచనాసృగాల
రవముకో,
ఏ శాంతి దేవతావసనమంటుకొన్న
ఆర్తి ధ్వానమొ
ఏదీ నీ జవాబు,
ఏదీ నీ జవాబు!

అవధి లేనిదీ కాలము
రహస్యమీ మహా విశ్వము,
స్వేచ్ఛతో నీపైన అవకాశములో పరి
భ్రమించే
అనంత అనంత తారకా గోళముల
సందేశం,
ప్రతిరాత్రి చీకటులను చంపి
నవ్యమై, దుర్నిరీక్ష్యమై వెలిగే
సూర్య గోళపు తిరుగుబాటు
కోన కోనకీ పూవై, పూవు పూవుకీ,
తావై,
జలధి జలధికీ తరంగమై,
అవని అవనికీ పొరయై,
అవధిలేని అవధులకు అవధియై
రేణువులో యిమిడిన ఆ మహాప్రాణ
శక్తి

వేణువై పలికిన
సర్వతోముఖ వికాస విద్యుద్గానం
పొర పగిలిన నీ శ్రవోరంధ్రములకు
వృథా వృథా!
సుడి తిరిగే నీ అంధత్వానికి వృథా
వృథా

యుగ యుగాల చరిత్రకు,
తర తరాల పరిశ్రమకు
పోరులేని బాధలుగా
నిశ్శబ్దపు పాటలుగా
నిలిచిన ఆ వయోవృద్ధ శుభవత్ హిమవత్
పర్వత పంక్తులని అడుగు!
ఆ పర్వతపు మెదటి రాయి
అనాది జనాదులకు చొచ్చుకొని
జీవితపు పునాది స్వతంత్రమని
ప్రవహించు మహాప్రవాహమని,
దగద్ధగ ధావళ్య ధైర్యైకరోచిస్సు అని,
చెప్పుతుంది తన శాంత గభీర
నీరవ గళత్తు పొర కణజాల నోద్రిక్త
గళముతో!

కాని నేడు,
కరుణ లేక, కన్నీరు లేక
జలము లేక, కన్నీరు లేక,
నీలోన నాలోన
నైరాశ్య నైదాఘ అగ్నికీల లెగసిపడ,
ఎండ మండు దేహములతో,
పిడచగట్టు నాలుకలతో,
ఎడారి అంచుల నానుకుని
మన బ్రతుకు లంటుకని,
గాలి ధూళి నెగురు కాగితపు పేలికలమై,
చావలేక, బ్రతకలేక,
అనంతమును కౌగిలించిన ప్రేమ
బాహువులు నరుకబడ,
అంతరాంతర శుక వచస్సు వినలేక
నిస్సహాయత ఎదురు తిరగలేక,
మంటలు పొందగలేక,
చిన్నగను నవ్వలేక, కొరకంచులు విసరలేక,
గాలిలేని, నీడలేని, వెలుతురు లేని యీ
గదిలో
కదలలేక, మెదల లేక,
చెదపట్టిన యెముకలు వంగలేక,
బ్రతుకుతు ప్రాణం, చప్పుళ్ళను చేస్తూ
ఎంగుటాకుల గల గలలటు,
కుష్ఠు రోగుల మూలుగులటు.

("నవ్యాలోకము" కవితా సంకలనం
లోంచి—సేకరణ— ప. సూర్యప్రకాశ్)

కీ॥ శే॥ దేవరకొండ బాలగంగాధర తిలక్

వేలం

కాటూరి రవీంద్ర – త్రివిక్రమ్

"అన్నీ సిద్ధంగా ఉంచావ్ కదూ?" హడావిడిగా ప్రవేశిస్తూ అడిగేడు రామనాథం.

"ఉంచాను సార్" వినయంగా చెప్పాడు బాబూరావ్.

గదిలోకి వెళ్లి స్వయంగా చూశాడు రామనాథం.

మిల మిల మెరుస్తున్న గుండ్రని టేబుల్ మీద రెండు విస్కీసీసాలూ, గ్లాసులూ నిరీక్షణలో ఉన్నాయి.

గదంతా నీట్‌గా, ఎమల్షన్ రంగులు గోడలకి అలంకారాలుగా, తైలవర్ణ చిత్రాల్లో ఉన్న ప్రకృతి దృశ్యాలతో చూడగానే ఆకట్టుకుంటోంది.

నాలుగడుగులు వేసి, 'డోర్ నాబ్' త్రిప్పి, కొద్దిగా తలుపు తెరిచి, అవతలి గదిలోకి తొంగి చూశాడు. శోభనం గదికి 'నమూనా'లా ఉంది. లోపల – డబ్బుకి దొరికే అందం సీరియస్‌గా సినిమా పత్రిక చదువుకుంటూ, రామనాథం రాక గమనించి చప్పున లేవబోయింది. మందహాసంతో వారించి, "బీ కంఫర్టబుల్" అని మళ్లీ తలుపు దగ్గరగా లాగి ఇవతలికి వచ్చేశాడు.

మళ్లీ నాలుగు మూలలా చూసి, తృప్తిగా నిట్టూర్చాడు

ఈ మధ్యనే కొన్న ఎలక్ట్రానిక్ వాచ్ అది. సెకన్లతో సహా టైము చూపిస్తుంది.

"టెన్ మినిట్స్, ఫార్టీ సెకండ్స్ మోర్" తనలో తను గొణుక్కున్నాడు.

ఓ మాటు కిటికీలోంచి వీధిలోకి తొంగి చూశాడు. ట్రాఫిక్ పెద్దగ లేదు.

అస్థిమితంగా గదిలో అటు, యిటు పచార్లు మొదలెట్టాడు.

గది మధ్యలో ఆగి "బాబూరావ్..." అని పిలిచాడు.

బీడీ గిరవాటేసి గబ గబ లోపలికొస్తూ "పిలిచారాసార్?" అనడిగేడు వినయంగా, బాబూరావ్.

"అన్నట్టు పొద్దున నేను బయట కెళ్తుంటే ఏదో అడగబోతూ ఆగిపోయావ్... తర్వాత చెప్తానన్నావ్ ఏమిటది?" అన్నాడు గుర్తు చేసుకుంటూ.

బాబూరావ్ ఒక్కక్షణం తబ్బిబ్బయ్యాడు.

"అదీ....అదీ...."

"చెప్పు ఫర్వాలేదు" సిగరెట్‌ని లైటర్‌తో వెలిగించుకుంటూ అడిగేడు రామనాథం

అంతలో టెలిఫోన్ గణ గణ మ్రోగింది.

రిసీవర్ అందుకుని మాట్లాడేడు.

ఫోను పెట్టేసి వస్తూ "కుర్చీ అలా అరుబయట వెయ్యి....రావాల్సిన మనిషి ఒక అరగంట ఆలస్యంగా వస్తాడట...." అన్నాడు.

కుర్చీ బయట వేసాడు బాబూరావ్.

చల్లటిగాలి వీస్తోంది.

కుర్చీలో కూర్చుని "ఊఁ....చెప్పు"



అన్నాడు.

చేతులు నులుముకుంటూ "మరేం లేదు బాబూ. నా ఇల్లు తాకట్టులో ఉంది. ఇయాలో రేపో ఏలం ఏసేలా ఉన్నారు" అని ఆగిపోయాడు.

'వేలం'—రామనాథానికి నవ్వొచ్చింది. ప్రస్తుతం తన పరిస్థితీ అలాగే ఉంది. తను చేసిన కంట్రాక్టుల్లో ఇంత పెద్ద

దెబ్బ ఎప్పుడూ తినలేదు. ఒకటా రెండా యాభై లక్షల పని! గ్యారంటీ పైము దాటకముందే కొంత కూలిపోయింది. అప్పటికీ అతి శ్వరగా రిపేరువర్కు చేయించాడు.

కానీ—పత్రికలు ఊరుకుంటాయా!

ఫోటోలతో సహా ప్రచారం జరిగిపోయింది.

విషయం అసెంబ్లీ దాకా పాకిపోయింది! ప్రతిపక్షాలు బల్లలు విరగ్గొట్టినంత హడావిడి చేసి ప్రభుత్వం చేత స్పెషల్ కమిటీ వేయించారు. ఆ కమిటీ కూడా వన్-మెంబర్‌ది కావటం గుడ్డిలో మెల్ల. ఆ వచ్చే ప్రభువు గురించి ఆరాలు తీసాడు.

ధన మూలం ఇదమ్ జగత్!

'మందు చూపు'కూడా ఉన్నవాడేట.

'పిల్లగాలి'కి పరవశించక పోడట.

అయితే—ఎక్కడా పిసరంత పొరబాటు కూడా రాకూడదట. వచ్చిందో దూర్వాసుడి అవతారమేనట.

ఆ సంగతి విన్న తర్వాత కూడగట్టుకున్న ధైర్యం మళ్లీ జారిపోసాగింది ఈ గండం గడిచి బయట పడితే, ఇక కంట్రాక్టుల జోలికి పోకూడదని ఒట్టేసుకున్నాడు. వచ్చినదాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్‌గా పడేసి, ఆ వచ్చిన వడ్డీ డబ్బుల్తో కాలక్షేపం చెయ్యటం మంచిదిగా తోస్తోంది.

కంట్రాక్టర్లు కోటీశ్వరులయిపోతున్నారని గోలే తప్పితే, ఎదిగే డబ్బుతో బాటు ఎన్నెన్ని సమస్యలు! చివరకి బిల్లులు రాసే గుమాస్తాకి కూడా లోకువగా పడి ఉండాలి. అతన్ని కూడా 'కాకా' పట్టాలి. ఎన్నో స్థాయిల్లో ప్రజ్వలించే ధనదాహానికి నోట్ల నైవేద్యం పెట్టాలి.

ఇన్ని చేశాక ఇంక మిగిలేదేముంటుంది? మిగుల్చుకునేందుకేముంటుంది?

అందుకే కట్టినవి కూలి పోవటం.

అవి కూలుతూ, కంట్రాక్టరు జనం దృష్టిలో హంతకుడంత దుర్మార్గుడై పోతాడు. ప్రజాద్రోహి—దేశద్రోహిలాంటి బిరుదులు పొందుతాడు. ప్రజాధన దుర్వినియోగ యజ్ఞంలో ఋత్విక్కులు కంట్రాక్టర్లు మాత్రమే కాదన్న సత్యం చేసుకోగల వాళ్లెందరు?

"బాబూ...."

రామనాథం ఉలిక్కిపడి తేరుకున్నాడు.

"బయట కారాగింది."

రామనాథం ఆదరా బాదరా పరుగు తీసాడు.

"రండిసార్ రండి...." చక్రవర్తి ముందు సామంత రాజులా స్వాగతం చెబుతూ లోపలికి తీసుకు వచ్చాడు.

"రండిసార్....ఇలా కూర్చోండి...."

చక్రవర్తి కూర్చున్నాడు. (కాకతాళీయంగా అతని పేరు కూడా అదే!)

బాబూరావ్ విశేషానుభవం గల వ్యక్తి గనుక, సునాయాసంగా తనపని చేసుకు పోతున్నాడు.

ఆవిర్లు చిమ్ముతున్న జింజర్ చికెన్.... ఎక్స్‌ట్రా.... ఎక్స్‌ట్రా.... అందంగా టేబుల్ మీద పరుచుకుని ఉన్నాయి.

"మనిద్దరమేనా?" అసంతృప్తిగా అడిగాడు చక్రవర్తి.

"నోసర్ ....మరో కంపెనీఉంది" వినయంగా జవాబు చెప్పి, సాభిప్రాయంగా బాబూరావ్ కేసి చూశాడు. వెంటనే తెల్ల మల్లెలా ఉన్న పిల్లని పిలుచు కొచ్చేందుకు తూనీగలా వెళ్లాడు.

ఆ పిల్లరావటం చూస్తూనే చక్రవర్తి బిగుసుకు పోయాడు.

చేతిలోంచి 'స్పూన్' జారి ప్లేట్‌లో పడి శబ్దం చేసింది.

"చరితా...నువ్వా?!" అప్రయత్నంగా అనేసాడు చక్రవర్తి.

"చక్రీ నువ్వా!"—ఆమె మంచు పగల గొడుతున్నట్లు మాట్లాడింది.

రామనాథం, బాబూరావ్ హైక్లాసు సినిమా చూస్తున్న లోక్లాసు ప్రేక్షకుల్లా అయోమయంగా ఉండిపోయారు.

"లీవ్ అజ్ ఎలోన్ ఇఫ్ యూ డోంట్ మైండ్" చక్రవర్తి ఆ మాటనగానే

చటుక్కున లేచి "ప్లీజ్...."అంటూ తప్పుకున్నాడు రామనాథం.

"నన్ను కూడా వెళ్లమంటారా?" వినయంగా అడిగాడు బాబూరావ్.

"యస్" అన్నాడు గంభీరంగా.

వద్దన కవసరమైనవన్నీ అందుబాటులో ఉంచి, తలుపులు దగ్గరగాలాగి వెళ్లిపోయాడు బాబూరావ్.

'లాన్'లో అస్థిమితంగా పచార్లు చేస్తున్నాడు రామనాథం.

బాబూరావ్ రాగానే "ఇదెక్కడి గొడవ?" అన్నాడు చిరాగ్గా.

"అదే నాకూ అర్థం కావటం లేదండీ! హైక్లాసు సరుకంటే నాగయ్య గారడిగిన అయిదొందలకీ సరేనన్నాను. మీకు ముందుగా చెప్పాను కదా?" చేతులు నలుపుకుంటున్నాడు బాబూరావ్.

అరచేతిలో పిడికిలి బిగించి గుద్దుకో సాగేడు రామనాథం.

బి. పి. ఎగదన్నినట్లు మొహం జేవురించింది.

'టెన్షన్' మంచిది కాదని డాక్టరు హెచ్చరించాడు తనని.

ఈ కేసు 'సక్సెస్' కాకపోతే, తనకి 'హార్ట్ఎటాక్' వచ్చినా విడ్డూరం లేదు.

గాడ్....ఏమిటీ వెధవ జీవితం.

ఎన్నెన్ని సమస్యలు....

చక్రవర్తి, సోకాల్డ్ చరిత, బంధువులా, పాత పరిచయస్థులా....చరిత ఇలాంటి విషవలయంలో ఎలా చిక్కుకుంది? నాగయ్య పట్టే కేసులన్నీ చాలా పెద్దవి. రాజకీయంగా అతని పలుకుబడి కూడా అద్భుతం! అతను 'సప్లయ్' చేసే సరుకులంత గొప్పవిమరి!

'చరితని'—నాగయ్య ట్రాప్ చేసి ఉంటాడా?

కథల్లో మాదిరి నానా హింసలూ పెట్టి దార్లోకి తెచ్చిఉంటాడా?

లేకపోతే బీదరికం భరించలేక చరిత తనకు తానే యీ ఊబిలోకి గెంతిందా?

ఏది అసలు కథ?

ఎవరు చెబుతారు! నాగయ్య నడిగి ప్రయోజనంలేదు. ఇవన్నీ అతని ట్రేడ్ సీక్రెట్స్! పూర్వం "ఏరా నాగయ్యా" అనేవాళ్లు సైతం ఇప్పుడు "నాగయ్యగారూ" అనక తప్పటంలేదు, అతని హోదా, డబ్బూ అలా పెరిగిపోయాయి మరి.

కొంపదీసి చక్రవర్తి, అతనికెంతో ప్రియమైన చరితని పతిత రూపంలో వెలయాలుగా నిలబెట్టినందుకు తనమీద పగ బట్టడు కదా?

అదే జరిగితే తను మసి అయిపోయినట్లే!

బాబూరావ్ కూడా మనసులో నలిగిపోతున్నాడు. 'అయ్యగారి పనయితే బావుణ్ణు...తనిల్లు వేలంకాకుండా నిలబడుతుంది....ఇల్లువేలం అయిపోతే తనూ, తన పెళ్ళాం పిల్లలూ ఏమైపోవాలి? ఏం జరుగుద్దోమరి' వాడికి పిచ్చెత్తినట్లవుతోంది.

చరిత, చక్రవర్తి ఓ గంట గడిచాక బయట కొచ్చారు.

రామనాథం వాళ్ళని ఆతురతగా పరామర్శించాడు.

"థాంక్యూ వెరీమచ్ ఫర్ ది నైస్ డిన్నర్! సీమీ టుమారో...." కార్లో చరితని ఎక్కించుకుని వేగంగా దూసుకు పోయాడు చక్రవర్తి.

"ఈ రాత్రంతా సస్పెన్సుతో బాధపడాలి కాబోలు...." నిట్టూరుస్తూ అనుకున్నాడు రామనాథం.

"బాబూరావ్! తలుపులు జాగ్రత్తగా వేసుకో.... నేను వెళ్తున్నా" నీరసంగా

కారువైపు నడిచాడు రామనాథం.

ం ం ం

సమయం మూడు కాబోతోంది.

రామనాథం అసహనంగా గడియారం కేసీ, వీధి కేసీ చూడసాగాడు.

"ఏమైంది బాబూరావ్ కివ్వాళ?" ఎప్పుడూ నిముషాలతో సహా కరక్టుగా టైముకి వచ్చేవాడు...." తనలోతను మథన పడసాగాడు.

నిరీక్షణ అతని సహనాన్ని పూర్తిగా హరించాక వచ్చాడు బాబూరావ్,

అదికూడా – మనిషి అదోలా, వ్యాధి పీడితునిలా, కలలో నడుస్తున్నట్టు....

రామనాథం ఆవేశంగా పెద్ద పెద్ద కేకలు వేశాడు.

చెవిటివాడిలాగా నిలబడి అంతా మౌనంగా విన్నాడు బాబూరావ్.

మాటల్లో రామనాథం పని అనుకూలంగా అయినట్లు, చక్రవర్తికి చెయ్యాల్సిన మర్యాదలకి తన ఆలస్యం వల్ల ఇబ్బందికలిగినట్లు అర్థమయింది బాబూరావ్ కి. చివరికి విరక్తిగా నవ్వి, "బాబూ తమరిల్లు నిలబడింది. నాకొంప యాలం అయిపోయింది. సమయానికి అయిదొందల్రూపాయలిస్తే నేను ఒడ్డున పడేవోణ్ణి. కూలివాడికష్టం తెలియని దొరల దగ్గర నౌకరీ చేసే కంటే ఆకలితో మాడి చావటం మేలు. మీ లచ్చలు మీరే ఉంచుకోండి. నా పిల్లలు చెట్టుకింద నిలబడి నాకోసం చూస్తున్నారు. నే వస్తా బాబూ. మాట మాత్రం చెప్పలేదను కుంటారని వచ్చా.... మళ్ళీ నాకోసం కబురెట్టకండి... మీరు కబురంపినా నే వచ్చేది లేదు...."

రామనాథం రాయిలా అలాగే నిలబడి అంతకంతకూ దూరమవుతున్న బాబూరావ్ కేసి చూస్తుండి పోయాడు.


"శ్రీశ్రీ కవిత్వం"పై
రామకృష్ణ సిద్ధాంత గ్రంథం

డాక్టర్ మిరియాల రామకృష్ణ విమరన్యాత్మకంగా వ్యాఖ్యానించిన "శ్రీశ్రీ కవిత్వం : వస్తువు, సంవిధానం" (1926-47) 642 పే. 1/4 క్రౌన్ సైజు. వెల : అరవై రూపాయలు. ప్రతులకు : శ్రీమతి ఎం. లక్ష్మీదేవి, 10-4-23 రామారావుపేట, కాకినాడ-533004.

సందేశమూ సంవిధానమూ పరస్పరాశ్రితాలు; అవిభాజ్యాలు. సంవిధాన చాతుర్యం లేని సందేశం చప్పగావుంటుంది. సందేశంలేని సంవిధాన చాతుర్యం నేల విడిచిన సాము. ఆధునిక యుగంలో యీ రెండింటిలో సందేశానికే అధిక ప్రాధాన్యం యిచ్చారు అగ్రశ్రేణి కవులు. ఈనాడు కవిత్వం రాస్తున్న యువ కవులు కూడా యీవైపే మొగ్గివున్నారు.

శ్రీశ్రీ అనే సముద్రాన్ని యీద బూనడం సాహసమే! ఈ సాహసానికి ఉపక్రమించి తుఫానులకు చలించకుండా, సుడి గుండాల్లో చిక్కుకోకుండా నావను నేర్పుగా అవలి ఒడ్డుకు చేర్చారు డా. మిరియాల రామకృష్ణ. దీనివల్ల ఆయనకు వ్యక్తిగతంగా డాక్టరేట్ లాభం రావడం అనేది చాలా స్వల్పవిషయం. కాని తెలుగు సాహితీ జగత్తుకు మహోపకారం జరిగింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో అస్మదాదులైన అభ్యుదయ కవులు ఎవరికి తోచిన రీతిలో వారు శ్రీశ్రీ రచనలకు వ్యాఖ్యలు చేయకపోలేదు, ప్రసంగాలలోనో, వ్యాసాల్లోనో! అవన్నీ ఒక ఎత్తు; డా. రామకృష్ణ ప్రయత్నం ఒక ఎత్తు. దాని మీదనే మనస్సును లగ్నంచేసి ఒకానొక శాస్త్రీయ దృష్టితో ఒక పద్ధతిలో

కొత్త పుస్తకంతో కొంతసేపు



చేసిన యీప్రయత్నానికి విలువ ఎక్కువగా వుండడం సహజం.

ప్రతి కవీ ముందు కళాకారుడూ, తరువాత సందేశదాత అనే విశ్వాసం పాతకాలానికి చెందినదని నే ననుకుంటాను. కళా ప్రతిభ పూర్వజన్మ సంస్కారం వలన కలుగుతుందనే నమ్మకంతో యిది ముడి పడి వుంది. కవి కాదలచినవాడు ముందుగా తను చెప్పదలచిన విషయాన్ని నిర్ణయించుకుని, దానిని తనకు చేతనైనంత రమ్యంగా చెప్పడానికి ప్రయత్నిస్తాడు. అభ్యాసంవల్ల యీ చెప్పే తీరు మెరుగులు దిద్దుకుంటుంది. ఈ మెరుగు రావడంలోగల తారతమ్యాలు మానవ జీవితంలో వ్యక్తికీ వ్యక్తికీమధ్య ప్రతి విషయంలో వుండే తారతమ్యాల వంటివే! అందువల్లనే సందేశానికి ప్రాధాన్యం. ఆధునిక ఆదికవి శ్రీశ్రీ నుండే కాదు; అసలు ఆదికవి వాల్మీకినుండి కూడా యిదే కావ్య ధర్మము.

సంప్రదాయ సాహితీ రీతుల్ని ఆపోశన పట్టిన మొదటి శ్రీశ్రీ నుండి సామాజిక స్పృహావేశ మహాకవితోద్యమ స్థాపకుడైన కొత్త శ్రీశ్రీ ఏ విధంగా పుట్టుకువచ్చిందీ డా. మిరియాల రామకృష్ణ సంపూర్ణంగా వివరించారు. ఆనాటి శ్రీశ్రీని ఎరుగని నేటి యువతరానికి డా. రామకృష్ణ సిద్ధాంత వ్యాసం ఎంతో ఉపకరిస్తుంది!

(ఈ బృహద్గ్రంథంలో 82 ప్రకరణాలున్నాయి. శ్రీశ్రీ గారి ఒక్కో కవితా ఒక్కో ప్రకరణంలో మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించబడింది. విశ్వవిద్యాలయానికి డిగ్రీ కోసం సమర్పింపబడిన గ్రంథాన్ని సులభ వ్యావహారికంలోకి మార్చి తిరిగిరాసి ప్రచురించారు గ్రంథకర్త. శ్రీశ్రీ షష్ఠిపూర్తి సందర్భంగా ప్రచురించబడిన ఈ గ్రంథానికి ముందువైపు బాపు చిత్రమూ వెనకవైపు ఎన్. శివన్నారాయణ తీసిన శ్రీశ్రీ ఫొటో అలంకారాలు.)

— కుందుర్తి

సీరియల్

సౌభాగ్యలత

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రామశాస్త్రి

(జరిగిన కథ)

శ్రీమంత్ అటు ఆఫీస్‌కి వెళ్ళగానే ఇటు వకుళ ఇంటికి వెళ్ళింది తల్లిని చూడటానికి. పెళ్ళి వ్యవహారం గొడవతో వంటింట్లో తల్లి పడుతున్న అవస్థ చూసి వకుళ జాలిపడింది. కానీ తల్లి తన అక్కమీద వున్న ప్రేమ కొంచెం కూడా తన మీద చూపలేక పోయినందుకు బాధ పడింది వకుళ-అవమాన పడింది తల్లి చేత. తన కోసం కొన్న భారీ సామానంతా చూపించింది శశిరేఖ వకుళకి-అంతా ఖర్చు పెడితే తండ్రి ఏమీ మిగలదని బాధపడిన వకుళ శశిరేఖ చేత అవమాన పడింది. ఇంట్లో కుదర తప్పించి ఫ్రిజ్ లేదని దానంగా ఇచ్చినట్టు ఫ్రిజ్ తీసుకెళ్ళమంది. అభిమానంతో దాన్ని తిరస్కరించింది వకుళ. తండ్రి ఎంతో సంతోషించాడు.

సరిగ్గా అతడే వచ్చి అంతా విన్నాడు శ్రీమంత్-ఏదో నెపంతో వకుళని వెంట తీసుకు వెళ్ళాడు. ఇద్దరూ దగ్గరవుతున్నారు....

——ఇక చదవండి——

"ఎదర కూర్చోండి, ఇద్దరూ ఒకచోట కూర్చోండి" అంటూ అటలు పట్టించి ఎదుటి సీటులో కూర్చుండ జేశారు.

బస్సుకు బాగా వెనుక భాగంలో టేప్ రికార్డర్ ఆన్ చేసి నలుగురు యువకులు రాకెన్ రోల్ నృత్యం అతి ధోరణిలో చేస్తున్నారు. కొందరు ఆ దృశ్యాన్ని చూచి ఆనందించుతున్నారు. మరి కొందరు ఏదో కబుర్ల కాలక్షేపంలో మునిగి వున్నారు.

ఒక ఇంజనీరు భార్య భుజం చుట్టూ చేయివేసి యేమేమో చెప్పి నవ్విస్తున్నాడు. వెనుక సీటులోని యువతి ఏదో హాస్యం చేయడంతో ఇద్దరూ మాటలు మాని సిగ్గుతో తలలు వాల్చుకున్నారు.

"అరె! మీకంటె క్రొత్త జంట—చూడండి శ్రీమంత్‌నూ అతడి శ్రీమతినీ, ఎంత బుద్ధిగా కూర్చున్నారో!" అన్నదా యువతి మరలా.

అందరి దృష్టి ఇటు తిరిగింది. నవ్వులు మిన్నంటాయి,

"చాలా బుద్ధిమంతురాలోయ్ నీ శ్రీమతి. ఇంట్లోనూ ఇలాగే వుంటుందా? అసలు మీరు మాట్లాడుకుంటారా?"

పరిహాసం చేశాడు యాభై ఏళ్ళ ఆఫీసర్.

"అబ్బో, ఇంత నోట్లో నాలుక లేకపోతే లాభం లేదమ్మాయ్, ఈ కాలపు మగాళ్ళు ఘటికులు" అన్నదొకావిడ.

"మరే, అపుడపుడు ఈవిడ అతివాగుడూ, సతాయింపూ భరించలేక నేను క్లబ్బు శరణు పొందుతుంటాను," అన్నడామె భర్త.

ఎందరెంత కవ్వించినా శ్రీమంత్ గంభీర ముద్ర చెదరలేదు, పెదవులపై చిరుహాసం మాయలేదు.

వకుళ మాత్రం సిగ్గుతో ముడుచుకు పోయింది.

"అందరూ ఎంత హాయిగా వున్నారు. సరస సల్లాపాలతో, హాస ప్రతి హాసాలతో ఎంత ఉల్లాసంగా, నిశ్చింతగా వున్నారు! నేనూ ఇలా వుండగలనా ఎప్పటికైనా?"

బస్సు గమ్యస్థానం చేరింది.

అది ఒక అందమైన తోట.

అందరిలో ఆనందోత్సాహాలు యినుమడించాయి.

ఆ అందరినీ ఇది రెండవసారి చూడటం గనుక వకుళ కొద్దిసేపటి లోనే కొందరితో బిడియం వదలి సంభాషించ సాగింది.

శ్రీమంత్‌ను కొందరు పేకాటకు ఆహ్వానించారు.

"అంత ప్రవేశం లేదు నాకు" తప్పుకో జూచాడు.

"పర్వాలేదు. ఆడితే అదే ప్రావీణ్యం సంతరించుకోవచ్చు."

"ఊఁహుఁ"

"పోనీ ఋష్య శృంగులుగారూ, మాకు పాక శాస్త్రంలో సహాయం చేయరాదూ?" అంటూ మరో జట్టు వారు ఆహ్వానించారు.

"ఓకే. అలా అన్నారు, బాగుంది."

"పూర్తిగా మీపాకమైతే తినగలమో లేదో—మేమూ సాయం చేస్తాం" అంటూ చీర కొంగులు త్రిప్పి దోపుతూ స్త్రీలు కూడా అక్కడ చేరారు, వారిలో వకుళ కూడా వున్నది.

"వద్దు వద్దు," అన్నారు మగవారు,

"అయ్యో, మరీ అంత మర్యాద అక్కరలేదులెండి. ఇళ్ళల్లో చేసుకునే వాళ్ళమేగా? అదుగో—పని అక్కరలేని మహారాణులు మగరాయుళ్ళతో సరిగా పేకాటల్లో పడ్డారు," అన్నది ఒకామె నిష్కర్షగా.

"పోనీయండి. అటువంటి మాటలు కలహాలకు దారి తీయగలవు, రండి, మీరు ఉత్సాహంగా చేస్తామంటే మాకేం? హాయిగా తింటాం కూర్చుని." అన్నాడు ఒకతడు,

అందరూ ఉల్లాసంగా, హాస్యోక్తులతో, నవ్వుతూ త్రుళ్ళుతూ అలుపే ఎరగకుండా పనులు చేస్తున్నారు.

"అదేమిటోయ్ శ్రీమంత్! కొత్త పెళ్ళి కూతురి చేత అపుడే పనులు చేయించుతున్నావు?"

ఎవరో అంటూన్న చతురోక్తికి చటుక్కున తల ఎత్తి వకుళ వైపు చూచాడు శ్రీమంత్, అంతలో అతని కనులు దూరాన ఏదో దృశ్యం కన్పించినట్లు తదేక పరిశీలనతో

చి పోయాయి.

అప్రయత్నంగా తలఎత్తిన వకుళ శ్రీమంత్ దృష్టి నాకర్షించినది ఏమైవుంటుందా అని తానూ అటు చూపులు సారించింది.

మహేష్!

దర్జాగా ఫుల్ సూటులో కారు దిగుతున్నాడు.

తన సాటివారితో పేకాటలో నిమగ్నుడై వున్న ప్రాజెక్టు మానేజర్ గబగబాలేచి ఎదురేగి, అతడి డ్రైవర్ కంటె ముందు తానే ఆ కారు డోర్ తెరచి పట్టుకున్నాడు.

మహేష్, అతడూ కరచాలనం చేసుకున్నారు. అందరికీ దూరంగా నడిచి అటు యిటు పచార్లు చేస్తూ యేమేమో మాటలాడుకున్నారు.

ఈలోగా డ్రైవర్ కారు డిక్కీలో నుండి రెండు పెద్దసైజు ఒరువైన అట్టపెట్టెలు భద్రంగా దించాడు.

ఇక్కడ శ్రీమంత్ చుట్టూవున్న చూపరులలో గుసగుసలు ప్రారంభమైనాయి.

"ఫారిన్ సరుకు దిగినట్లుంది మళ్ళీ—తెచ్చాడు గురుడు. ఓ నెల రోజులు వరసగా ఇక, అందులోనే స్నానాలు మన మగాళ్ళందరూ."

ఒకతడు ఈల వేశాడు సన్నగా.

"అర్థమైంది. మళ్ళీ మన ప్రాజెక్టులో ఏదో ఓ సెక్షన్ పనికి కంట్రాక్టర్లను పిలుస్తారన్న మాట?"

"ష్యూర్! సందేహమా? ఇంటర్నల్ పైప్ వెల్డింగ్ కోసం పిలుస్తారు, పైప్ సప్లయికి కూడా పిలవాలి!

"అంతేకాదు, మన కాంటీన్ మానేజ్‌మెంటుకు కూడా టెండర్లు అప్లయి చేయమని రేపటి పేపర్లో ఇస్తున్నారు అడ్వర్‌టైజ్‌మెంట్."

"ఆఁ! అదంతా నామకార్థం, అన్ని టెండర్ల కంటె తక్కువ కొటేషన్ మానేజర్‌కు యిష్టమైన వాడిదే ఔతుంది. అందులో చిదంబర రహస్యం ఓ క్విజ్!"

"క్విజ్జూ కాదు, పజిలూ కాదు. ఇవి ఈ రోజుల్లో అందరికూ తెలిసిన తమాషాలేగా. సీల్డు కవర్లు కూడ తెరచుకుంటాయి, మూసుకుంటాయి. కంట్రాక్ట్ ఎవరికి దక్కాలో వారి టెండర్ ఎప్పుడూ తీరిగ్గా, దొడ్డి దారినే వస్తుంది. దీని భావమేమి తిరుమలేశా?"

"ఆమాత్రం తెలియదా శ్రీనివాసా? ఈ కంట్రాక్టు ముగిసే సరికి-లేదా ముగిసే లోపలే ఆఫీసరు గారింట్లో ఓ అమ్మాయి పెళ్ళి అతి వైభవోపేతంగా గొప్ప కట్నకానుకలతో జరుగుతుంది, అటు కంట్రాక్టర్ గారి పేర మరో దేవేంద్ర భవనమో, నాలుగెకరాల మాగాణియో వెలుస్తుంది!"

అన్నీ జాగ్రత్తగా వింటున్నాడు శ్రీమంత్.

అంతలో ఆ యిరువురూ అటే రావడంతో అందరూ మాటలు మాని బుద్ధిగా తలలు వంచి పనులు చూచుకోసాగారు.

రెండడుగులు ముందుకు సాగినవోయిన వాడే మహేష్-మరలా వెనక్కు వచ్చాడు. నోటిలోని సిగరెట్ సవిలాసంగా ఓ ప్రక్కకు తోసి, "హల్లో! శ్రీమంత్" అన్నాడు.

"హల్లో" ముక్తసరిగా వుంది శ్రీమంత్ జవాబు.

"ముందు గుర్తుపట్టనేలేదు సుమా నేను. కమాన్! ఏమిటి ఆడ పనులు నీకు?"

ఆ మాటలకు కొందరు బాధ వడవచ్చు.

అందుకే శ్రీమంత్ యిబ్బందిగా అందరి కేసి చూసాడు. అయితే ఎదుట ప్రాజెక్ట్ మానేజర్ కూడా వుండడంతో అందరి ముఖాలు తమతమ పనులపై కేంద్రీకరింప బడే

వున్నాయి.

అక్కడ మరి త మాటల కవకాశం ఈయడం ఇష్టం లేని శ్రీమంత్ అయిష్టంగానే లేచి వచ్చాడు.

ముగ్గురూ మెల్లగా నడుస్తూ అందరికీ దూరంగా వెళ్ళారు.

"మా తోడల్లుడు" అంటూ ప్రాజెక్ట్ మానేజర్‌కు పరిచయం చేశాడు.

"ఓ!" అతడు విపరీతాశ్చర్యం ప్రకటించుతూ చూచి "నీకు పెండ్లి కాలేదనుకుంటాను మహేష్?" అనడిగాడు.

బిగ్గరగా నవ్వేశాడు మహేష్,

"కాబోతూన్నది కొద్ది రోజులలో, నీకెప్పుడూ చెప్పలేదు కదూ కుమార్? మా మరదలిదీ ఇతనిదీ లవ్ మారేజ్ లే, అంచేత వాళ్ళ వివాహం ముందు చేసేయాల్సి వచ్చింది."

"ఐసీ!" కుమార్ ఆలోచించుతూ అన్నాడు

శ్రీమంత్ పెండ్లి జరిగి పోయాక మాకు తెలిసింది, మమ్మల్ని పిలవనేలేదు."

"ఎవ్వర్నీ పిలవలేదు. ఆతడు చాలా 'ప్రిన్స్‌పుల్డ్ మాన్'లే కుమార్, ఇంకా నువ్వు నోటిస్ చేయలేదా?" అంటూ భావయుక్తమైన సందేశం ఏదో కను బొమ్మల వంపులో ప్రకటించాడు.

గ్రహించినట్లుగా కుమార్ తల పంకించాడు.

ఆ సంకేత భాషను శ్రీమంత్ గ్రహించక పోలేదు. తన సమక్షంలోనే ఆ యిద్దరూ అలా తనను గురించి మాటలాడుకోవడం, తన ఆఫీసర్ దృష్టిలోనికి తనను అలా ప్రత్యేకంగా తేవడం అనేది శ్రీమంత్‌కు చాలా యిబ్బందిగా వున్నది.

మహేష్ కేవలం డబ్బు మనిషి, ఆఫీసర్ కూడా అంతేనని వినికిడి, అందుకే యిరువురూ స్నేహితులేమో? ఇంతకు ముందే సహోద్యోగుల మాటలలో ఆ విషయాలు స్పష్టమైనాయి కూడా.

అటువంటి వారు వేసే ప్రతి అడుగు ధనంతో బేరీజు వేస్తారు. ఆడే ప్రతిమాట తూచి తూచి మాటలాడుతారు. చేసే ప్రతిపనికీ ఒక అర్థమూ, ఒక ప్రయోజనమూ ఆశించుతారు.

మరి ఎన్నడూ లేనిది తనతో నేడిలా ఎందుకు మాటలాడుతూన్నట్టు?

"ఏమిటో దీని వెనుక గల కుంభకోణం?"

"మీది లవ్ మారేజ్ అయితే మరి–మరీ అంతగా క్రొత్త వాళ్ళల్లే మాటలాడుకోవడానికే బిడియ పడ్తుంటారేమోయ్? మా ఎదుట నటనా?"

కుమార్ ప్రశ్నకు విస్మయంగా చూచాడు కానీ చెదరని గాంభీర్యంతో మౌనం–నిలబడ్డాడు శ్రీమంత్ ఆలోచించతూ.

అతి సన్నిహితులు కూడా అడగలేని–డగరాని లజ్జాహీనమైన ప్రశ్న అది. ఇతడికింత చనువేమి?

ఎవరో పిలువగా ఆఫీసర్ అటు వెళ్ళిపోయాడు.

మిగిలిన మహేష్ సిగరెట్ తీసికొంటూ ఓరగా శ్రీమంత్ దెస చూచాడు.

"బై మహేష్!" అంటూ వెళ్ళిపోతున్న శ్రీమంత్‌ను వారించాడు మహేష్. "బై చెప్పకు–నేనూ ఉంటున్నా వార్టీలో"

శ్రీమంత్ మాటాడలేదు.

"శ్రీమంత్ ఒక మాట?"

"సారీ! మన ఇరువురికీ ముఖ పరిచయం మినహా ఏ స్నేహాలూ లేవు. ఎందుకి

మాటలు?"
మహేష్ గర్వంగా అతిశయంగా చూచాడు.

"పరిచయాలూ లేవు, కలహాలూ లేవు. అయినా మాట్లాడితే ఏమైనా ప్రమాదమని భయపడ్తున్నావా?"

శ్రీమంత్ కోపంగా చూడటంతో మహేష్ నవ్వేశాడు, కానీ ఆనవ్వులో కృత్రిమం కురిసింది.

"మావంటి వారితో పరిచయాలకు నీవు గర్వపడాలి శ్రీమంత్. నాతో చుట్టరికం ఏర్పడడంతో ఇక మీ ఆఫీసర్ నీపై ఈగను కూడా వాలనీయడు, నీకు నాఅండ శ్రీరామ రక్ష!"

"మహేష్!" పళ్ళు కొరుకుతూ అన్నాడు శ్రీమంత్. "పరాయి ఆశ్రయానికీ, ప్రాపకాలకూ, పర ధనానికీ ఆశించే హీనులెవరికైనా విన్పించు ఈ డంబాలు. జాగ్రత్త. నాతో హద్దులు పాటించి మాట్లాడు."

నిర్లక్ష్యంగా, అహం ప్రకటితమౌతూన్న నవ్వు లాస్యం చేసింది మహేష్ వికట వదనంపై.

"డబ్బులేని అహంభావం, పౌరుషం యింతే" సిగరెట్ వెలిగించిన అగ్గిపుల్లను ఉఫ్ న ఊదుతూ నేలకు విసిరాడు.

"చూశావా దాని వెలుగు కొన్ని సెకనులు. అంతే."

శ్రీమంత్ తీసిపోలేదు.

"ఔను మహేష్, అంతే దాని వెలుగు. వాడి కాళ్ళు కడిగీ, వీడి చెప్పులు తుడిచి, మరొకడి నోరు కొట్టీ వెలిగే నడమంత్రపు సిరిగాళ్ళకు అది చక్కటి ఉదాహరణ!"

మహేష్ పెదవులపై నవ్వు అంతరించింది.

"నీధనాన్ని నీనోరుకొట్టి నేనెపుడూ తీసుకున్న జ్ఞాపకం లేదు. బహుశా శశి విషయం నీమనసున ఉన్నదేమో—అయితే శశిరేఖ తనంత తానే నిన్ను వదలి నన్ను చేరంవ వచ్చింది. మరి అభినందనలు చెప్పవూ?"

"కంగ్రాచ్యులేషన్స్ మహేష్." క్రోధంతో జేవురించిన ముఖంతో, మనసును అతి ప్రయత్నంతో అదుపులో పెట్టుకుంటూ అన్నాడు శ్రీమంత్. "హార్టీ కంగ్రాట్స్ మహేష్. ఆ విషయంతో నేను నిన్ను విమర్శించడం లేదు. ఆ వెనుక నున్న నీ ధన దాహాన్ని నేను గర్హించుతున్నాను."

"ఓ!" మరో సిగరెట్ వెలిగించుతూ వేళాకోళంగా నవ్వాడు మహేష్. "ఔను పాపం, ఇక నీకు ఇవ్వడానికి మామగారి దగ్గర ఏమీ మిగలదు. అదా నీ బాధ?"

"మహేష్! మగవాడు కానివాడు మామ ధనం ఆశించాలి!"

"ఆగు. లెక్చర్లు వినే టైము లేదు. నేను అంత డబ్బు ఎందుకు గుంజుతున్నానో తెలుసా? నీ పొగరణచటానికే. నీవు కట్నం వద్దని గొప్పలు పోయినా మామగారి ఆస్తి సగం ఎటూ దక్కగలదని భావించావు. అది దక్కని నాడు నీ ఆదర్శాలూ, సత్యసంధతా ఉపన్యాసాలూ ఏ మాత్రం నిన్ను ఆదుకుంటాయో చూడు. ఆఫ్టరాల్—అయిదారు వందల జీతగాడికి ఆదర్శాలు వుండకూడదు శ్రీమంత్. లౌక్యం! లౌక్యం వుండాలి; మాబోటి పెద్దలపట్ల వినయం, విధేయతా వుండాలి. ఆఫ్ కోర్స్—ముందు ముందు నీ అనుభవాలే నీకు అపాఠాలన్నీ చెప్తాయనుకో!"

"మహేష్" అతి మెల్లగా కరకుగా వున్నది శ్రీమంత్ సంభోదన "నువ్వు ఎందుకిలా నన్ను కవ్వించుతున్నావో నాకు తెలుసు, సహోద్యోగుల ఎదుట నీమీద చెయ్యి చేసుకో



నవే ధైర్యం! హక్కుగా నేను పొంద వలసిన దానిపై అధికారం వదులుకొని నీకు దానంగా వదిలి వేయడంతో మామగారి మనసులో నాపై గౌరవమేర్పడి నందుకు నీవు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతున్నావు! సారీ! ఈబాధ నీకు జన్మాంతం వుంటుంది. నీ మరో బాధ. శశీ నేను పూర్వం స్నేహితులమనీ, ఆ దుగ్ధను కప్పిపుచ్చి డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నావు. మహేష్! నిర్మలమైన మనస్సుతో జీవితంలో ప్రవేశించమని నా సలహా; ఆనందంగా గడపాలని మీకు నా ఆశీర్వాదం. అతి తెలివిగా కన్పించే శశికి ఆలోచన తక్కువ; అమాయకురాలితో ఆడుకోకు. జీవితాన్ని వ్యాపార దృష్టితో చూడకు."

స్వరం మెల్లగా వున్నా ఒక్కోమాటా పదునుగా విసరి, వేగంగా నడచి వెళ్ళిపోయాడు.

మహేష్ అక్కసు అంతా అతడు సిగరెట్‌ను నేలను రాచిన విధంలో కనపడింది.

నిష్క్రమించుతూన్న శ్రీమంత్‌ను భస్మం కావించేట్టు చూస్తూ, పళ్ళుకొరకుతూ నిలచిన అతడిని పరిశీలనగా గమనించుతూ సమీపించాను కుమార్.

"మీ తోడల్లుళ్ళ నడుమ నేనెందుకని అలా వెళ్ళిపోయాను."

"నాన్సెన్స్. వాడికి మనతో మాట్లాడగలంత విజ్ఞానం లేదు. చాలా మామూలు జీవితం. పేదవాడు!"

ఇద్దరూ విరగబడి నవ్వుకున్నారు.

"కానీ వీడు మనకు ముందుముందు దారిలో ముల్లు కాగలడేమోనని భయపడుతున్నాను" అన్నాడు సాలోచనగా మహేష్.

కుమార్ తేలిగ్గా పెదవి విరిచాడు.

"ఆ ఫ్రొఫైల్ ఓ సబార్డినేట్ గాడా? నెవ్వర్. అటువంటి భయాలేమీ అక్కర్లేదు. అతడసలు మైల్డ్ ఫెలో, తల ఎత్తే ధైర్యం వుండదు. వున్నా అణచి వుంచగల అధికారిని నేను!" అన్నాడు గర్వంగా

మరలా ఇద్దరూ నవ్వుకున్నారు.

"నువ్వూ రారాదూ నీ కాబోయే మిసెస్‌ను తీసుకుని పార్టీకి?"

"ఛ. ఇలాంటి నీరసపు పార్టీలు మీ ఆఫీసు వాళ్ళతోనే చేసుకో. మన మజా పార్టీ ఎల్లుండి రాత్రి మా ఇంట్లో. మన స్థాయికీ, అభిరుచులకూ తగిన వారు మాత్రమే వుంటారక్కడ. తప్పకరా, వెళ్తున్నా."

"ఆఁ కుమార్" కారులో కూర్చుంటూ తిరిగి జ్ఞాపకం వచ్చినట్లు ఆగి చెప్పాడు మహేష్.

"మీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌నూ తీసుకురావడం మరచిపోకు."

"ఓకే ఓకే!"

"నేను కూడా పర్సనల్‌గా పిలుస్తాననుకో."

"ఆల్ రైట్"

ఇద్దరి ముఖాలూ ఆనందంతో వెలిగిపోతూండగా కరచాలనాలతో వీడ్కోలు తీసుకున్నారు.

శ్రీమంత్, తదితరులూ అంతా గమనించుతూనే వున్నారు. అయినా ఇంతకు ముందువలె సహోద్యోగుల నుండి ఎటువంటి విసుర్లూ, వ్యాఖ్యానాలూ వినరావడంలేదు.

తాను ఆఫీసర్‌కూ అతడి సన్నిహితులకూ సంబంధికుడని వాళ్ళు నోళ్ళు విప్పక జాగ్రత్త పడుతున్నారు.

ఈ యదార్థం గ్రహించిన శ్రీమంత్ మనసు మండిపడింది.

మహేష్ వాంఛ అదే కావచ్చు. వక్ర హృదయుడైన అతడు తనకు కంటిలో నలుసునని అన్యాపదేశంగా ఇలా వ్యక్తీకరించాడు. అటు ప్రాజెక్ట్ మానేజర్ దృష్టిలోనికి తనను తీసుకువచ్చాడు. ఇటు సహోద్యోగులు తనకు జడిసి దూరంగా వుండేట్లు చేశాడు.

"సారీ శ్రీమంత్. మన మాటలేమీ మానేజర్‌గారి చెవిన వేయకు సుమా!"

చనువుగల ఒకతడు అన్నాడు.

"అదృష్టవంతుడవులే. మాలాగ ప్రమోషన్ల కోసం అవస్థలు పడనక్కరలేదు."

మరో కాకారాయుడు హేళన మిళాయించి అభినందించాడు.

శ్రీమంత్‌కు చికాకనిపించింది.

"భయ్యాలేదు. నిశ్చింతగా వుండండి నాకు ప్రమోషన్ వచ్చినా మీ పేరన ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను. సరేనా?"

ఆ తీవ్రత గమనించిన సహోద్యోగులు మరి మాటలాడలేదు.

కానీ, వాతావరణంలో మార్పూ కాలుష్యమూ ఏర్పడినవనడానికి నిదర్శనంగా వారిలో వారు నెమ్మదిగా రహస్యంగా మాటలాడుకోవడమూ, కన్పించీ కన్పించని చిరునగవులు చిందించుకోవడమూ జరుగుతోంది.

"శ్రీమంత్!"

ఖిన్న వదనంతో నిలిచి వున్నది వకుళ

"వెళ్ళిపోదాం పద" అన్నది.

"ఏం?"






ఆరోగ్యంచిందే పళ్ళు, చిగుళ్ళకోసం
నమ్మకంగా వాడబడేది లవంగనూనె

కొత్త ఇదిగో

ప్రామిస్ పళ్ళపొడి

అనాదిగా వాడబడుతున్న లవంగనూనెతో కూర్చినది



లవంగనూనెతో చేసిన ప్రామిస్ పళ్ళపొడి మీకెలా తోడ్పడుతుందో చూడండి.

- నోటిలో దుర్వాసనను, దంతక్షయాన్ని కలిగించే క్రిములను తొలగిస్తుంది, మీ శ్వాసని సుభ్రంగా రూపొందిస్తుంది.
- మీ చిగుళ్ళ ఆరోగ్యం చిందించేలా దీని అతి మెల్లగా రుద్దుతుంది.
- మీ పళ్ళను తెల్లగా తళతళలాడేలా చేస్తుంది.
- పిప్పరమెంట్ మరియు లవంగనూనె యొక్క సాటిలేని రుచి.

కొత్తది సాటిలేనిది. లవంగనూనె గలది
ప్రామిస్ పళ్ళపొడి

బలసారా

"నాకు విపరీతమైన తలనొప్పిగా వుంది. జ్వరం వస్తుందేమో."

ఆ మాటలపై శ్రీమంత్‌కు నమ్మకం లేనట్లుగా అతడి వదనమే చెబుతోంది. అయినా ఆ వాతావరణం తనకూ సమ్మతంగా లేనందున వెంటనే అంగీకరించాడు.

అందరికీ నామకార్థంగా చెప్పి సెలవు తీసుకున్నారు.

"డాక్టర్ దగ్గరకు వెళ్దామా?" అన్నాడు దారిలో.

"వద్దు. నిజంగా నాకు జ్వరంలేదు."

"ఆ సందేహం నాకూ కలిగింది." అంటూ ప్రశ్నార్థకంగా చూచాడు.

సందిగ్ధంగా చూస్తూనే కడకు అంతా చెప్పింది వకుళ.

"మహేష్‌ను చూచాక అక్కడ మహిళలలో ఏమిటో చాలా సంచలనం రేగింది."

"అంటే? వివరంగా చెప్పు వకుళా."

"నీవు తెలుసుకోకపోవడమే మంచిది."

"హుం. ఇంత జరిగాక తెలుసుకోకుండా ఎలా ఉండగలను?"

"................"

మహేష్ చుట్టాన్ని గనుక నాకు ఆఫీసులో త్వరలోనే యింక్రిమెంటూ, రోజుకో డిపమోషనూ రాగలదని అసూయమ్మలెవరైనా ఆడిపోసుకుంటున్నారా?"

ఆశ్చర్యంగా చూచింది వకుళ.

"నిజం శ్రీమంత్. సరిగా అలాగే అన్నారు. ఆ శర్మ భార్య, ఇంకొకావిడెవరో..."

"నేను ఆఫీసులో యువరాజు పదోదాలో వెలిగిపోతుంటానని ఊహాగానం చేసిందా?"

"అంతకంటే పెద్ద విషయమే అడిగింది."

"ఏమిటో"

"శశిరేఖతో ప్రణయం సాగించి, నాతో వివాహమెందుకు జరిగిందని?"

శ్రీమంత్ వదనం మ్లానమైంది.

"పరాయి వాళ్ళని మననే ఇంత ఇరకాటపు ప్రశ్నలు వేస్తే అందరి ఎదుటా-ఇక ఇంట ఆ దురదృష్టవంతురాలైన భర్తను ఎలా వేధించుతోందో! ఆధునిక స్త్రీనని చాటుకోవడం వేషంలో-ఆటవికుల కంటే వెనుకబడి వున్నానని ప్రవర్తనలో నిరూపించుకోవడం. ఛీ ఆ ప్రశ్నతో మరో నలుగురు స్త్రీలకు కుతూహలం ఎక్కువైపోయింది. అందుకే వచ్చేశాను. నువ్వేమి అనుకోవు కదా శ్రీమంత్?"

నీరసంగా నవ్వి ఊరుకొన్నాడు శ్రీమంత్.

"మహేష్ నీతో చాలా మాటలాడాడు. ఏమిటది శ్రీమంత్?" అనడిగింది మరలా.

"పోట్లాటకు దిగుతున్నాడు. మాటల సరసత అతడికి తెలిసి వున్నట్టు లేదు."

"పోట్లాటా?" నివ్వెరపోయింది. "ఎందుకూ?"

వెంటనే మాట్లాడలేదు శ్రీమంత్.

"వకుళా." ఆలోచిస్తూ, మరో ప్రపంచంలోనుండి మాట్లాడినట్లు మాట్లాడాడు ఇల్లు జేరాక.

"మహేష్‌తో మీ అక్క ఏ మాత్రం సుఖపడ్తుందో నాకు తెలియడంలేదు."

వకుళ విస్మయంగా చూచింది.

'మీ అక్క' అని శ్రీమంత్ నోటి నుండి మొదటిసారిగా విన్నది. ఎప్పుడు మాట్లాడినా 'శశి' అనేవాడు.



అందాల సుందరి శ్రీదేవి...అపురూపమైన
ఆమె అందానికి తోడ్పడేది లక్స్.
LUX
ఎంత సున్నితమైన అందం శ్రీదేవిది!
మురిపించేసే ఆమె చర్మ సౌందర్యం...
ఓహ్! ఆమె ఆ అందానికి మెరుగులు
దిద్దుకునేందుకు తోడ్పడేది లక్స్
అని ఆమె భావన.
"నా చర్మ సౌందర్యానికి ఆ మృదుత్వం.
ఆ అందం అందించేందుకు నాకు
లక్స్ కావాలి'' అంటుంది శ్రీదేవి.
శుద్ధమైన, సౌమ్యమైన లక్స్—
సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే సబ్బు

"మహేష్ డబ్బు మీద నడుస్తాడు, నిషా ద్రవ్యాలలో జలక మాడతాడు. ఎక్కడైతే డబ్బు పొంగి పొరలుతుందో అక్కడ స్త్రీకి సుఖమూ, గౌరవమూకూడ తక్కువే!"

"పోనీ అక్కను హెచ్చరించి చూడు శ్రీమంత్!"

"హుఁ మీ అక్క వినదు సరికదా... ఎదురు అపార్థం చేసుకొంటుంది."

వకుళ శ్రీమంత్ కనులలోనికి సూటిగా చూడసాగింది ఎవో భావాలు వెదకుతూ.

"అక్క అమాయిక అని నీకు తెలుసు శ్రీమంత్. ఆమె పేరును కూడ ఉచ్చరించనంత ద్వేషాన్ని పెంచుకోకు శ్రీమంత్!"

"ద్వేషం లేదు వకుళా, నేను ఆ పేరెత్త కూడదు. ఆ సంబోధనాధికారం మహేష్‌ది!"

వకుళ కనుదోయి ఆశ్చర్యంతో—హృదయం ఆనందంతో పరవశ నాట్యమొనరించాయి.

"ఎంత దూరంగా ఆలోచిస్తాడు శ్రీమంత్! ఎన్ని హద్దులు పాటించుతాడు!"

29

మహేష్ మాటలు వింటూనే శశిరేఖ ఆమోదాశ్చర్యాలు ప్రకటించింది.

"ఓ నువ్వు ఇంత పథకం వేశావా మహేష్?"

"మరి? ప్రేమ పెండ్లికి కట్నం ఏమిటి" అని గురిశావు నువ్వు, నిన్నూ నన్నూ విమర్శించేవాడు—శ్రీమంత్ పొగరణిగే పథకం నేను వేశాను. నా డబ్బుకూ నాకూ వాడు త్వరలోనే దాసోహ మనకపోతే చూడు! అయితే, ఈ రోజు మాత్రం మాటలు పడ్డాననుకో ఆ అల్పుడితో ఆదైనా నీ కోసం—నీ స్నేహితుడు కదా అని క్షమించేసి వచ్చేశాను తన్నకుండా"

శశికి కోపం కల్గింది

"నా స్నేహితుడేంకాదు. మరోసారి అలా అనకు, వాడి హద్దు మీరిన ప్రేలాపన ఏమిటో ఇప్పుడే అంతు తేల్చుకుంటాను. వెళ్తున్నాను."

కారాలు మిరియాలు నూరుతూ వచ్చిన తల్లినీ అక్కనూ చూచి ఆశ్చర్య పడలేదు వకుళ, భయం చెందింది. ఆ యిద్దరి నాలుకలకూ హద్దూ పద్దూ వుండదు. శ్రీమంత్ ఇంట్లోనే వున్నాడు కూడా!

సందడి విని కూడా అతడు తన గదినుండి బయటికి రాలేదు.

వకుళ భయపడినంతా జరగనే జరిగింది.

"వకుళా! శ్రీమంత్ యింట్లో వున్నాడా?"

"ఎందుకమ్మా?" భయపడుతూ అడిగింది.

"ఎందుకో నీకు చెప్పాలన్నమాట?"

"సందేహమా? చెప్పి తీరాలి."

విశ్వేశ్వరి వకుళను నఖశిఖ పర్యంతం ఆగ్రహంగా చూచింది.

"మహేష్‌ను ముఖంమీదే తిట్టడంలో శ్రీమంత్ ఉద్దేశమేమిటో అడగ వచ్చాను. ఎందుకత మస్థ మహేష్ అంటే? అతడు మాకు కాబోయే అల్లుడు!"

"కాబోయే అల్లుని చూచుకుని వచ్చిన అల్లుడిని మరచిపోయావామ్మా? శ్రీమంత్ కూడా నీకు అల్లుడే!"

"కాదనలేదు. కానీ తర తమ భేధాలు గుర్తించి ప్రవర్తించాలి. అతడెక్కడ—తానెక్కడ—నోటికి వచ్చినట్టూ మాటలాడడానికి, మహేష్ గనుక సరిపోయింది కానీ

మరెవరైనా అయితే పెళ్ళి చెడిపోను."

"చెడగొట్ట డానికే పథకం వేశాడేమో?" శశిరేఖ అన్నది.

వకుళ చీదరింపుగా చూచింది.

"అమ్మా! వాళ్ళిద్దరూ ఎక్కడ ఏం మాటలాడుకున్నారో నేనూ నువ్వూకూడా చూడలేదు. ఏమైనా అనుకున్నా అవి ఆ యిద్దరి గొడవ! మధ్యన నీకెందుకు? మహేష్ ఆడదానిలాగా నీవరకూ తెచ్చాడా మగవాళ్ళ మాటలను?"

విశ్వేశ్వరి మాటలకు తడుముకోవలసి వచ్చింది. క్రోధం అధికమై రొప్పుతున్నది,

"నువ్వుకూడా నీ భర్తను సమర్థించు కుంటున్నావే? వకుళా! ఒక్కటడుగుతాను చెప్పు?"

"ఏమిటమ్మా?"

"కట్నకానుకలు వద్దనీ, క్లుప్తమైన వివాహం కావాలనీ అంతేకదా కోరుకున్నాడు. అలాగే జరిగింది. ఈరోజు మహేష్ అన్నీ కావాలన్నాడు—ఘనంగా చేస్తున్నాం. ఆ అడిగేదేదో మమ్మల్నే అడగక మధ్యన నలుగురిలో వుండగా మహేష్‌ను చిన్నబుచ్చడ మేమిటి? ధన దాహమనీ అప్రయోజకుడనీ మామగారి డబ్బుకు పక్కర్తి పడుతున్న కనాకష్టపు వాడనీ నానా మాటలూ అన్నాడట, తనకెవెడిచ్చాడట ఆ అధికారం? తనది గనీ ఈయడం లేదుగదా?"

"తనది ఇస్తున్నావో లేదో నీ అంతరాత్మను అడుగమ్మా, గుండెపై చేయివేసు కొని చెప్పు మాది ఇవ్వడం లేదని, అక్కతో సమంగా యింట జన్మించిన వాడే ఆ యింట్లో దంతా నాకూ సగం అధికారం వున్నది. నేను వదలు కొన్నందుకు సంతోషించక ఎదురీ తిష్ఠురాలు వేయడానికి నీ మనస్సెలా ఒప్పుతోందమ్మా? పేచీకోరు అల్లుడు కాదు గనక నీవెంత పెడసరంగా నయినా మాటలాడవచ్చును కుంటున్నావా? అది నేను సహించను."

"చూడగా మాకి పెడ్లి జరగడం యిష్టం లేనట్లున్నదే?"

"ఇష్టమున్నదో లేదో నాన్నగారినడుగమ్మా తెలుస్తుంది. ఇప్పటికి ఈ మాటను నీవూ అక్కా ఎన్నోసార్లు అన్నారు!"

"నీ యిష్టమెవడికాకువాలే టోడి యిష్టం. విను. మహేష్‌తో కయ్యాలకు దిగే ముందు తన అంతస్థేమిటో జ్ఞప్తిలో వుంచుకొమ్మను నీ భర్తను."

"హుం. నేను చెప్పక్కర్లేదమ్మా, అదుగో ఆ గదిలో నుంచి అంతా వింటున్నాడు శ్రీమంత్"

"ఆ! నేను వస్తే ఇంత నిర్లక్ష్యమా? లేచి బయటికైనా రాడూ?"

"రాడమ్మా, ఆతడి! తన అంతస్థు తెలుసు!"

"ఓ!" నిర్లక్ష్యంగా కళ్లు త్రిప్పింది శశిరేఖ. "అది ఎంత ఎత్తయిన అంతస్థు? మీ మహారాజ భవంతి ఈ పెంకుటిల్లేగా? అదికూడా నాన్నగారి ఇల్లు!"

"అక్కా! ఆ అంతస్థు ఎంత ఎత్తయినదో నువ్వు చూడలేవు. తన కాళ్ళపై తాను నిలబడగల శక్తిగల అంతస్థును మించిన ఎత్తయిన యశస్సు వదిలేదు ఈ ప్రపంచంలో. తన భార్యను తన స్వశక్తితో పోషించగల అంతస్తు, తన చుట్టూవున్నవారికి నీడా, నైర్మల్యమూ ఇవ్వగలంత స్తోమతా, పటిష్ఠతా గల మేరు పర్వతం. ఆపర్వతం ఎత్తు నీవు కొలవలేవు. అది ఎవరికైనా ఎప్పుడైనా అనుకొన గలదని మాత్రం మరవకు."

"ఏమన్నావ్? తనకు తాను ఓ ఠికానా ఏర్పరచుకుంటే ఇతరుల విషయం ఆలో చించవచ్చు."

"శ్రమజీవికి తనరెక్కలే భరోసా, అది ఠికానాలేని జీవితంకాదు. అక్కా, అమ్మా

నిజంగా చెప్తున్నాను.... శ్రీమంత్ తరఫున, మీ కెప్పుడు ఏ అవసరమూ, అండా కావలసినా నిర్భయంగా మమ్మల్నడగవచ్చు!"

"చాలా అతిశయంగా మాట్లాడుతున్నావే?" విశ్వేశ్వరి స్వరంలో హేళనా వైఖరి.

"ఔను అత్తయ్యా!"

ఉలికిపడి అందరూ ఆ స్వరం వచ్చిన దెస చూచారు. శ్రీమంత్ గుమ్మం పొడవునా నిలబడి వున్నాడు.

"అత్తయ్యా, నాసాహాయ్యం, సహకారం మీకెప్పుడూ వుంటాయి. నన్నపార్థం చేసుకోకండి. మీ పెద్దమ్మాయిని మహేష్ కిచ్చేముందు బాగా ఆలోచించావేమో?"

శశి ముక్కుపుటాలు అదిరాయి.

విశ్వేశ్వరి ముఖం జేవురించింది.

ముక్త కంఠంతో అన్నారు.

"నువ్వు మాత్రం ప్రతి మాటకూ ముందు బాగా ఆలోచించకోవాలి శ్రీమంత్. చేరదీసి, బ్రతుకొక్క రూపం ఇచ్చినందుకు ఘాతుకత్వం ప్రదర్శించకు, నీ హద్దుల్లో నీ వుండు."

ఆజ్ఞాపించి, సుడిగాలి రేగినట్లుగా నిష్క్రమించిన ఆ యిరువురినీ మతి మారిన వాడిలా చూస్తూండి పోయాడు శ్రీమంత్.

"శ్రీమంత్!" చాల తడవు అనంతరం భయం భయంగా పలుకరించింది వకుళ.

"ఏమిటి?"

"నిత్యం ఈ గొడవలు భరించలేము. మరో వూరికి ట్రాన్స్ఫర్........."

"వద్దు. భయపడి పారిపోవలసిన నేరస్థులం కాదు."

"అది కాదు నేననేది........."

"తెలుసు."

"అక్క పెళ్ళితో ఈ పట్టుదలల కథకు ముగింపు జరుగుతుందనుకున్నాను." దిగులుగా వున్నది వకుళ కంఠస్వరం.

"కానీ కథ ఇప్పుడే మొదలైంది!"

అంటూన్న శ్రీమంత్ కంఠంలోని పట్టుదలకు కలవరపడింది వకుళ.

"శ్రీమంత్! ఈ ప్రచ్ఛన్న యుద్ధం......."

"ఔను. ఈ ప్రచ్ఛన్న యుద్ధం ఒకనాడు పరాకాష్ఠత నంది తీరుతుంది." స్థిరంగా అన్నాడు.

"భగవాన్!"

కన్పించని దైవానికి నిస్సహాయంగా మ్రొక్కడం మినహా ఏమీ పాలుపోవడంలేదు వకుళకు.

(సశేషం)



Edited & Published by V. Leelavathy Raghavaiah. at 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers. 1-8-4/1/1 Chikkadpalli Hyderabad-500 020